₹30

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక

మార్చి - 2020

DECCAN LAND, HYDERABAD

91







- నలభై వసంతాల మాభూమి
- మునగాకు పొడి - ఔషధాల ఒడి
- వినమ్ర విమర్శకుడు అమ్మంగి
- పిల్లలను సాహిత్యం వైపు మళ్లించాలి





*Artist:*

**U. VIJAY KUMAR**

మానవ సంఘర్షణకు అద్దం పట్టే వైవిధ్యమైన చిత్రాలను గీయడంలో ఆరితేరిన మేటి చిత్రకారులు యు.విజయ్ కుమార్. పరిసరాలను ఒడిసిపట్టి తన మేధస్సుతో రంగుల ప్రపంచాన్ని ఆవిష్కరించారు. మనుషుల మధ్య అనుబంధాన్ని పెంపొందించేలా ఆయన గీసిన చిత్రాలు ఆప్యాయతకు అద్దం పట్టాయి. బరోడా విశ్వవిద్యాలయం కేంద్రంగా నేర్చుకున్న మెళకువలు తనకు భవిష్యత్ మార్గంగా నిలిచాయి. మనుషులకే కాదు ప్రకృతికీ ఎన్నో కష్టనష్టాలుంటాయని, వీటిని విడదీయలేమని తన బొమ్మల్లో నిక్షిప్తపరిచారు.



























## ఆయిల్ కలర్స్‌తో అద్భుతాలు

ఎలాంటి రంగంలోనైనా కృషి ఉంటే రాణించవచ్చని నిరూపించారు చిత్రకారులు యు.విజయ్‌కుమార్. 50 వసంతాల చిత్రలేఖనంలో ఆయిల్ పెయింటింగ్స్ ద్వారా దేశవిదేశాల్లో వందల సంఖ్యలో ప్రదర్శనలు నిర్వహించారు. ప్రకృతిలోని కొండకోనలు, చెట్లుచేమలను తన కుంచెతో కుదురుగా గీసి మెప్పించారు. విభిన్నమైన ఆలోచనలకు వైవిధ్యతను జోడించి ఎన్నో అందమైన చిత్రాలకు ప్రాణం పోశారు. పెయింటింగ్‌పై పోస్టుగ్రాడ్యుయేట్ చేసి, ఎక్రిలిక్ రంగుల ప్రపంచంలో ప్రవేశించి కాలానుగుణంగా తన ప్రతిభను మెరుగుపర్చుకున్నారు.

TELANGANA
RESOURCE CENTRE

**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com







## సుస్థిరమైన సమాజం కోసం..

సుస్థిరమైన సమాజ అభివృద్ధిలో సాహిత్యం కీలకపాత్ర అనే ఆర్టికల్ బాగుంది. హైదరాబాద్ సాహితీ ఉత్సవాల్లో కళలు, సంస్కృతి, వారసత్వ సమ్మేళనాలు, కళాత్మకమైన అంశాలపై గురించి చాలా చక్కగా వివరించారు. క్రియేటివ్ రైటింగ్స్‌పై చర్చాగోష్టులు, సదస్సులు, పుస్తకావిష్కరణలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సాహితీ పండుగ భావప్రకటన స్వేచ్ఛకు వేదికగా నిలిచింది. విభిన్న కోణాలకు చెందిన సాహిత్యం, కళారూపాలు అకడమిక్, క్రియేటివ్ రైటింగ్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ మొదలైన అంశాలపై చక్కగా వివరించారు.

– కె.రాజేష్, వరంగల్

❖ ❖ ❖

## రంగుల హరివిల్లు అప్జా తమ్మనాథ్ ఆర్టికల్ సూపర్

తాను ఎంచుకున్న రంగాన్ని ఇష్టపడాలని, ఆ తర్వాత కష్టపడాలని, అప్పుడే విజయం సాధిస్తారని ఆర్టిస్టు అప్జా తమ్మనాథ్ ఆర్టికల్‌లో చాలా చక్కగా వివరించారు. ఆమె గీసిన కళాత్మకమైన పెయింటింగ్స్‌ను వివిధ దేశాల్లో ప్రదర్శించినతీరు గురించి వివరించారు. నగరంలో జన్మించి,నగరంలో ఉన్నత చదువులు అభ్యసించి పేయింటింగ్‌లో దేశవిదేశాల్లో కీర్తిప్రతిష్టలు సంపాదించిన విధానంపై చక్కని వ్యాసం రాశారు. ఇది చాలా ఆదర్శంగా ఉంది.

–డి.మల్లేష్, రంగారెడ్డి

❖ ❖ ❖

## కవర్ పేజీ చాలా బాగుంది

దక్కన్‌లాండ్ ఫిబ్రవరి సంచిక కవర్‌పేజీ చాలా చాలా బాగుంది. అప్పుడప్పుడు, గుండ్ల పోచంపల్లి ఆవాసాలు, కల్లోలకలల కాలం, మిల్లెట్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ, ప్రేమావరణం, సెలెక్టివ్ ఆర్టికల్స్ సూపర్‌గా ఉన్నాయి.

– శారద

❖ ❖ ❖

### ఆన్‌లైన్ ద్వారా దక్కన్ ల్యాండ్ చందా చెల్లింపు

**దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరాలు**

Name : DECCAN LAND,
Kotak Account No: 7111218829
Bank: KOTAK MAHINDRA BANK
IFSC Code: KKBK0007463
Branch Code : 007463

## చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ కృషి అపూర్వం

బాలల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని భావిభారత పౌరులుగా చేసేందుకు చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ చేస్తున్న కృషి అమోఘం. గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ ప్రాంతాల్లో చదువుకుంటున్న పిల్లలను విద్యా, వైజ్ఞానికంగా తీర్చిదిద్దేందుకు చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ, బాలచెలిమి కృషి చేయడం శుభపరిణామం. పిల్లలకు వైవిధ్యమైన విజ్ఞానాన్ని అందించేందుకు ప్రతినెల బాలచెలిమి ముచ్చట్లు కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయం. ఇలాంటి కార్యక్రమాలు మాకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

– బి.రాజు,
డిగ్రీ విద్యార్థి, కరీంనగర్

## త్వరలో మీ ముందుకు 'బాలచెలిమి'

చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ ఆధ్వర్యంలో మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాస పత్రికను రంగులతో 52 పేజీలు త్వరలో అందచేస్తామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. బాలలలో సృజనాత్మకతను పెంచి విజ్ఞాన, వినోదాలను అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగే 'బాల చెలిమి'ని త్వరలో మీ ముందుకు తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రతి నెలా రెండవ శనివారం నిర్వహిస్తున్న **'బాలచెలిమి–ముచ్చట్ల'**లో ప్రసిద్ధ రచయితలు, మేధావులు, ఆర్టిస్టులు, ఫోటోగ్రాఫర్‌లు, పబ్లిషర్స్, ప్రింటర్స్ పాల్గొని తమ సూచనలు, సలహాలు అందిస్తున్నారు. బాల రచయితల నుండి బాలల కథలు, గేయాలు, కవితలు, స్కెచ్‌లు, వ్యాసాలు, పొడుపుకథలు, సామెతలు, జాతీయాలు బాలచెలిమిలో ప్రచురణ కోసం ఆహ్వానిస్తున్నాం. బాలచెలిమిని www.balachelimi.com వెబ్‌సైట్‌లో కూడా చూడవచ్చు.

–చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

బాల చెలిమి

**మీ రచనలు మాకు పంపవలసిన చిరునామా:**
ఎడిటర్, **"బాలచెలిమి", చంద్రం,** 3–6–712/2, స్ట్రీట్ నెం:12, హిమాయత్‌నగర్, హైదరాబాద్–500029, తెలంగాణ.
Mobile: 9030626288
E-Mail: desk.chelimi@gmail.com
Website: www.balachelimi.com

ISSN 2581-3188

విషయసూచిక

# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 8 సంచిక: 7 పేజీలు: 68

మార్చి - 2020

# లోపలి పేజీల్లో...




జస్టిస్ కుమారయ్య ........ అన్నవరం దేవేందర్ ........ 6

క్లీన్ అండ్ గ్రీన్ సిటీ మనందరి ధ్యేయం కావాలి ........ ఎం. వేదకుమార్ ........ 7

వినమ్ర విమర్శకుడు అమ్మంగి ........ సంగిశెట్టి శ్రీనివాస్ ........ 9

హిందూ ముస్లిం సమైక్యతకు సంకేతం 'చార్మినార్' ........ పరవస్తు లోకేశ్వర్ ........ 13

పర్యావరణం - శాస్త్రం - నైతికత - తాత్విక దృక్పథాలు ........ డా॥ ఆర్. సీతారామారావు ........ 15

చీర్యాలలో కళ్యాణీ చాళుక్యుల శాసనం ........ శ్రీరామోజు హరగోపాల్ ........ 19

మునగాకు పొడి - ఔషధాల ఒడి ........ స్వాతి, సుకుమార్, ఉమారెడ్డి ........ 21

గ్లోబల్ ఆర్ట్ ఆధ్వర్యంలో బాలభవన్‌లో చిత్రకళా ప్రదర్శన ........ సచిన్ ........ 25

తొలి తెలుగు సినీ గేయాలు - చందాల కేశవదాసు పాటలు ........ అంబటి వేకువ ........ 25

1938లో హైదరాబాద్‌కు మొదటి రంజీ ట్రోఫీ ........ ఖైజర్ భాషా ........ 28

నలభై వసంతాల మాభూమి ........ హెచ్. రమేష్‌బాబు ........ 29

మనిషి భావాలకు రంగులద్దిన వర్ణధారి విజయ్‌కుమార్ ........ రామకృష్ణ కాంపాటి ........ 39

అప్పుడప్పుడు - 12 ........ బి. నరసింగరావు ........ 41

కొలాము గిరిజనుల పెండ్లి - పాటలు ........ ఆత్రం మోతీరామ్ ........ 43

మంచి సమాజం కోసం గొప్ప సాహిత్యం అవసరం ........ కట్టా ప్రభాకర్ ........ 47

పిల్లలను సాహిత్యం వైపు మళ్లించాలి ........ జుగాష్‌విలి ........ 51

జీదిమాజా ఒక ప్రపంచ కవి ........ డా॥ ఎన్.గోపి ........ 53

సంస్కృత సాహిత్యంలో డా.॥ పెన్నా మధుసూదన్ ........ డా॥ ఎస్.రఘు ........ 55

మదర్స్ డే - అమ్మల దినం ........ డా॥ కపిలవాయి లింగమూర్తి ........ 59

ప్రాణం వాసన... సమాజపు చైతన్య సువాసన.. ........ వినాయకం ప్రకాష్ ........ 63

పుస్తక పరిచయం ........ దక్కన్ న్యూస్ ........ 65

పుస్తకాలు ........ దక్కన్ న్యూస్ ........ 66


'దక్కన్ ల్యాండ్'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను ప్రజాస్వామిక అభిప్రాయ వేదికగా, ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక సాహిత్య విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, సమస్యలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే 'దక్కన్ ల్యాండ్' లక్ష్యం.


సంపాదకులు

**మణికొండ వేదకుమార్**

9848044713

editordeccan@gmail.com

సహాయ సంపాదకులు

**కట్టా ప్రభాకర్**

**జుగాష్ విలి**

సర్క్యులేషన్

**హెచ్. మోహన్‌లాల్**

వాణిజ్య ప్రకటనలు

**సయ్యద్ ఖైజర్ భాష**

9030626288

ఫొటోగ్రాఫర్

**టి.స్వామి**

8374995555

కవర్‌పేజీ ఫొటో

**యు. విజయ్‌కుమార్**

చిత్రాలు

**కూరెళ్ల శ్రీనివాస్**

layout & composing @

CHARITHA IMPRESSIONS

printed @ DECCAN PRESS

ఆజామాబాద్, హైదరాబాద్-500 020.

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND

"CHANDRAM" 3-6-712/2, St.No. 12,

Himayatnagar, Hyderabad - 500 029

TELANGANA

Mobile: 9030626288 Fax: 040-27635644

E-mail: desk.deccan@gmail.com

website : www.deccanland.com

**కృతజ్ఞతలు**

దక్కన్ ల్యాండ్ మాసపత్రిక సాహిత్యం విభాగంలో సలహాలు, సూచనలు అందించిన డా॥ ఎస్. రఘుకు మా కృతజ్ఞతలు.

# కుమారయ్య (జస్టిస్)

ఆయన జీవితాన్ని సమున్నతంగా గెలుచుకున్న న్యాయ కోవిదుడు జనధర్మం కోసం అత్యున్నత న్యాయ పీఠాన్ని అధిరోహించిన బహుజనుడు. సత్వర న్యాయం కోసం పరితపించిన న్యాయమూర్తి. నిరాడంబర జీవితం ఆయన ఆచరణ. ఆయన జస్టిస్ నాంపల్లి కుమారయ్య, జగిత్యాల జిల్లా, (అప్పటి కరీంనగర్ జిల్లా) కొడిమ్యాల మండల కేంద్రంలో శాలివాహన దంపతులైన నర్సింలు లక్ష్మమ్మలకు ఆయన 15.6.1901లో జన్మించారు. పని చేస్తేనే బతుకుతెరువు అయిన కుటుంబంలో పుట్టి అంచెలు అంచెలుగా విద్యార్హతలు సాధించారు. కుమారయ్య ఏ తరగతిలో ఉన్న ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడు అయ్యేవాడు. ఆయన విద్యాదాహాన్ని గమనించిన తండ్రి ఆయనను కొడిమ్యాలలో ప్రాథమికవిద్య, కరీంనగర్‌లో ప్రాథమికోన్నత విద్య, వరంగల్‌లో ఉన్నత విద్యను ఆనాటి నిజాం ప్రభుత్వ పాఠశాలలో ఉర్దూ మీడియంలో చదివించారు. అనంతరం ఆయన ఆగకుండా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరి డిగ్రీ, న్యాయశాస్త్రం విద్యను అభ్యసించారు. అనంతరం జరిగిన హైదరాబాద్ సివిల్ సర్వీసెస్ పరీక్షకు రాసి ప్రథమ ర్యాంక్‌లో ఉత్తీర్ణులయ్యారు. హైదరాబాద్ సివిల్ సర్వీస్ అంటే ఇప్పటి ఐ.ఏ.ఎస్. లెక్క. హైదరాబాద్ రాజ్యంలో 1931లో ఆయన సివిల్ సర్వీస్‌కు ఎంపికయ్యారు. ఆ పరీక్షలో ఎంపికైన వారి జాబితాను అప్పటి ప్రధాన న్యాయమూర్తి సర్ నవాబ్ మిర్జాయార్ జంగ్ ఉన్నతాధికారులు సమర్పించి ఒకరిని జ్యుడిషియరీకి ఎంపిక చేయమని కోరారు. అందరి పరీక్షాపత్రాలను చూసిన ఆయన కుమారయ్యను జ్యుడిషియరీకి ఎంపిక చేరారు. జాబితాలోని మొదటి వ్యక్తికి తనకు నచ్చిన డిపార్ట్‌మెంట్‌ను ఎంపిక చేసికోవచ్చు. అందువల్ల కుమారయ్య రెవెన్యూ డిపార్ట్‌మెంట్ కావాలని కోరుకున్నారు. ప్రధాన న్యాయమూర్తి అయి వచ్చిన తర్వాత అయ్యన్ని న్యాయస్థానంకు పంపుతానని ప్రధాన న్యాయమూర్తి హామి ఇచ్చారు. కాని కుమారయ్య లక్నోలో ట్రైనింగ్ పూర్తి చేసికొని వచ్చేసరికి నవాబ్‌జంగ్ ప్రధాన న్యాయమూర్తిగా రాజీనామా చేసి హైదరాబాద్ వదలి వెళ్ళిపోయారు. అందువల్ల కుమారయ్య మున్సిఫ్ మెజిస్ట్రేట్‌గా 1935లో ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది.

ఆ తర్వాత 1943లో అడిషనల్ జిల్లా మేజిస్ట్రేట్‌గా పదోన్నతి పొందారు. 1946లో జిల్లా మెజిస్ట్రేట్‌గా పదోన్నతి పొందారు. 1948లో సెషన్స్ జడ్జిగా, 1955లో హైదరాబాద్ హైకోర్ట్‌కు జడ్జిగా పదోన్నతి పొందారు. అప్పటికి ఆంధ్రప్రదేశ్ విలీనం కాలేదు. హైకోర్టులో జడ్జిగా చేరిన తర్వాత 1956లో ఆంధ్రరాష్ట్రం హైదరాబాద్ రాష్ట్రంలో విలీనం అయిన తర్వాత అడిషనల్ జడ్జిగా ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్‌లో పనిచేశారు. తిరిగి ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్‌కు 1957లో జడ్జిగా పదోన్నతిలో చేరారు. 1969లో చీఫ్ జస్టిస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టుగా అత్యున్నత పదవిలోకి ఎక్కారు. జూన్ 15, 1971లోని ఆయన పదవీ విరమణ చెందారు.

ఆయన జడ్జిగా ఏ స్థాయిలో పని చేసినా న్యాయవాదుల వాదనని శ్రద్ధగా దయతో ప్రేమపూర్వకంగా విని తీర్పులు చెప్పేవారని ప్రసిద్ధి. ఆయన తీర్పుల్లో ప్రజలకు న్యాయం అందించాలన్న తపన కనిపించేది. అయితే అందుకోసం ఆయన తన పరిధులు దాటినట్లుకూడా లేదు. కేసులను త్వరితంగా పరిష్కరించడానికి కుమారయ్య తీవ్రంగా పరిశ్రమించేవారు.

ఆయన జడ్జిగా ఏ స్థాయిలో పని చేసినా న్యాయవాదుల వాదనని శ్రద్ధగా దయతో ప్రేమపూర్వకంగా విని తీర్పులు చెప్పేవారని ప్రసిద్ధి. ఆయన తీర్పుల్లో ప్రజలకు న్యాయం అందించాలన్న తపన కనిపించేది. అయితే అందుకోసం ఆయన తన పరిధులు దాటినట్లుకూడా లేదు. కేసులను త్వరితంగా పరిష్కరించడానికి కుమారయ్య తీవ్రంగా పరిశ్రమించేవారు. హైకోర్ట్ న్యాయమూర్తిగా నియమకం పొందాక కేసుల్ని త్వరితంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యల్ని చేపట్టి అందుకోసం కృషి చేసినారు. హైకోర్ట్‌లోని విభాగాలను పునర్వ్యవస్థీకరించారు. తన పదవీకాలంలో హైకోర్ట్‌లో కేసులు చాలావరకు తగ్గుముఖం పట్టాయి. ఆయన ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన కాలంలో రాష్ట్రంలోని దాదాపు అన్ని కోర్టులను తనిఖీ చేశారు. ఆ తర్వాత సమావేశాలు నిర్వహించి అవసరమైన సూచనలు అందచేసేవారు. సబార్డినేట్ కోర్ట్‌లు ఎలాంటి తప్పిదాలు లేకుండా కేసులను పరిష్కరించేందుకు ఆయన మౌఖిక సూచనలు చేసేవారు. అట్టి సూచనలతో హైకోర్ట్ 1970, 71లో ఒక పుస్తకాన్ని వెలువరించింది. ఆ పుస్తకాలు న్యాయమూర్తులకు ఇప్పటికీ ఉపయోగపడుతున్నాయి.

హైకోర్ట్ చీఫ్ జస్టిస్‌గా పదవీ విరమణ పొందిన తర్వాత 1979లో ప్రపంచ బ్యాంక్ ట్రిబ్యునల్ జడ్జిగా రెండు పర్యాయాలు పనిచేశారు. మూడోసారి అవకాశం వస్తే కూడా ఆయన ఇష్టపడ కుండా ఇంటి వద్దనే ప్రశాంత జీవనం గడపసాగారు.

కుమారయ్యకి తెలుగు, ఉర్దూ, మరాఠి, ఆంగ్లం భాషల్లో ప్రావీణ్యతగలదు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఆయన మొట్టమొదటి హైకోర్ట్ చీఫ్ జస్టిస్‌గా పనిచేసి రికార్డ్ సృష్టించారు. మారుమూల పల్లెలో కుమ్మరి కులం నుంచి ఇంతగా ఎదిగినవారు ఆ కాలంలో దాదాపుగా లేరు. హైకోర్ట్ జడ్జిగా దళిత బహుజనులు దాదాపు లేనికాలంలో ఆయన శ్రమించి అంచెలు అంచెలుగా ఎదిగారు. పేద కుటుంబం నుంచి వచ్చినందున పేద ప్రజలపట్ల అవ్యాజమైన అనురాగంతో ఉండేవారు. సత్వరంగా న్యాయం అందిస్తేనే న్యాయం జరిగినట్లు అని నమ్మే ఆయన ఆచరించి చూపారు. నిరాడంబర జీవితం ఆచరణకు మచ్చుతునకగా ఆయన ఉద్యోగ విరమణ సందర్భంలో

(మిగతా 8వ పేజీలో)

# క్లీన్ అండ్ గ్రీన్ సిటీ మనందరి ధ్యేయం కావాలి..

తెలంగాణ రాష్ట్రంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారిని రానున్న ఐదేళ్లలో ఆర్థికంగా బలోపేతం చేసి పల్లెలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు పల్లెప్రగతి పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం 2019లో ప్రవేశపెట్టింది. గ్రామాల అభివృద్ధి, హరితహారంతో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించడం, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండిపోయిన మురికి కాల్వల పనులు పూర్తి, వినియోగంలోలేని భవనాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఉపయోగంలోకి తెచ్చుకోవడం, విద్యుత్ సరఫరా వ్యవస్థ మెరుగుపర్చుకోవడం, పరిశుభ్రమైన, సాధికారకమైన పల్లెల అభివృద్ధి కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం ఈ పల్లెప్రగతి కార్యక్రమం. ఈచ్ వన్ టీచ్ వన్‌లో భాగంగా పంచాయతీల్లో నిరక్షరాస్యులను గుర్తించి వారికి వయోజన విద్య అందించి అక్షరాస్యత అభివృద్ధికి కృషి చేయడం ఈ పథకంలో భాగం. రాష్ట్రవ్యాప్తంగా 12,751 పంచాయతీల్లో ఎన్నో అభివృద్ధి పనులతో అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలో ప్రజల భాగస్వామ్యంతో ఈ పథకం విజయంవైపు ప్రయాణిస్తుంది. ఈ పథకం దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలను ఆకర్షిస్తుంది.



పల్లె ప్రగతి ప్రేరణగా రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ఫిబ్రవరి 24న మహబూబ్‌నగర్‌లో ప్రారంభించారు. ఇందులో పట్టణ పారిశుద్ధ్యం, పచ్చదనం అనేవి కీలక అంశాలు. నూతన మున్సిపల్ చట్టం ప్రకారం 10 శాతం నిధులను పచ్చదనం కోసం వినియోగించబోతుంది. మూసీనది పరిరక్షణ, చెరువులు, కుంటల పరిరక్షణ, వీటి అభివృద్ధికి, అక్రమ కట్టడాల తొలగింపు, భూమి వినియోగంలో కీలక విధివిధానాలకు ప్రాధాన్యత ఇస్తుంది.

అభివృద్ధి పనులను నిర్వహించడానికి జీహెచ్ఎంసీతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 140 మున్సిపాలిటీలను, కార్పొరేషన్లను ఎంచుకున్నారు. అభివృద్ధి పనుల కోసం రూ. 148 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. పట్టణాలు, నగరాల్లో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం, కరెంట్ సంబంధిత సమస్యలు పరిష్కారం, వీధులపై వ్యాపారం చేసుకునే వారికి స్ట్రీట్ వెండింగ్ జోన్స్, ఆటోలు, ట్యాక్సీలు, ఇతర ప్రజా, సరుకు రవాణా వాహనాలకు నిర్దిష్టమైన ప్రదేశాల్లో పార్కింగ్, పేవ్‌మెంట్స్ నిర్మాణం, డంప్‌యార్డుల నిర్మాణం, రక్షిత తాగునీటి సరఫరా, కాలుష్య నివారణ వంటి వివిధ పౌర సదుపాయాల కల్పనకు ఈ పథకం ప్రాముఖ్యత ఇస్తుంది.

జీవితంలోని ప్రతి చిన్న అంశం పట్ల సున్నితమైన, అభివృద్ధికర ఆలోచనలను పరిగణనలోకి తీసుకొని కృషి చేయడం ఇంతకు ముందు మనకు కనిపించదు. ఈ పట్టణ ప్రగతి పథకంలోని అన్ని అంశాలు ఎంతో ఆశాజనకంగా ఉన్నాయి. పల్లె ప్రగతి విజయవంతమైనట్లే పట్టణ ప్రగతిని కూడా నూటికి నూరుశాతం విజయవంతం చేయాలనేదే ప్రభుత్వ సంకల్పం.

క్లీన్ అండ్ గ్రీన్ సిటీ మనందరి ధ్యేయం కావాలి. ఇవి సాధించడమే నిజమైన పట్టణ ప్రగతి. దీనికోసం ప్రభుత్వ విధివిధానాలతోపాటు ప్రతిచర్యలోనూ ప్రజల భాగస్వామ్యం, సహకారం ఉండాలి. ప్రజల భాగస్వామ్యమే అన్ని విజయాలకు కీలకమైనది. పట్టణ ప్రగతి పథకం వల్ల పట్టణం రూపురేఖలు మారిపోయి తెలంగాణ రాష్ట్రం దేశానికి దిక్సూచిలా నిలవాలని ఆశిస్తున్నాం.



(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

# మన ఊరి పండుగ

నగరాలన్నీ భయంకరంగా విస్తరిస్తున్నాయి. పల్లెలు అన్ని రకాలుగా కుదించుకుపోతున్నాయి. సమాజంలో మట్టివాసన తగ్గిపోతున్నది. అందుకు తగినట్లుగానే అనుబంధాలు, ఆప్యాయతలూ క్షీణించిపోతున్నాయి. స్నేహాలకు బదులుగా శత్రుత్వాలు పెరిగి పోతున్నాయి. మరో వైపున నగర జీవనశైలితో లేనిపోని అనారోగ్యాలు వస్తున్నాయి. వీటన్నిటికీ ఒక్కటే విరుగుడు... మరో సారి గ్రామీణ జీవితాన్ని ఆస్వాదించడం.

చేస్తున్న ఉద్యోగ వ్యాపారాలు వదిలి పల్లె పిలుపు అందుకోవడం అంత తేలికేమీ కాదు. అందులో ఎన్నో ప్రతిబంధకాలు. ఒక్క రోజు కాదు కదా... ఒక్క గంట అయినా నగరం విడిచివెళ్ళలేని పరిస్థితి. మొబైల్ ఫోన్లు వచ్చాక పలువురి జీవితాలు 24×7గా మారి పోయాయి.

అయినా కూడా సంవత్సరానికి ఒక్కరోజు పల్లెవాతావరణంలో.... లేదంటే నగర కలుషితాలకు కాస్త దూరంగా చిన్న పట్టణాల్లోనో గడుపుదాం. మట్టి వాసనకు చేరువవుదాం. మనమంతా పల్లె మూలాలను కలిగినోళ్ళమే. ఆ మూలాలను ఒక్కసారి కౌగిలించుకుందాం.

నిజానికి ఇది ఏ ఒక్క సంస్థనో నిర్వహించే కార్యక్రమం కాదు. ఎవరికి వారు ఈ కార్యక్రమాన్ని తమదిగా భావించి ఇందులో పాల్గొన్నప్పుడే అది విజయవంతమవుతుంది. అందుకే ఈ మహత్తర కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలను, మీడియా సంస్థలను కూడా భాగస్వాములగా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అన్నీ అనుకూలిస్తే మే నెల నుంచి 'మన ఊరి పండుగ' కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి.



'మన ఊరి పండుగ' అనేది సమాజంలోని భిన్నవర్గాలను ఏకం చేస్తుంది. అసలైన సంస్కృతితో మనల్ని మమేకం చేస్తుంది. చేతి వృత్తులను పరిచయం చేస్తుంది. హస్తకళలను గుర్తు చేస్తుంది. కళారూపాలను వెల్లడిస్తుంది. మన ప్రాంత చరిత్రను తెలియజేస్తుంది. అక్కడి వివిధ రకాల విశేషాలను గుర్తు చేస్తుంది. వ్యవసాయన్ని పండుగ చేయాలంటే ఏం చేయాలో చర్చిస్తుంది. సాహిత్యాన్ని పలకరిస్తుంది. పర్యాటకంలో ఒదిగిపోతుంది. మన చరిత్రను మదిలో నిలబెడుతుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఏడాది పొడుగునా కొనసాగే పల్లె పండుగ.

మరిన్ని వివరాలకు, ఈ కార్యక్రమం నిర్వహణలో పాలుపంచుకునే ఆసక్తి గలవారు, 9848902520 ఫోన్ నెంబర్ లేదా myvillagefest@gmail.comలో సంప్రదించవచ్చు.

'మన ఊరి పండుగ' కార్యక్రమంలో భాగస్వాములు కావాల్సిందిగా వివిధ సామాజిక సంస్థలను, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలను ఆహ్వానిస్తున్నాం. ఈ పండుగ జరిగే ప్రాంతంలో వివిధ భాగస్వామ్య సంస్థలు తాము అందించే సేవలను ప్రజలకు తెలియ జేసేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు.

– ఎన్. లక్ష్మీ మోహన్
ఎడిటర్, రైతుబంధు,
m : 7780238820
e : rythubandhu@gmail.com

(6వ పేజీ తరువాయి)

చెప్పిన "ఈ ప్రపంచంలో ఎవరూ పరిపూర్ణులుకాదు. వైఫల్యాలు లేకుండా ఎవ్వరూలేరు. నా చర్యల వల్ల ఏదైనా మంచి జరిగితే అది భగవంతుని కృపవల్ల జరిగింది. ఏదైనా చెడుగానీ అపజయంగానీ సంభవించినట్లు అయితే అవి నా లోపాలవల్ల జరిగాయి" అన్న మాటలు గుర్తుకువస్తాయి.

జస్టిస్ కుమారయ్య తీర్పు చెప్పిన కేసుల్లో ఖాసీంరజ్వీ, అయక్ అలీ తప్పించుకున్న కేసు ముఖ్యమైనది. అట్లాగే సాలర్‌జంగ్ ఎస్టేట్ వ్యవహారాల కేసులను కూడా ఆయన పరిష్కరించారు. చీఫ్ జస్టిస్‌గా పనిచేస్తున్న కాలం తర్వాత తను అగ్రికల్చరల్ ఇన్‌కంటాక్స్ ట్రిబ్యునల్, ఎలక్షన్ ట్రిబ్యునల్‌కు వేజ్‌బోర్డ్, పబ్లిక్ సెక్యూరిటీ మేజర్స్ అడ్వయిజర్ బోర్డ్‌లకు వేరు వేరు కాలాల్లో చైర్మన్‌గా వ్యవహరించి పలు సామాజిక ప్రయోజనం గల జడ్జిమెంట్‌లు ఇచ్చారు. ప్రివెంటివ్ డిటెన్షన్ ఆర్ట్‌కు అడ్వయిజరీ బోర్డ్ మెంబర్‌గా కూడా పని చేశారు.

జస్టిస్ నాంపల్లి కుమారయ్యకి స్వయాన సోదరుడు నాంపల్లి రాజేశం ప్రఖ్యాత సోషలిస్ట్ నాయకుడు. ఆయన జార్జి ఫెర్నాండెజ్ మధులిమాయెతో సాన్నిహిత్య సంబంధాలు ఉండేవి. కొంతకాలం ఇంజనీర్‌గా హైదరాబాద్ రాష్ట్రంలో పనిచేశారు. చాలా సంవత్సరాలు 'ఆకాశిక్' అనే ద్విభాష (తెలుగు, ఇంగ్లీషు) పత్రికను సికిందరాబాద్ నుండి వెలువరించారు ఇటీవలనే ఆయన మరణించారు.

జస్టిస్ కుమారయ్యకు కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ఇచ్చి గౌరవించింది. ఆయనకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. సత్యం, న్యాయం అందించడం నిరాడంబర జీవితం ఆచరించడంలో ఈ బహుజన బిడ్డ తెలంగాణ వైతాళికుల్లో ఒకరు.

ఆయన 96 సంవత్సరాలు జీవించి 2005లో అమరత్వం పొందారు.

– అన్నవరం దేవేందర్
m : 9440763479
e : annavaramdev@gmail.com

# వినమ్ర విమర్శకుడు అమ్మంగి

సృజనాత్మక రచన కన్నా విమర్శ కష్టమైన పని. కష్టమైన పనే కాదు, కృతజ్ఞతలేని పని. విమర్శకుడు ఒక రచనను పూర్తిగా చదివి దానిలోని క్లిష్టమైన అంశాలను సైతం కూలంకషంగా అర్థం చేసుకోవాలి. దానిపై సాధికారికంగా వ్యాఖ్యానించేందుకు గాను పరిశోధన కూడా అవసరం. పరిశోధన ఖర్చుతో కూడుకున్న పని. ఇంతా చేసి తాను తెలుసుకున్న విషయాలు, కూర్చిన సమన్వయం, ఆర్జించిన జ్ఞానం, చేసిన పరిశోధన, నిర్ధారించిన వాస్తవాలు, వివరించిన వ్యాఖ్యానం, ఇచ్చిన తీర్పులు (రచనపై) అన్నీ కూడా సృజనకారుడికే గుర్తింపు తెస్తాయి. విమర్శ కొన్ని సార్లు సృజనకారుడి లోపాలను ఎత్తి చూపిస్తుంది. ఈ లోపాలు ఎత్తి చూపడం కూడా అంతిమంగా కవి/రచయితకే ఉపయోగపడుతుంది. దీపం చుట్టూత చీకటి ఉన్నట్లు విమర్శకుడు తాను చీకట్లో ఉంటూనే పాఠకులకు వెలుతురును ప్రసాదిస్తూ ఉంటాడు. ఇట్లా విమర్శకుడు ప్రసరించిన వెలుగులో ఒక రచనను చదివినట్లయితే దాని పూర్వపరాలు, అక్షరబద్ధం కాని అంశాలు సైతం పాఠకులకు అవగాహనలోకి వస్తాయి. 'బిట్వీన్ ద లైన్స్' ఏమున్నదో తెలుస్తది. ఎట్లా చూసిన విమర్శకుడి ఘనత చరిత్రలో రికార్డు కావడానికి చాలా సమయం పడుతుంది. కొన్ని సార్లు జీవితకాలం కూడా సరిపోక పోవొచ్చు. కానీ విమర్శకుడు సృష్టించిన వెలుతురులో నుంచే కవి/రచయిత పుట్టుకొస్తాడు. మంచి పాఠకుడే మంచి సృజన చేయగలడు. దానికి అనుభవం నగిషీలు చెక్కడానికి ఉపయోగ పడుతుంది. ఇది సాహిత్యం-సమాజం పురోగతికి తోడ్పడుతుంది.




చరిత్ర, సంస్కృతి, సమాజం, రాజకీయ, ఆర్థిక రంగాలపై విస్తృతమైన అవగాహన గలవారు, నిస్వార్థంగా ఉంటూ, త్యాగం చేయగలిగేవారు, తమ సమయాన్ని ఇతరుల కోసం వెచ్చించే వితరణ శీలురు మాత్రమే నికార్సయిన విమర్శను సృజించగలరు. తెలంగాణ ఉద్యమం అందించిన అట్లాంటి నికార్సయిన విమర్శకుల్లో ముందువరుసలో నిలిచే సాహితీవేత్త అమ్మంగి వేణుగోపాల్ సార్. తాను చెప్పదలుచుకున్న అంశం ముక్కుసూటిగా చెబుతూనే దాన్ని వినమ్రంగా వ్యక్తీకరిస్తాడు. ఇది అమ్మంగికే అబ్బిన విద్య. తెలంగాణ ఉద్యమంలో సబ్బండ కులాలు పాల్గొన్నాయి. సాహిత్యంలోనూ దాని ప్రతిఫలనాలున్నాయి. వాటన్నింటిని ఒడిసి పట్టుకొని మంచి చెడ్డల్ని విప్పి చెప్పిన ఎక్స్‌పర్ట్ కామెంటేటర్ అమ్మంగి సారు. ప్రధానంగా కవిత్వాన్ని మాత్రమే సృజించే వేణుగోపాల్‌సార్ వృత్తిరీత్యా తెలుగు లెక్చరర్‌గా పనిజేసిండు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రిటైరయ్యిండు. ఆ సమయంలో డాక్టరేట్ కోసం గోపిచంద్ పైన పరిశోధన చేసిండు. అంతకుముందు 'మిణుగురు' (1980), 'పచ్చబొట్టు పటంచెరు' (1999), 'భరోసా' (2008) కవితా సంపుటాలు వెలువరించారు. అంతేకాదు తెలుగుకు ఉర్దూకు ఉన్న అవినాభావ సంబంధాన్ని 'మరో కొత్త వంతెన' (1993) పేరిట పటిష్టపరిచిండు. 'మజర్ మెహదీ మరో ప్రపంచం' (2008) పేరిట రాసిన పుస్తకానికి సంపాదకత్వం వహించిండు. సురవరం, వట్టికోట ఆళ్వారుస్వామిలపై సాహిత్య అకాడెమీ అచ్చేసిన పుస్తకాలకు సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించాడు. అయితే 2006 ఆ ప్రాంతంలో ఉద్యోగం నుంచి రిటైరయిన తర్వాత విస్తృతంగా సాహిత్యం చదివిండు. ముఖ్యంగా తెలంగాణ సాహిత్యంపై అధ్యయనం చేసిండు. ఒకవైపు ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, ఊరూరా ధూమ్‌ధామ్‌లు, వివిధ రచయితల సంఘాలు, సంస్థలు తెలంగాణ వ్యాప్తంగా సభలు సమావేశాలు నిర్వహిస్తున్న సందర్భమది. అందుకే తెలంగాణ రచయితల వేదిక సిరిసిల్లలో ఏర్పాటు చేసిన సభపై ప్రత్యేకంగా ఒక వ్యాసమే రాసిండు. ఉద్యమ సందర్భంలో పరిశోధనా రంగంలో జరిగిన కృషి ఫలితంగా తెలంగాణకు సంబంధించిన ఎన్నో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. మరెంతో మంది మరుగున పడ్డ సాహితీవేత్తలు కొత్తగా తెరమీదికి వచ్చింద్రు. ఆదిలాబాద్ మొదలు మహబూబ్‌నగర్ వరకు నిత్యం కవులు, కళాకారులు, రచయితలు, ఉద్యమకారులు, విద్యావంతులు తమ తమ ప్రాంతాల్లో సాహిత్య కార్యక్రమాలు నిర్వహించింద్రు. తద్వారా తమ ప్రాంతంలో మరుగునపడ్డ కవులు, కళాకారులను పరిచయం చేసింద్రు. ఇట్లా తెలంగాణ అంతటా మా ప్రాంతం కూడా చరిత్రకెక్కదగినదే అనే సోయితో వ్యవహరించింద్రు. ఆత్మగౌరవ సోయి వారిని మరింత బలంగా తెలంగాణ కోసం కొట్లాడేలా చేసింది.

సరిగ్గా ఇదే సమయంలో అమ్మంగి వేణుగోపాల్ సార్ తనను తాను తెలుసుకుంటున్న తెలంగాణను దాని ఘనతను, చరిత్రను, సాహిత్యాన్ని సమకాలీన దృక్పథంతో ప్రపంచానికి పరిచయం చేసిండు. ఇందులో తెలంగాణేతరులైన వ్యక్తులు, వారి రచనలు ఉన్నప్పటికీ ఆయన దృష్టి, దృక్పథం రెండూ తెలంగాణనే అని చెప్పొచ్చు. సాహిత్యంలో సామాజిక న్యాయాన్ని కూడా భాగం చేసిండు. విస్మరణ, వివక్షకు గురైన వ్యక్తుల్ని, విషయాల్ని వినయంగా వెలుగులోకి తెచ్చిండు. ఇన్నేండ్లు తెలంగాణ వాండ్లు తమ రచనలపై ఆంధ్రా ప్రాంతానికి చెందిన వ్యక్తులు చెప్పే అభిప్రాయం కోసం అర్రులు చాచేవారు. వారి ముందుమాటల కోసం, కొన్ని సార్లు సమీక్షల కోసం, ఇంకొన్ని సార్లు పుస్తకాల వెనుక మాట కోసం ఆంధ్రాప్రాంత కవులు,

విమర్శకుల దగ్గర కొందరు తెలంగాణ వాండ్లు తమ నైజానికి విరుద్ధంగా చేతులు కట్టుకునేవారు. తెలంగాణ ఉద్యమం ఆ పోకడలకు స్వస్తి పలికింది. మన గురించి మనమే చెప్పుకోవాలనే సోయితో వ్యవహరించిండ్రు. ముందుమాటలు, విమర్శ, సమీక్ష, కొండొకచో పరామర్శ అన్నీ కూడా తెలంగాణ వాళ్ళు ఏ ప్రాంతానికి తీసిపోకుండా రాసిండ్రు.




ముందుమాటలు రాయమని అడిగిన వారికి, లేదా ఆత్మీయుల గురించి రాయడం ఒక ఆప్షనల్ అంశం. అట్లా గాకుండా పత్రికలో కాలమ్ రూపములో పక్షం రోజులకు ఒక రచన చేయడమంటే అదీ విమర్శనా పూర్వక రచన చేయడమంటే కత్తిమీద సాము లాంటిదే! ఈ సాముని విజయవంతంగా చేసిన వాడు అమ్మంగి వేణుగోపాల్. 1990లో 'అవినాభావం' పేరిట కొన్ని సాహిత్య వ్యాసాలను పుస్తకంగా తీసుకొచ్చిన ఈయన రిటైరైన తర్వాత టైర్‌లెస్‌గా (అవిశ్రాంతంగా) రాసిండు. దాదాపు రెండేండ్లకు పైగా 'సూర్య' దిన పత్రికలో అతి సూక్ష్మమైన అంశాన్ని సైతం భూతద్దంలో పరిశీలించి తెలంగాణ సాహిత్యానికి వన్నెలద్దిండు. వివిధ దిన పత్రికల్లో వచ్చిన వ్యాసాలకు, ఒకటి రెండు ముందుమాటలు, 'సూర్య' పత్రికలో 'దస్తూరి' శీర్షికన వెలువడ్డ రచనలన్నింటినీ కలిపి 2012లో పుస్తకంగా తీసుకొచ్చిండు. తెలంగాణ ఉద్యమం ఊపుమీదున్న దశలో ఇక్కడి రచనలపై ఒక ప్రత్యేకమైన శ్రద్ధ, ఆసక్తి, అభిరుచి, అభిమానంతో, స్వీయాదేశిత బాధ్యతగా స్వీకరించి విమర్శ చేసిండు. ఉద్యమావసరాలను దృష్టిలో పెట్టుకొని తనకు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తెలంగాణకు మేలు చేకూర్చిండు. 60 ఏండ్ల వయసులో ఏ సాహితీవేత్తయినా ముఖ్యంగా అతను కవి అయినట్లయితే కవిత్వ రచనకే పరిమితమైతారు. సి.నారాయణరెడ్డి లాంటి వారు ఒక వయసు తర్వాత ప్రధానంగా కవిత్వమే సృజించారు. అయితే తెలంగాణలో విమర్శావసరాన్ని గుర్తించి, గురుతర బాధ్యతగా భావించి విమర్శ చేసిన వారు అమ్మంగి వేణుగోపాల్. స్కైబాబ, అన్వర్, దాసి సుదర్శన్, దేవులపల్లి కృష్ణమూర్తి, గూడూరి సీతారామ్, గద్దర్, శివసాగర్, కంచ ఐలయ్య, శీలా వీర్రాజు తదితర దళిత, బహుజన, ముస్లిం మైనారిటీలపై శ్రద్ధతో విమర్శా వ్యాసాలు రాసిండ్రు. దళిత ఉపకులాలకు చెందిన కథల సంపుటి 'నాగేటి సాళ్ళు' పుస్తకాన్ని లోతుగా పరిశీలించి వ్యాఖ్యానించాడు. దేవులపల్లి కృష్ణమూర్తి రిటైరైన తర్వాత రాయడం ప్రారంభించిండు. ఈ సమయంలో రాసిన ఊరు–వాడ–బతుకు జీవిత చిత్రాన్ని కండ్లముందుంచిండు. ఇది అమ్మంగి సార్ మాత్రమే చేగలిగే పని. ఎందుకంటే దేవులపల్లి కృష్ణమూర్తి, దాసి సుదర్శన్‌లను దాదాపు 50 ఏండ్ల నుంచి దగ్గరగా చూసిన వ్యక్తి. వారి అభిరుచులు, సాహితీ, కళా పిపాస గురించి తెలిసిన వాడు. అందుకే వారిపై సాధికారమైన విమర్శ రాసిండు.




అమ్మంగి సార్ సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్లోని రచనలపై విమర్శ చేసిండు. జీవిత చరిత్రలు, స్వీయ చరిత్రలు, లేఖా సాహిత్యం, కవిత్వం, కథలు, నవలలు, నాటకాలు, యాత్రారచన, సమగ్ర సాహిత్యం, వాఙ్మయసూచి, విజ్ఞాన సర్వస్వాలు, భాష, సినిమాలు, కళలు, చరిత్ర, మోనోగ్రాఫ్, విమర్శ, పరభాషా సాహిత్యాలు ఇట్లా భిన్నమైన విషయాలను తనదైన సౌమ్యమైన వ్యాఖ్యతో తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థానం కల్పించారు.

తెలంగాణకు చెందిన కాళోజి నారాయణరావు, సురవరం ప్రతాపరెడ్డి, దాశరథి, బిరుదురాజు రామరాజు, సామల సదాశివ లాంటి సాహిత్య వ్యక్తిత్వాలను భిన్న కోణాల్లో వ్యక్తీకరించారు. బిరుదురాజు రామరాజు, సామల సదాశివ, కాళోజి, దాశరథి, గూడూరి సీతారామ్‌లతో దగ్గరి సంబంధాలుండడంతో వారి గురించి రాసేప్పుడు రసగుళికల్లాంటి కొత్త అంశాలను జోడించిండు. కాళోజి గురించి రాస్తూ 'ప్రాంతీయతత్వాన్ని అణువణువునా జీర్ణించుకున్న విశ్వమానవుడాయన' అని రాసిండు. ఎమర్జెన్సీ రోజుల్లో కాళోజి రాష్ట్రమంతటా తిరుగుతూ మెదక్ జిల్లాలో పర్యటిస్తూ తన బసను ఎవరింట్లోనైనా ఏర్పాటు చేస్తామంటే వద్దు అందరితోపాటే ఇక్కడే గుళ్లో నిద్రపోతానని చెప్పి అక్కడే అందరితో పాటు పడుకున్న కాళోజి వ్యక్తిత్వాన్ని రికార్డు చేసిండు. సాహిత్యం విషయానికి వస్తే 'నిజం మాట్లాడితే ఎవరికో ఎక్కడో మిరపకాయ పెట్టినట్టుండే చీకటి దినాలు దాపురించినై. కవులు, రచయితలు నిజం చెప్పకపోతే ఎవరు చెప్తరు?' అంటూ కవుల ఉన్నత స్థానాన్ని కాళోజి చెప్పిండు. ఈ విషయాలన్నింటిని అమ్మంగి దగ్గరి నుంచి చూసినవాడు కావడంతో సాధికారికంగా రికార్డు చేసిండు.

తెలంగాణ వెలుగులే గాకుండా ఆంధ్రా ప్రాంతానికి చెందిన గురజాడ, కొడవటిగంటి కుటుంబరావు, భద్రిరాజు కృష్ణమూర్తి, తిరుమల రామచంద్ర, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిల రచనలు, వ్యక్తిత్వాలపై సాధికారికంగా వ్యాఖ్యానించాడు. గురజాడపై మైకెల్ మధుసూధన దత్తు అనే బెంగాలీ రచయిత ప్రభావం ఉందని రాసిండు. ఇట్లా చెప్పడానికి బెంగాలీ రచనలపై కూడా సాధికారికమైన అవగాహన ఉంటే కానీ సాధ్యం కాదు. అలాగే కొడవటిగంటి కుటుంబరావు గురించి రాస్తూ "కుటుంబరావు ఎంత రాశారో, అంతకంటె ఎక్కువే చదివారు. సరైన అధ్యయనం మూలంగా, అదివరకు సంపాదించిన జ్ఞానం సమీక్షకు గురై, చేర్పులతో నూతన

చైతన్యం సంతరించుకుంటుందని విశ్వసిస్తే, అందుకు కుటుంబరావు జాతి గర్వించదగిన అధ్యయన శీలి' అని చెప్పిండు. ఈ విషయాలపై పూర్తి పట్టు ఉంటే గాని ఇట్లా రాయడానికి వీలు కాదు. వీళ్ళంతా తొలితరానికి చెందిన తెలంగాణ, ఆంధ్రా ప్రాంతానికి చెందిన కవులు, రచయితలు, సాహితీవేత్తలు.

రెండో తరానికి చెందిన ఎం.వి.తిరుపతయ్య, కె.కె. రంగనాథాచార్యులు, వరవరరావు, అంపశయ్య నవీన్, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, అల్లం రాజయ్య, జ్వాలాముఖి, బి.ఎస్.రాములు, దేవులపల్లి కృష్ణమూర్తి, దేవరాజు మహారాజు, జయధీర్ తిరుమలరావు, వి.ఆర్.విద్యార్థి తదితరులు తెలంగాణనుంచి తెలుగు సాహిత్యంలో తమకంటూ ఒక పేరుని సాధించుకున్న రచయితలు. కవిత్వంలో, కథల్లో, నవలలు తదితర అంశాల్లో ఒకొక్కక్కరు ఒక్కో రంగంలో ఘనత సాధించారు. తమ రచనల ద్వారా తెలంగాణ సమాజంపై ప్రభావం వేసిండ్రు. వీరి రచనలను జల్లెడ పట్టి అసలు అంశాలను మనకందించిండు. అలాగే ఆంధ్రా ప్రాంతంలో పుట్టిన పోరంకి దక్షిణామూర్తి, రాచమల్లు రామచంద్రారెడ్డి, సి.వి.కృష్ణారావు, శీలా వీర్రాజు, శివసాగర్, హరిపురుషోత్తమరావు, త్రిపురనేని గోపీచంద్, డా.కేశవరెడ్డి, బాలగోపాల్, వేగుంట మోహన ప్రసాద్‌ల రచనలపై సాధికారికమైన వ్యాఖ్యలు చేసిండు.




ఆంధ్రాకు చెందిన కవయిత్రి మందరపు హైమవతి, కుప్పిలి పద్మ కథలు 'మంచుపూలు' రచనలపై కూడా విమర్శ వ్యాసాలు రాసిండు. హక్కుల సంఘాల్లో చురుగ్గా పాల్గొన్న సురవరం ప్రతాపరెడ్డి, కాళోజి నారాయణరావు, కన్నబీరన్, బాలగోపాల్, వరవరరావు, గద్దర్, కంచ ఐలయ్యల రచనలను విమర్శనాత్మకంగా పరిశీలించి వ్యాఖ్యానించాడు. విమర్శకుడిగా బాలగోపాల్, కె.కె.రంగనాథాచార్యుల విశిష్టతను పాఠకుల ముందుంచిండు. గద్దర్ కవిత్వం, కన్నబీరన్ స్వీయ చరిత్ర, సుంకిరెడ్డి సాహిత్య చరిత్ర, కంచ ఐలయ్య సామాజిక చరిత్ర, కాళోజి కవిత్వంపై రాసిన విషయాలను సమకాలీన సందర్భంలో వ్యాఖ్యానిస్తూ వాటి సాహితీ విలువను ఖరీదు కట్టిండు.




ఈ తరంలో పెన్నా శివరామకృష్ణ, కందుకూరి శ్రీరాములు, స్కైబాబల రచనలపై లోతైన విశ్లేషణ గల వ్యాసాలు రాసిండు. అంతేకాదు వేమన, రామదాసు లాంటి వారి రచనలను కూడా అమ్మంగి వేణుగోపాల్ సార్ క్షుణ్ణంగా పరిశీలించి విమర్శా వ్యాసం రాసిండు. అయితే రామదాసుకు సంబంధించి సినిమాలు, నాటకాలు, కీర్తనలు, ఆయన రచనలు ఒక రకంగా 'మోనోగ్రాఫ్'కు సరిపడా సినాప్సిస్ అందించిండు. వీటి ఆధారంగా రామదాసు రచనలన్నింటిని సేకరించి వాటిని అచ్చు వేయడమే గాకుండా సినిమాలను ఒక మ్యూజియం ఏర్పాటు చేసి రామదాసుకు సంబంధించిన సర్వ సమగ్ర సమాచారాన్ని ఒక్క దగ్గర చేర్చినట్లయితే భవిష్యత్ పాఠకులకు, బుద్ధిజీవులకు ఎంతగానో ఉపయోగ పడుతుంది.

కవిత్వం కచ్చితంగా అమ్మంగి వేణుగోపాల్ సార్‌కు ఇష్టమైన, ప్రాధామ్యములో ఉన్న విషయం. అందుకే కొత్త గోలకొండ సంచికలు పేరిట ఈ వ్యాస రచయితనైన నేను (సంగిశెట్టి శ్రీనివాస్), సుంకిరెడ్డి నారాయణరెడ్డిలు కలిసి సంయుక్తంగా సంపాదకత్వం వహించి వెలువరించిన '1969-73 తెలంగాణ ఉద్యమ కవిత్వం' పుస్తకాన్ని ఆంధ్రజ్యోతిలో సమగ్రంగా విశ్లేషించిండు. ఒక్క ఈ పుస్తకమే గాకుండా సింగిడి నాగర్‌కర్నూల్ శాఖ వారు ప్రచురించిన 'పొద్దెంది', స్కైబాబ సంపాదకత్వంలోని 'జాగో జగావో', కరీంనగర్ ఉద్యమ కవితా సంకలనం 'వల్లుబండ' (2010), గాయాలే గేయాలై, 'తెలంగాణ ఉరుములు, మెరుపులు', 'మా మట్టి కోసం, మా హైదరాబాద్ కోసం, తెలంగాణ కవిత-2009త తదితర కవితా సంకలనాలపై పది పేజీల వ్యాసం రాసిండు. ఇందులో సమకాలీన సందర్భంలో వచ్చిన తెలంగాణ కవిత్వాన్ని ఒక వజ్రాల ఎక్స్‌పర్ట్‌లాగా కవిత్వాన్ని ఎంచి తూచిండు. ఇందులో "తెలంగాణ సాహిత్య తవ్వకం పనిలో నిష్ణాతులైన సంగిశెట్టి శ్రీనివాస్, డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి అప్పటి కవిత్వాన్ని వెలికితీసి '1969-73 తెలంగాణ ఉద్యమ కవిత్వం' (2009) పేరిట వెలుగులోకి తెచ్చారు. వారి శ్రమ ఫలితంగా 1).జి.యాదగిరి, ఋక్నుద్దీన్‌ల సంపాదకత్వంలో వెలువడ్డ 'విప్లవఢంకా' (1969), 2) 'జనధర్మ' ప్రత్యేక సంచిక (5.6.1969), 3) 'ఎవరో' సంపాదకత్వంలో 'విప్లవశంఖం' (1969) మళ్ళీ ఈ సంకలనంలో పునర్ముద్రణ పొందాయి. 'తెలుగుగడ్డ', 'జై తెలంగాణ', 'విద్యుల్లత', వంటి పత్రికలు కూడా తెలంగాణ ఉద్యమ కవిత్వాన్ని ప్రచురించాయి. వారికి లభించని కవితలు మరో వందదాకా వుండవచ్చు. దాశరథి, సినారె అప్పటి ఉద్యమానికి దూరంగా వున్నారు. విరసం అధ్యక్షుని హోదాలో శ్రీశ్రీ వ్యతిరేకించారు." అని ఎవరి కృషి ఏమిటని తేల్చి చెప్పిండు. నిజానికి అమ్మంగి వేణుగోపాల్ సార్ 'సాహిత్య సందర్భం, సమకాలీన స్పందన' పేరిట తన విమర్శ వ్యాసాలన్నింటిని (89)ని పుస్తకంగా తీసుకొచ్చిండు. ఇందులో విమర్శ చేసిన ప్రతి పుస్తకం ప్రచురణ తేదీని పక్కన ఇచ్చిండు. ఇది భావి పరిశోధకులు తప్పక పాటించాల్సిన ఒక నియమం అని కూడా తేల్చి చెప్పినట్లయింది. 2012కు రాసిన విమర్శా వ్యాసాలు పుస్తకంగా వచ్చింది. ఇందులో అవసరమైన చోటల్లా ఎలాంటి శషభిషలకు పోకుండా తెలంగాణ సాహిత్యాభ్యున్నతికి కృషిచేసిన వారిని గౌరవిస్తూ

వ్యాసాల్లో వ్యాఖ్యానించిండు. ఇది ఆయన నిష్పాక్షికతకు నిదర్శనం. అట్లాగే నాయినపై అప్యాయతతో 'నడి ఎండలో వెన్నెల పాట' పేరిట అన్వర్ సంకలనం చేసిన 'నాయిన' కవిత్వాన్ని విశ్లేషించిండు. హైదరాబాద్ కవల పిల్లల తల్లి అంటూ తెలుగులో రాస్తున్న ముస్లిం కవులను గుర్తుకు తెచ్చిండు. అందులో అఫ్సర్ ముందువరుసలో ఉన్నాడు.




ఈ కొత్త గోలకొండ కవుల సంచికలతో పాటు సిరిసిల్లో వేముగంటి మురళీకృష్ణ, అందెశ్రీ, కాంచనపల్లి కలిసి తీసుకొచ్చిన 'మునుం', ఎస్.జగన్ రెడ్డి సంపాదకత్వంలోని 'జులూస్' తదితర కవిత్వ సంకలనాలపై కూడా సాధికారికమైన విశ్లేషణ, విమర్శ ఇందులో ఉన్నది. పెన్నా, ఎలనాగ కవిత్వాన్ని విశ్లేషించిండు. గురజాడ, చలం లేఖలను కూడా పరిశీలించిండు.

సినిమాలకు సంబంధించి మాభూమి, పథేర్ పాంచాలి, దాసి సుదర్శన్‌పై కూడా ఇందులో వ్యాసాలున్నాయి. ఇక్బాల్, కమలదాస్ లాంటి ప్రాంతేతర సాహితీవేత్తల రచనలు, జీవితం గురించి కూడా విలువైన విమర్శా వ్యాసాలను అమ్మంగి అందించారు.

కవిత్వంతో పాటుగా కథలపై కూడా లోతైన విమర్శ చేసిండు. జూపాక సుభద్ర సంపాదకత్వంలో వచ్చిన దళిత ఉపకులాల కథలు 'నల్లరేగటి సాల్లు', జింబో వేముల వాడ కథలు, గాలివాన, తెలంగాణ స్త్రీల కథలపై రాసిండు. మునెమ్మ, అంపశయ్య, శీలావీర్రాజు నవలలపై కూడారాసిండు. త్రిపురనేని రామస్వామి చౌదరి నాటకంపై కూడా ఒక వ్యాసం రాసిండు.

పరిశోధనలో తన గురువైన బిరుదురాజు రామరాజు, నేలమాళిగల్లో కూరుకుపోయిన అంశాల దుమ్ముదులిపి వెలుగులోకి తెస్తున్న నెల్లూరుకు చెందిన కాళిదాసు రాసిన 'దంపూరి నరసయ్య' పుస్తకం, సంగనభట్ల, జయధీర్ తిరుమలరావులపై కూడా వ్యాఖ్యానించిండు. అలాగే చరిత్రకు సంబంధించిన సుంకిరెడ్డి నారాయణరెడ్డి రాసిన 'ముంగిలి'కి విలువ తెచ్చే రచనలు చేసిండు. ఇవే గాకుండా గడియారం రామకృష్ణశర్మ, తిరుమల రామచంద్రల స్వీయ చరిత్రలు, కన్నబీరన్ 24 గంటలు, బాలశ్రీనివాసమూర్తి రాసిన ఆత్మకథల్లో అలనాటి చరిత్ర, ప్రొఫెసర్ ఆదినారాయణమూర్తి రాసిన యాత్రాచరిత్రలపై కూడా అమ్మంగి వేణుగోపాల్ రాసిండు. ఇవన్నీ చూస్తూంటే ఎంత విస్తృతంగా చదివిండో, దాన్ని అక్షర రూపంలో పెట్టడానికి అంతకన్నా ఎక్కువ కష్టపడ్డాడని తెలుస్తూనే ఉన్నది. ఎందుకంటే ఒక అంశంపై దాని మంచి చెడ్డలు విశ్లేషించుకునేందుకు అంతకుముందరి ఆకరాలు అనేక సందర్భాల్లో అందుబాటులో లేవు. అయినా కూడా ఆ యా రచనలపై సాధికారికమైన విమర్శ చేసిండు.




వాఙ్మయసూచికి సంబంధించిన 'దిక్సూచి', అనువాద గ్రంథం 'మనలిపి దాని పుట్టుపూర్వోత్తరాలు' కూడా ఆయన విమర్శకు నిండుదనాన్ని తీసుకొస్తున్నాయి.

ఎవరైనా ఒక రచన చేయాలన్నా, దాని మీద విమర్శ రాయాలన్నా ముందుగా దానిపైన ఆసక్తి ప్రధానం. ఇట్లా ఆసక్తి ఉంటే గానీ విషయాన్ని హృదయానికి దగ్గరగా హత్తుకోలేము. నిజానికి ఇంత విస్తృతంగా రాసేప్పుడు అన్ని విషయాల పట్ల ఆసక్తి అదే స్థాయిలో ఉంటుందా? అంటే అవును అని చెప్పలేము. కానీ ఎంతో కొంత ఆసక్తి, అభిమానము, ఆత్మీయత, తెలుసుకున్న విషయాన్ని నలుగురితో పంచుకోవాలి, తద్వారా తన జాతికి మేలుకోవాలి, మేలుకలగాలి అనేది ప్రతి విమర్శకుడు ఆశిస్తాడు. అట్లా అమ్మంగి వేణుగోపాల్ కూడా 'దస్తూరి' శీర్షికలో రాసిన వ్యాసాలు, దానికి తోడు నేటి నిజం, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, పాలపిట్ట తదితర పత్రికల్లో ప్రచురితమైన వ్యాసాలను ఒక్క దగ్గరికి తీసుకొచ్చి పుస్తకంగా వేయడమంటే తెలుగు సాహిత్యానికి, ముఖ్యంగా తెలంగాణ సాహిత్యానికి ఎనలేని సేవ చేసినట్టు. అలాగే 'మహాప్రస్థానం వస్తు శిల్పాలు', 'కవిత్వంలో సూర్యాగ్ని' అనే రచనలు ఆయన సూక్ష్మపరిశీలనకు నిదర్శనాలు.

అయితే ఈ వ్యాస పరంపరలో తన పరిశోధనాంశమైన గోపిచంద్‌పై మూడు వ్యాసాలు, గురజాడ, సురవరం, తదితరులపై రెండేసి వ్యాసాలున్నాయి. అయితే ఇందులో అందరికన్నా ఎక్కువగా సామల సదాశివ పైన ఐదు వ్యాసాలున్నాయి. అంటే ఆయనపై తనకున్న అనురాగం తెలిసి వస్తుంది.

తెలుగు సాహిత్య రంగంలో మార్క్సిస్టు విమర్శకులు, సనతాన విమర్శకులు, బహుజన, దళిత విమర్శకులు అని గీతలు గీసే అవకాశముంది. అందుకు తగ్గట్టుగానే ఆయా విమర్శకులు తాము దృక్పథానికి అనుగుణంగా విమర్శ/పరామర్శలు రాసిండ్రు. అయితే సమకాలీన సందర్భంలో సాహిత్యంపై విమర్శా దృక్కోణంలో ఒక తెలంగాణ వాదిగా, ఒక బహుజనుడిగా, ఒక నిరంతర సాహిత్యాధ్యయన శీలిగా, కవితా ప్రేమికుడిగా ఇట్లా బహుముఖాలుగా ఏక కాలంలో తెలుగు సాహిత్యాన్ని భిన్న సంస్కృతికి కేంద్ర బిందువైన హైదరాబాద్ నగరం నడిబొడ్డున నిలబడి వ్యాఖ్యానించిన మృదు స్వభావి అమ్మంగి. ఆయన తన స్వభావాన్ని అక్షరాలుగా మలిచి విలువైన విమర్శ చేసిండు. ఈ విమర్శ చరిత్రలో కాల పరీక్షకు నిలబడి నెగ్గుకు వస్తుంది అనడంలో సందేహం లేదు.

-సంగిశెట్టి శ్రీనివాస్, m : 9849220321
e : sangishettysrinivas@gmail.com

# హిందూ ముస్లిం సమైక్యతకు సంకేతం
# 'చార్మినార్'

*తేరే ఘర్ కె సామ్నే*
*దునియా బసావూంగా*
*తేరే ఘర్ కె సామ్నే*
*ఎక్ ఘర్ బనావూంగా*
*తారే సజావుంగా*
*తెరే ఘర్ కే సామ్నె.*

1963లో వచ్చిన ఒక హిందీ సిన్మాలో హీరో దేవానంద్ తన ప్రియురాలికి చేసిన వాగ్దానాలివి.

"నీ ఇంటి ముందు ఒక ప్రపంచాన్నే నెలకొల్పుతాను. నీ ఇంటి ముందు మరో ఇంటినే నిర్మిస్తాను. నిర్మించిన ఆ ఇంటి వాకిటిలో తారల తోరణాలు వ్రేలాడదీస్తాను" అని దాని అర్థం. సరిగ్గా 424 ఏండ్ల క్రితం నవాబు మహమ్మద్ కులీ కుతుబ్‌షా కూడా తన ప్రియురాలు భాగమతితో ఇలాంటి వాగ్దానాలే, వాదాలే చేసాడేమో అందుకే హైద్రాబాద్ నగరం వెలిసింది. నగరం నడిబొడ్డున చుక్కలను చుంబించే చార్మినార్ కూడా నిలిచింది. వారిరువురి హిందూ-ముస్లిం ప్రేమ వ్యక్తిగత ప్రేమగా మిగిలిపోక ఒక వైభవోజ్వల నగర నిర్మాణానికి దారితీసింది. దానికి ప్రత్యక్ష సాక్ష్యమే ఈనాటి చార్మినార్.



మీర్‌జుమ్లా మీర్ మోమిన్ అస్త్రాబాది

చార్మినార్ కీ కహానీ వెనుక మరో కహానీ కూడా వుంది. 1590లో గోల్కొండ కోటలో ప్లేగు వ్యాధి వచ్చి వేల మంది మరణించారు. నవాబుగారు రాజధానిని మార్చాలని నిర్ణయించి 1591లో నూతన నిర్మాణానికి ఒక "తాజియా"ను (పీరు) శంకుస్థాపన చేశారు. అదే చార్మినార్. చార్మినార్‌లో ఒక మూలన ఆ తాజియా ఇప్పటికీ వుంది. సరిగ్గా దాని వెనుక భాగంవైపే మాతా భాగ్యలక్ష్మి మందిరం వుంది. ప్లేగు వ్యాధి మృతుల గౌరవార్థం వెలసిన నిర్మాణమే చార్మినార్ అని మరో కథ కూడా వుంది. ఎవరికి నచ్చిన కథలు వారు నమ్మవచ్చు.

మాతా భాగ్యలక్ష్మి దేవాలయ నిర్మాణం వెనుక కూడా ఒక స్థలపురాణం వుంది. చార్మినార్ నిర్మాణం జరుగుతున్న రోజులలో రాత్రిళ్లు సామానుల కాపలా కోసం నవాబు ఒక గొల్లవాడిని నియమించాడు. ఒక అమావాస్య చీకటి రాత్రి కర్పూర కళికలా వెలుగుతున్న ఒక రూపవతి ఘల్లుఘల్లున కాళ్ల గజ్జెలు మోగుతుండగా వజ్రవైఢూర్యాలు, బంగారు నగలు ధరించి "నేను వచ్చానని మీ రాజుగారికి చెప్పు" అని ఆజ్ఞాపించింది. మరి ఇక్కడికి సామానులకు కాపలా ఎవరుంటారు అని ప్రశ్నించిన ఆ అమాయక గొల్లవాడి ప్రశ్నకు "నువ్వొచ్చేవరకు నేనిక్కడ్నుండి కదలను" అని ఆమె హామీనిచ్చింది. గొల్లవాడు పరుగుపరుగున వెళ్లి నవాబును నిద్రలేపి విషయాన్ని వివరించాడు. ఆ వచ్చిందెవరో నవాబుగారు అర్థం చేసుకున్నాడు. రాజ్య సంక్షేమం కోసం తల్వారుతో వాడి తల నరికేశాడు. తెల్లారేసరికి ఆ నాతి రాతిగా మారిపోయింది. ఆమెనే భాగ్యనగరానికి సంబంధించిన భాగ్యలక్ష్మి. చరిత్ర పుటలలో చెదిరిపోయిన ఆ గొల్లవాడి త్యాగాన్ని ఎవరు గుర్తు పెట్టుకుంటారు?

మనం చూస్తున్న చార్మినార్ అసలుకు నకలు మాత్రమే. అసలు చార్మినార్ ఇరాన్‌లోని "ఇస్పహాన్" నగరంలో ఉంది. మనకు ఇస్పహాన్ టీ పౌడర్ పేరు తెలుసుగాని ఇరాన్‌లో ఇస్పహాన్ నగరం అంటూ ఒకటి వుందని అక్కడ అసలైన చార్మినార్ కట్టడం వుందని తెలియదు కదా! మహమ్మద్ ఖులీకుతుబ్‌షా అక్కడి కట్టడాన్ని కాపీ కొట్టి ఇక్కడ ఎందుకు నిర్మించినట్లు?

మొదటి కుతుబ్‌షా నవాబు ఇరాన్ నుండి దక్కన్‌లోని బహమనీ రాజ్యానికి వలస వచ్చి ఇక్కడ సైన్యాధికారిగా జీవితాన్ని ప్రారంభించి కాలక్రమేణా గోల్కొండ సుబేదారుగా తర్వాత స్వతంత్ర నవాబుగా అవతరించాడు. ఇక అప్పటి నుండి గోల్కొండ ముస్లిం ప్రధాన మంత్రులందరూ ఇరాన్ దేశం నుండి వలస వచ్చిన వారే. మహమ్మద్ కులీకుతుబ్‌షా 1591లో చార్మినార్ నిర్మాణానికి సంకల్పించినప్పుడు అతని ప్రధాని మీర్ మోమిన్ అస్త్రాబాదీ. ఇరాన్‌లోని అస్త్రాబాద్ నుండి ఇతను వచ్చాడు కనుక ఇతని పేరు చివరన అస్త్రాబాదీ స్థిరపడింది. నవాబు ఒక పెద్ద కట్టడాన్ని నిర్మించమని సకల అధికారాలు తన ప్రధానమంత్రికి అప్పగించటం వలన అతను ఇస్పహాన్‌లోని చార్మినార్‌ను ఒక నమూనాగా చేసుకుని హైదరాబాద్‌లో మన చార్మినార్‌ను నిర్మించాడు.

ప్రధాని మీర్ మోమిన్ మంచి పరిపాలకుడే గాక ఆ కాలంలో గొప్ప పండితుడు, గొప్ప ఇంజనీరు కూడా! అందరూ చార్మినార్‌ను చూస్తారు. మెచ్చుకుంటారు. కానీ మీర్ మోమిన్ గురించి ఎవరికీ తెలియదు. తెలిసినా పట్టించుకోరు. పాపం మీర్ మోమిన్ "రాళ్లెత్తిన కూలీల జాబితాలో'' ఒకడుగా చేరిపోయాడు. **ఏమంటీ?**

**ఏమదుగుతున్నారూ? చార్మినార్ నిర్మాణం పూర్తయిన తర్వాత మీర్ మోమిన్ తన జన్మస్థలం ఇరాన్‌లోని అస్త్రాబాద్‌కు వెళ్లిపోయాడా అని అడుగుతున్నారా? కాదు కాదు. అతను పరదేశీ అయినా ఈ గడ్డ మీదనే జీవించి ఇక్కడ మట్టిలోనే మట్టిగా మారిపోయాడు. ఈ గడ్డ రుణం తీర్చుకోవడానికి మనకు చార్మినార్‌ను ఒక కానుకగా ఇచ్చి కాల యవనిక వెనక్కి కనుమరుగైపోయినాడు.** మొగల్‌పురాలో రిఫాయే ఆం ఇస్కూల్ దాటి సుల్తాన్ షాహీ బస్తీకి వెళ్లే తోవల ఎడమవైపు ఒక ఖబరస్తాన్ (శ్మశానం) ఉంటుంది. దాని పేరు మీర్ మోమీన్ దాయెర (సమాధి).


హైదరాబాద్‌లో చార్మినార్

మన నిత్యజీవిత సంగ్రామంలో కొంచెం తీరిక చేసుకుని దోసిలినిండా గులాబీలతో వెళ్లి, అతని సమాధిపై భక్తి శ్రద్ధలతో గులాబీలు వెదచల్లి నిండు హృదయంతో ఆ మహానుభావుడికి కృతజ్ఞతలు చెప్పుదామా?

సరే చార్మినార్ గురించి మరో మజేదార్ (ఇంటరెస్టింగ్) ముచ్చట చెప్పుకుందాం. చార్మినార్ నుండి గోల్కొండ కోటకు ఒక రహస్య సొరంగమార్గం ఉందన్న సంగతి మీకు తెలుసా? అబ్బే ఈ గ్లోబలైజేషన్‌లో మనం "విశ్వపౌరులం" అయిపోయాం కదా! ఇసుంటి చిన్న చిన్న విషయాలను పట్టించుకునే పురుసత్ మనకెక్కడిది? ప్రస్తుతం ఉన్న చార్మినార్ పోలీస్ కమీషనర్ ఆఫీస్ క్రింద నుండి ఈ సొరంగం ప్రారంభమవు తుంది. లాడ్‌బజార్, దాద్‌మహల్, అల్లారఖాబేగం మంజిల్, కోకాతట్టి, కార్వాన్, టోలీమసీద్, లంగర్‌హౌజ్‌ల నుంచి గోల్కొండకోట లోపలికి ఈ సొరంగ మార్గం వుంది. లాడ్‌బజార్ దగ్గర ఈ సొరంగం 30 అడుగుల లోతు 15 అడుగుల వెడల్పుతో వుంది. దీన్ని దూరాన్ని 4 కి.మీ. వరకు గుర్తించారు. ఆపైన వెళ్లటం ప్రమాదకరంగా వుంది– విషపూరిత క్రిమికీటకాలు, పాములు, తేళ్లు ఉండటం వలన! ఇవి నా ఆధారరహిత కల్పిత ఊహలు కావు. 1936లనే నిజాం కాలంలో అప్పటి మున్సిపల్ కమీషనర్ ఇనాయత్ జంగ్, ఆర్కియాలజిస్టు గులాం యాజ్దానీతో కలిసి రూపొందించిన రిపోర్టులోని సత్యాలు ఇవి.


పాకిస్తాన్ కరాచీలో చార్మినార్

లాడ్‌బజార్, ముర్గీకాచౌక్, కోకాతట్టి ప్రాంతాలలో ప్రజలు ఇళ్ల నిర్మాణాల కోసం ఇప్పటికీ తవ్వకాలు జరుపుతుంటే అనేకసార్లు ఈ సొరంగాలు బయటపడినాయి. కానీ పట్టించుకునే ప్రభుత్వాలు ఏవీ? నిన్నగాక మొన్న 14 మార్చి 2016 నాడు కోకా తట్టిలో ఒక వకీలు సాబ్ ఇంటి నిర్మాణం కోసం త్రవ్వుతుంటే ఒక పెద్ద ఫిరంగి బయటపడిందన్న సంగతి అన్ని పత్రికలు రాశాయి.

1962లో 1936 రిపోర్టు ఆధారంగా సెన్సస్ అసిస్టెంట్ డైరెక్టర్ ఖాజామోహియుద్దీన్, ఆర్కియాలజీ డైరెక్టర్ అబ్దుల్ వహీద్ ఖాన్‌లు కూడా పరిశోధనలు చేసి సొరంగ మార్గం నిజమేనని ప్రకటించారు. శత్రుసేనల నుండి రక్షణ కోసం, విలువైన సంపదలను తరలించేందుకు ఈ సొరంగ మార్గాన్ని ఉపయోగించేవారని వారు వివరించారు. ఇప్పటికైనా ఈ సొరంగాన్ని ఆ మార్గాన్ని పరిశోధనలతో పునరావిష్కరిస్తే చార్మినార్ నుండి గోల్కొండ కోట వరకు అండర్‌గ్రౌండ్ మెట్రోరైలు మార్గాన్ని నిర్మించుకోవచ్చును. అనేక బస్తీలను అనుసంధానిస్తూ ప్రజారవాణా వ్యవస్థను రూపొందించ వచ్చు. ఉపరితల కాలుష్య వాతావరణాన్ని కూడా నివారించ వచ్చు. లండన్‌లో ఉన్న భూగర్భ మెట్రోరైలు వ్యవస్థను మనం కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. అంతేగాక దేశ, విదేశ పర్యాటకులను ఈ సొరంగం పుణ్యమా అని ఆకర్షించి వారి జేబులు కత్తిరించి మన ఖజానాలు నింపుకోనూవచ్చు! స్మార్ట్‌సిటీలు, హైటెక్ సిటీలు అని కోట్లాది రూపాయలు వెచ్చించే బదులు, హెరిటేజ్ వాక్‌లు అని లక్షలాది రూపాయలు వృథా చేసే బదులు ఈ అద్భుత, చారిత్రక, వారసత్వ సంపదైన ఈ సొరంగాన్ని పట్టించుకుని ప్రపంచానికి దీని గొప్పదనాన్ని పునఃపరిచయం చేద్దామా? చూద్దాం మన నవ తెలంగాణ ప్రభుత్వం దీని గురించి ఆలోచిస్తుందేమో?

సరే! మొదటి చార్మినార్ ఇరాన్‌లోని ఇస్ఫహాన్‌లో ఉంది. రెండవ చార్మినార్ హైద్రాబాద్‌లో ఉంది. మరి మూడవ చార్మినార్ ఎక్కడుందో తెలుసా? పాకిస్తాన్‌లోని కరాచీలో! దేశ విభజనానంతరం ఆ తర్వాత హైద్రాబాద్ రాజ్యంపై పోలీస్ యాక్షన్ జరిగినంక హైద్రాబాద్ నుండి చాలా మంది ముస్లింలు పాకిస్తాన్‌కు వలసవెళ్లి చార్మినార్ మీది ప్రేమతో కరాచీలో ఒక చార్మినార్‌ను నిర్మించుకుని "పొగడరా నీ తల్లి భూమి భారతిని" అని తమను తాము తృప్తి పరచుకున్నారు.

***జయహో చార్మినార్.***

***(షహర్ నామా (హైద్రాబాద్ వీధులు – గాథలు) పుస్తకం నుంచి)***

**–పరవస్తు లోకేశ్వర్**
m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com

# పర్యావరణం - శాస్త్రం - నైతికత - తాత్విక దృక్పథాలు

(గత సంచిక తరువాయి)

**సోషల్ ఎకాలజీ**

ముర్రేబుక్‌చిన్ అనే సామాజిక సిద్ధాంకర్త సాగించిన ఆలోచనధారను 'సోషల్ ఎకాలజీ'గా వ్యవహరిస్తున్నారు. నాలుగు దశాబ్దాలపై చిలుకుగా ఈయన సామాజిక ఆధిపత్యం, ప్రకృతిపై ఆధిపత్యం మధ్యగల సంబంధాలను గురించి సాగించిన రచనల సారాంశం సోషల్ ఎకాలజీగా గుర్తింపు పొందింది.

ఈయన సాగించిన చింతనకు మూలాలు భిన్న రకాలైన తాత్విక సంప్రదాయాలలో కనిపిస్తాయి. ముఖ్యంగా మార్క్సీయ సామ్యవాదం, ఉదార అరాచకవాదం పాశ్చాత్య జీవవాదాలలో దర్శనమిస్తాయి. అదే విధంగా అరిస్టాటిల్, హెగెల్ వంటి తత్వవేత్తల ఆలోచనల ప్రభావం కనిపిస్తుంది.

ముర్రే బుక్‌చిన్ ప్రధానంగా ఆధిపత్యం అనే భావనను పరిశీలించాడు. ఆయన వాడిన సామాజిక ఆధిపత్యం అనేది ఏ అర్థంలో వాడాడో పరిశీలించాలి. ప్రత్యేకంగా ముర్రే సిద్ధాంతంలో శ్రేణులు (hierarchies) అనేది ప్రధాన భావనగా కనిపిస్తుంది. చాలా వివరణాత్మకంగా శ్రేణులు గురించి తెలిపాడు.



"The cultural and psychological systems obedience and command not merely the economic and political system to which the terms class and state most appropriately refer. Accordingly, hierarchy and domination could easily continue to exist in a "class less" or "state less society".

రాజ్యం, వర్గం అనే పదాలు ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను ఎంత ఖచ్చితంగా సూచిస్తాయో, సాంస్కృతిక, సంప్రదాయ, మానసిక వ్యవస్థలైన విధేయత, ఆదేశాలనేవి సూచించవు. వర్గం ఆర్థికాన్ని, రాజ్యం రాజకీయ వ్యవస్థలను సరళంగానే సూచిస్తాయి. అంటే రాజ్యం, ఆర్థిక వ్యవస్థల నుండి ఆదేశం, విధేయతలను మినహాయించి చూశాడు. ఇవి సంప్రదాయం, సాంస్కృతిక, మానసిక వ్యవస్థలకు చెందినవిగా పేర్కొంటున్నాడు. అదేవిధంగా ముర్రే బుక్‌చిన్ ఈ విధంగా అభిప్రాయడ్డాడు.

"Accordingly, hierarchy and domination could easily continue to exist in a "class less" or "state less Society"

పెద్దలు, పిల్లలను, పురుషులు స్త్రీను, ఒక జాతి మరొకజాతిని, జన సమూహాన్ని, పట్టణం పల్లెపై ఆధిపత్యం నెరపుతుందనే అర్థంలో domination అనే పదాన్ని సూచించాడు.

శ్రేణులు అంటునప్పుడు కనీసం రెండు బృందాలు లేదా సమూహాలు ఉంటాయి. ఒకటి మరొక దానిపై అధికారం కలిగి ఉంటుంది. ఈ అధికారంలో ఆధిపత్యవర్గం ఆదేశాలను ఇస్తుంది. న్యూనవర్గం విధేయతను పాటిస్తుంది. శ్రేణులు సామాజిక వ్యవస్థలో ఆధిపత్యాన్ని ప్రోత్సహిస్తాయి. దీనితో ఆధిక్యతలో ఉన్న బృందం తమకంటే తక్కువగా ఉన్న బృందం ద్వారా తన ప్రయోజనాలను నెరవేర్చుకోగలుగుతుంది. ఇది తమకంటే తక్కువ బృందాల ఆకాంక్షలను నెరవేర్చుకోవటంలో అడ్డుకూడా తగులుతుంది. ఆర్థికవర్గాలలోనే సామాజిక శ్రేణి, ఆధిపత్యం ప్రాథమిక రూపంలో ఉంటుందని సంప్రదాయ మార్క్సిస్టులు భావించినట్లుగా ముర్రే భావించలేదు. అలాగే అనార్కిస్టులు భావించినట్లుగా సామాజిక ఆధిపత్యానికి ఆధునిక రాజ్యం ప్రాథమిక ఏజెంట్‌గా ఉంటుందనీ భావించలేదు. ఆర్థిక వర్గాలు లేని సమాజాలలోనూ ఆధిపత్యనిర్మాణాలుంటాయని భావించాడు. అదేవిధంగా ముర్రే చెప్పిన దానిలో భౌతిక ఆధిపత్యం, అధికారం సామాజిక నియంత్రణకు మాత్రమే సాధనాలు కావు. దీనిని గురించి విశ్లేషించిన Jardins ఈ విధంగా వ్యాఖ్యానించాడు. "Hierarchy" is also a state of consciousness" as well as a social condition. People can be oppressed by their consciousness, their understandings and beliefs, as much as by external forces".

బాహ్యశక్తులు ఎంతగా తమను అణిచవేస్తాయో తమ స్వీయ చైతన్యంలో అంతగా అణచివేయబడతారు. వారి అవగాహనలు, విశ్వాస నమ్మకాలు కూడా అంతగా అణచివేతకు గురవుతాయి.

అంటే సామాజికంగా ఉన్న శ్రేణిగత నిర్మాణాలను ప్రజలు అంతర్లీనపరచుకుంటారు. తద్వారా తమ జీవితాలు అవమానాలకు, అపరాధ భావాలకు గురవుతుండగా, ఆధిపత్యం గలవారు జీవితంలోని సుఖ సంతోషాలను ఆనందిస్తారు. ఈ రకమైన శ్రేణీగత నిర్మాణాలు, ఆధిపత్యం పాతరాతియుగం మొదలుకొని ఆధునిక యుగం వరకు భిన్న రూపాల్లో ఉనికిలో ఉన్నాయని బుక్‌చిన్ గుర్తించి సూచించాడు.

సామాజిక శ్రేణుల పద్ధతుల నుండి ప్రకృతి ఆధిపత్యం మొలకెత్తింది. అయితే బుక్‌చిన్ ప్రామాణిక మార్క్సిస్టు అన్వయాన్ని తల్లకిందులు చేశాడు. మార్క్సిస్టుల దృష్టిలో మానవుల ఆధిపత్య సామర్థ్యం వ్యక్తిగత ఆస్తి సంపదను సృష్టించడానికి దోహదపడింది. వర్గ నిర్మాణాలు వర్గ సంఘర్షణకు అణచివేతకు దారితీశాయి. బుక్‌చిన్ దృష్టిలో ఆధిపత్య సామాజిక నిర్మాణాలు ప్రకృతిపై ఆధిక్యతకు మార్గానిచ్చాయి. అంటే సామాజిక ఆధిపత్య విధానాలు ఒక విస్తృత సాంస్కృతిక మనస్తత్వాన్ని పెంపొందించాయి లేదా భావజాలాన్ని రూపొందించాయి. ఈ భావజాలం ప్రకృతిపై ఆధిపత్యాన్ని సమర్థించేదిగా మిగిలింది. అంటే "social hierarchies provide both the psychological and material conditions- the motivation and the means- for exploiting and dominating nature" అని చెప్పవచ్చు.

శ్రేణీగత సమాజాలలో సామాజిక సంస్థలు, ఆచరణలు అన్నీ నియంత్రణను కల్పించడానికి రూపకల్పన చేయబడి ఉంటాయి. ఆర్థిక సామర్థ్యం ఒక ఆదర్శంగా పేర్కొనబడుతుంది. ఇటువంటి సమాజాలలో విజయం ఆధిపత్యం వహించటం, నియంత్రించటంగా అవగాహన చేసుకోబడుతుంది. అంటే ఎక్కువ మంది ఒక్కరికోసం పనిచేయటం, అధిక సంపద, అధికారం, హెూదాను కలిగి ఉండటమే విజయంగా అభివర్ణింపబడుతుంది. ఇటువంటి స్థితి ఉన్నప్పుడు సమాజం విజయాన్ని మానవేతర ప్రకృతిపై ఆధిపత్యంగా, నియంత్రణగా గుర్తిస్తుంది. శ్రేణీగత సమాజాలు రద్దు అయినప్పుడు మాత్రమే ప్రకృతి, మానవేతర ప్రపంచం విముక్తమవుతుంది. అట్లాంటప్పుడే పర్యావరణ సంక్షోభాలు అంతరిస్తాయి. సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

మానవాధిపత్యం నుండి ప్రకృతికి స్వేచ్ఛ ఎప్పుడు లభిస్తుందంటే మానవులు కూడా ఆధిపత్యం నుండి స్వేచ్ఛ పొందినప్పుడని బుక్‌చిన్ ప్రబలంగా విశ్వసించాడు. బుక్‌చిన్ ప్రతిపాదనలు పర్యావరణ తాత్త్విక సిద్ధాంతాలను ఒకమేరకు ప్రభావితం చేశాయి. మానవాళి తమ ఆధిపత్య ధోరణులను అర్థం చేసుకోవడానికి ఎంతగానో తోడ్పడింది. పర్యావరణ సంక్షోభాల విషయంగా తాత్త్విక చర్చలను ముందుకు నెట్టింది. పర్యావరణ సంక్షోభాలకు ముగింపు పలికే ప్రతి తాత్త్విక ఆలోచన కూడా అటు పర్యావరణానికి, ఇటు మానవ సమూహాలకు తోడ్పడ్తుందనటంలో సందేహించాల్సిందేమీ లేదు.



## పర్యావరణ స్త్రీవాదం (Ecofeminism)

పర్యావరణ సంబంధాంశాలను స్త్రీవాద దృష్టికోణంతో పరిశీలించటంతో పర్యావరణ స్త్రీవాదం ఉనికిలోకి వస్తుంది. స్త్రీవాదం పితృస్వామ్య వ్యవస్థ, ఆధిపత్యం, పురుషాధిక్యతలు, కుటుంబ నియంత్రణ, జెండర్‌పరంగా అసమానతలను గురించి పేర్కొంటుంది. సరిగ్గా సామాజిక పర్యావరణ వాదం పేర్కొన్న ఆధిపత్యం, నియంత్రణల గురించి పర్యావరణ స్త్రీవాదం మాట్లాడుతుంది. అటు సోషల్ ఎకాలజీని ఇటు స్త్రీవాదుల ఆలోచనలను కలిపి స్త్రీవాద పర్యావరణమని వ్యవహరిస్తున్నారు. అయితే ఈ రెండింటి మధ్య ఎన్ని సామ్యాలు కనిపిస్తాయో అన్ని తేడాలు కూడా ఉన్నాయి. కాగా ముర్రే బుక్‌చిన్ సామాజిక పర్యావరణ వాదానికి ఆద్యుడు. పర్యావరణ స్త్రీవాదంలో భిన్న ఆలోచనా స్రవంతులు కలగలుస్తాయి. ఇది ఒక ఏకీకృత సిద్ధాంతంగా కంటే, స్త్రీవాదులలో ఎన్ని వైవిధ్యపూరిత దృష్టి కోణాలున్నాయో వాటిని ప్రతిఫలింపజేస్తూ పర్యావరణ సమస్యలపై సాధారణ దృక్పథాలను వెల్లడిస్తుంది. "Social ecology and ecofeminism have much in common in their general analysis of ecological problems. Each sees ecological destruction as related to social problems of control and dominance"

పర్యావరణ విధ్వంసం అనేది నియంత్రణ, ఆధిపత్యం అనే సామాజిక సమస్యలకు సంబంధించిందిగా భావిస్తుంది. అయితే అటు సోషల్ ఎకాలజి గానీ, ఇటు పర్యావరణ స్రీవాదంగానీ ఈ సామాజిక సమస్యలకు భిన్నమైన ప్రత్యేకమైన వివరణలను అందించాయి. అట్లాగే సామాజిక మార్పుకోసం వీరు తలపెట్టే కార్యక్రమాలు కూడా పూర్తిగా ప్రత్యేకం. భిన్నంగానూ ఉంటాయి.

సోషల్ ఎకాలజీ, ఎకోఫెమినిజం పర్యావరణ సంక్షోభాలకు దారితీసిన కారణాలను అన్వేషించేందుకు సమాజాన్ని పరిశీలిస్తాయి. ఈ రెండు కూడా గుప్త పర్యావరణ వాదుల్లా పర్యావరణ విధ్వంసానికి మానవ, సామాజిక కారణాలను విస్మరించవు. ఈ రెండూ మానవకేంద్రక దృష్టికోణమే విధ్వంసాలకు కారణమని అంగీకరించవు. మానవులు రూపుదిద్దుకున్న వ్యవస్థలు, ఆచరణలు కారణమని చెపుతాయి. ముఖ్యంగా న్యాయసమ్మతంకాని వ్యవస్థలు, ఆచరణలను గురించి విమర్శనాత్మకంగా ఉంటాయి. సంప్రదాయ నైతికతల వైఫల్యమే పర్యావరణ సమస్యలకు కారణమనే వాదాన్ని ఇవి అంగీకరించవు. సామాజిక న్యాయం గురించిన సంప్రదాయ సిద్ధాంతాలు పర్యావరణ సమస్యలను విశ్లేషించడానికి తగినవనే దృక్పథాన్ని వీరు అంగీకరించరు. కొన్ని సామాజిక కారణాలు పర్యావరణ సంక్షోభాలకు మూలం అని వాదిస్తారు.

Specifically, social ecologists and ecofeminists believe that the domination and degradation of nature arise from social patterns of domination and hierarchy, patterns of social life in which some humans excercise control or domination over others"

సామాజిక పద్ధతులు సామాజిక జీవితంలో కొందరు ఇతరులపై నియంత్రణను, ఆధిపత్యం కలిగి ఉండటానికి వీలు కల్పించాయని ఇవే ప్రకృతిపై ఆధిపత్యానికి ప్రకృతిని క్షీణింప జేయడానికి మౌలికమైన కారణం అన్నది వీరి వాదం. వీరికి సామాజిక న్యాయం అనేది ప్రధానంగా దృష్టి నిలపాల్సిన అంశంగా అనిపిస్తుంది.

తొలిస్త్రీవాద తాత్త్వికులైన Rosemary Radford Reuther పర్యావరణ సమస్యలను సంబోధించాలంటే ఏం చేయాలో ఈ విధంగా సూచించింది.

"Women must see that there can be no liberation for them and no solution to the ecological crisis within a society whose fundamental model of relationships continue to be one of domination. They must unite the demnads of the womens movement with those of the ecological movement to envision a radical reshaping of the basic socioeconomic relations and the underlying values of this society"

పర్యావరణ విధ్వంసాన్ని మానవ ఆధిపత్యరూపంగా అర్థం చేసుకోవాలి. స్త్రీల ఆకాంక్షలన్నిటినీ ఐక్యం చేస్తూ పర్యావరణ ఉద్యమంలో భాగం చేస్తూ సామాజిక ఆర్థిక సంబంధాలను, సామాజిక విలువలను సరికొత్త రూపానికి మార్చటం అవసరం అని భావించాలి. ఆధిపత్యం అంటే ప్రకృతిపై ఆధిపత్యమే కాబట్టి అటు సోషల్ ఎకాలజిస్టులు, ఇటు పర్యావరణ స్త్రీవాదులు మానవులపై ఇతర మానవులు నెరపే సామాజిక సాధారణ పద్ధతులను అర్థం చేసుకోవలసి ఉంటుందని భావించారు. పర్యావరణ సంక్షోభాలకు సంబంధించిన సరైన అవగాహనతో సామాజిక, రాజకీయ తాత్త్వికతలను ప్రశ్నించాల్సిన అవసరాన్ని వీరు నొక్కిచెప్పారు.

మనమెట్లా జీవించాలి అనే ప్రాథమిక ప్రశ్న ఒక వ్యక్తిని, సమూహాన్ని సంబోధిస్తుంది. ఇది కొన్నిసార్లు "నీతి"గా అభివర్ణింప బడుతుంది. మనమెలా కలసి జీవించాలి? అనే ప్రశ్న సామాజిక న్యాయానికి సంబంధించింది. అందువల్లనే పర్యావరణ స్త్రీ వాదులు సామాజిక న్యాయం అనే మాట సామాజిక, రాజకీయతత్వానికి తొలిసూత్రంగా మార్చగలిగారు. కలిసి జీవించటం అంటే సమానత్వంతో మానవులతో జీవించటం. కేవలం మానవులతోనే కాకుండా మానవేతరమైన అన్నిటితో సమానత్వ భావనతో జీవించటం. సామాజిక ఆధిపత్యానికి, ప్రకృతిపై ఆధిపత్యానికి మధ్య నున్న సంబంధాలను ఎకోఫెమినిజం విభిన్నమైన పద్ధతులలో గుర్తించింది. స్త్రీవాద ఉద్యమాలకు, పర్యావరణ ఉద్యమాలకు గల సంబంధాలను కూడా ఇది గుర్తించింది. ఆ మేరకు పర్యావరణ తత్త్వ వివేచనలో తన దోహదాన్ని ప్రాధాన్యాంశంగా చూపగలిగింది.

అయితే ఆధిపత్యం గురించి లోతయిన అంశాలను కూడా వారు స్పృశించారు. ప్రతి ఆధిపత్యానికి ఒక తర్కం ఉంటుంది. ఇది ఆలోచనా పద్ధతికి సంబంధించింది. పురుషుల ఆధిపత్యం స్త్రీలపై ఉండటానికి గల కారణం ఆలోచనా విధాన ఫలితమే. అది చారిత్రకంగా, అనుభవాత్మకంగా, ప్రతీకాత్మకంగా, సైద్ధాంతికంగా కూడా వృద్ధి పొందుతూ వచ్చింది.



స్త్రీలు ఉద్వేగాత్ములు, పురుషులు తార్కింగా ఉంటారు అనే ఆలోచనా పద్ధతిలో ఒకరు అధికులు, మరొకలు అనధికులు అనే విలువ జత చేయబడింది. స్త్రీ పురుషుల స్వభావాలను, లక్షణాలను ఈ విలువ ఒక శ్రేణీగత నిర్మాణంగా రూపుదిద్దుకుంటుంది. స్త్రీలు తార్కికంగా ఆలోచించలేరు కనుక అధికులు కాలేరు అని నిర్ధారించబడుతుంది. సహజంగానే పురుషులకు ఉన్నత స్థితి, స్త్రీలకు న్యూనస్థాయి కల్పించబడుతుంది. ఈ తరహా ఆలోచనా పద్ధతులను, ఆధిపత్య తర్కాన్ని ఫెమినిజం నిరాకరిస్తుంది.

అలీసన్ జగ్గర్ రూపొందించిన ఆలోచనా చట్రం చాలామంది పర్యావరణ స్త్రీవాదుల ఆలోచనలను ప్రభావితం చేసింది. అలీసన్ జగ్గర్ ఉదార, మార్క్సిస్టు, రాడికల్ సోషలిస్టు ఫెమినిజాలుగా విభజించింది. ఇన్ని విధాలైన స్త్రీవాదాలకు ఆమె అణచివేతను, ప్రత్యామ్నాయ తాత్త్వికతలను పేర్కొంది.

ఉదారవాద స్త్రీవాదం స్త్రీ పురుషుల మధ్య తేడాలు ఉన్నాయనే విషయాన్ని నిరాకరిస్తుంది. ఉదార స్త్రీవాదం మానవులు ఒకే రకమైన స్వభావాన్ని కలిగి ఉంటారని, తార్కిక లక్షణం ఉంటుందని పేర్కొంటుంది. ఏ విధమైన చిన్న చూపు చూసినా, అసమానత పాటించినా అది న్యాయబద్ధం కాదని వాదిస్తుంది. అందువల్లనే ఉదార స్త్రీవాదం వివక్షతను గుర్తిస్తూ దానికి వ్యతిరేకంగా పోరాడుతుంది. సమాన హక్కులు, సమాన అవకాశాలను కోరుతుంది.

మార్క్సిస్టు ఫెమినిజం ప్రకారం స్త్రీల అణచివేతకు కారణం ఇంటిపనికి స్త్రీని పరిమితం చేయడం అంటుంది. ఇంటిపనిని ఆధారిత శ్రమరూపంగా భావిస్తుంది. స్త్రీల శ్రమకు వేతనరూప ప్రతిఫలం ఉండదు. స్త్రీల శ్రమ విస్మరణకు గురవుతుంది. గృహ సంబంధమైన పని, శ్రమ స్త్రీలకు ఆస్తిహక్కులను యాజమాన్య హక్కులను ఇచ్చేది కాదు. స్వతంత్రమైన ఉత్పాదక శ్రమ రూపాల్లో స్త్రీలు పాల్గొనటం ద్వారా స్త్రీలు అణచివేత, దోపిడీల నుండి విముక్తం అవుతారని సూచిస్తుంది.

సామ్యవాద స్త్రీవాదం మార్క్సిస్టుల వర్గ విశ్లేషణను నిరాకరిస్తుంది. సంక్లిష్టమైన సామాజిక సంబంధాల కారణంగానే స్త్రీల అణచివేత కొనసాగుతుందని భావిస్తుంది. ఈ సంబంధాలలో ఆర్థిక కారణాలతో పాటు సంప్రదాయ జండర్ విధానాలు, గుర్తింపులు దాగి ఉన్నాయని పేర్కొంటుంది. అందుకే వీరు ఒక మార్గాన్ని చూపారు. "Both marxist and socialist feminists would likely to describe the women of the chipco movement as becoming liberated from economic and social oppression to take a move autonamous and responsible role in theirown lives"

స్త్రీలపై ఆధిపత్యం, అణచివేతలు తొలగిపోవాలంటే చిప్కో ఉద్యమంలో స్త్రీలలాగా స్వయం ప్రతిపత్తిని పొందాలని సూచిస్తుంది. ఆర్థిక, సామాజిక, స్వయం ప్రతిపత్తిని పొందాలి.

ఇక రాడికల్ ఫెమినిస్టుల ప్రకారం జైవిక, లైంగిక తేడాలు స్త్రీ పురుషుల మధ్య ఉన్న కారణంగానే అణచివేతకు ఒక పునాది ఏర్పడిందని భావిస్తుంది. తల్లిగా, భార్యగా, లైంగిక వస్తువుగా స్త్రీ పరిగణన పొందటానికి ఈ జైవిక తేడాలను సమాజం సమర్థనీయంగా ప్రయోగించగలిగింది. సంప్రదాయ జెండర్ పాత్రలు రద్దు పరచగలిగితే స్త్రీల అణచివేత సాధ్యపడుతుందని రాడికల్ ఫెమినిజం భావిస్తుంది.

ప్రకృతిపై ఆధిపత్యానికి, స్త్రీలపై ఆధిపత్యానికి గల సంబంధాలను ధర్డ్‌వేవ్ ఫెమినిజం బలంగా గుర్తించింది. ఈ ఆధిపత్యం సాధారణ పద్ధతిగా కాకుండా భిన్న మార్గాలలో సంబంధితమై ఉన్నట్లుగా సూచిస్తుంది. ఎందుకంటే "Women have been identified as close to nature and Nature has been identified as feminine" ఈ రెండింటిమీద ఆధిపత్యం, అణచివేతలు కొనసాగాయి. అందువల్ల ఆధిక్య-న్యూనతలు, అణచివేత దారులు, అణచివేతకు గురయ్యేవారు లాంటి నిర్మాణ చట్రాలను సవాలు చేస్తూ పోవటమే పర్యావరణ స్త్రీవాదం చేసే పని. వీటికి ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తూ, ఆవిష్కరిస్తూ తమపై ఆధిపత్యాన్ని, ప్రకృతిపై ఆధిక్యాలను తొలగించటమే ఇకోఫెమినిజంలోని ప్రధాన తాత్త్విక ఆకాంక్షగా పేర్కొనవచ్చు.

**గుప్త పర్యావరణ అధ్యయనం (Deep Ecology)**

పర్యావరణ అధ్యయనాల గురించి వెలువడిన తాత్త్విక వాదాల్లో ఇది ఒకటి. దీనిని నార్వేజియన్ తాత్వికుడు Arne Naess ఒక ఉద్యమంగా ప్రతిష్ఠించాడు. డీప్ ఎకాలజీగా నామకరణం చేశాడు. ఇది సంస్కరణ పర్యావరణ వాదానికి విరుద్ధమైంది. సంస్కరణ పర్యావరణ వాదాన్ని వ్యతిరేకిస్తుంది. పర్యావరణ సమస్యలను పరిష్కరించాలంటే ఆర్థిక, రాజకీయ నిర్మాణాలలో కొన్ని అవసరమైన సర్దుబాట్లు, మార్పులు చేస్తే చాలని సంస్కరణ పర్యావరణ వాదం భావిస్తుంది. దూరదృష్టిలేని, పైపైన ఆలోచనలు చేసే సంస్కరణ పర్యావరణ వాదంలోని డొల్లతనాన్ని

బయటపెట్టింది. ఈ తాత్త్విక చింతనలోని ప్రధాన ఆలోచన ప్రకారం ప్రాణికోటి మధ్య పరస్పర ఆధారపడి ఉన్న సంబంధాల సంక్లిష్టతలోకి పర్యావరణం అంతర్దృష్టిని ప్రసరించటం వల్ల ప్రాథమిక అంచనాలలో విప్లవాత్మక మార్పులు సంభవిస్తాయని భావిస్తుంది. ఆధునిక మానవులు తన సహజ పరిసర ప్రపంచంతో అత్యంత దౌష్ట్య పూరితంగా వ్యవహరిస్తుంది. ఎందుకంటే వారి సంస్కృతి ప్రకారం, మానవాళి తన సహజ ప్రపంచంకంటే తనని తాను భిన్నమైనదిగా, అధికమైనదిగా, ఉన్నతమైనదిగా సంభావించుకుంటుంది. దీనికి భిన్నంగా డీప్ ఎకాలజీ ఆలోచిస్తుంది.

Deep ecology, on the other hand, affirms an understanding of life in which the thinking of the ‘self’ must already include other organisms and all that supports them, as part of ones own Identity”

దీని బట్టి చూస్తే తోటి ప్రాణి కోటిలో తన స్వీయాత్మను గుర్తించటం, గౌరవించటం అనే అవగాహను డీప్ ఎకాలజి ఇస్తుంది. స్వీయం అంటే ఇతర జీవులను కూడా తన అస్తిత్వంలో మిళితం చేసుకుని చూడటం 'స్వీయం' అనేది విడిగా లేదు. అది మహా ప్రాణ చైతన్యంలో అంతర్భవించి ఉంది. అది నిరంతరం తన అస్తిత్వ లేదా గుర్తింపు చక్రాన్ని ఇతర ప్రాణులతో పోల్చుకోవడం ద్వారా విశాల పరచుకుంటూ ఉంటుంది. ఉదార వాద పెట్టుబడి దారి విధానంలో కనిపించే అణుమాత్ర మానవుడి లాంటి ఉనికి కాదు అది. ఒక ప్రాణిని సంహరించటమంటే తనపై తానే ఆత్మహింసకు పాల్పడే చర్యగా అర్థం చేసుకోమనే ఆలోచనను ఇది కలిగిస్తుంది. దీనిలో నుంచే ప్రాణి కేంద్రక నైతికత ఉద్భవిస్తుంది.



ఒక విశాల సామాజిక ఉద్యమంగా 'డీప్ ఎకాలజీ' ప్రాణి కేంద్రక నైతికతను అనేకాంశాలతో విస్తారంగా పంచుకుంటుంది. ఈ గుప్త పర్యావరణం ఆచరణాత్మక నైతికత లేదా న్యాయ ఆలోచన లేకుండానే సంప్రదాయ పరిష్కారాలను సూచిస్తుంది. అదేమంటే సమాజాన్ని మార్చటం కోసం స్వీయాత్మను మార్చుకోవటం ఉత్తమమని సూచిస్తుంది. ఈ తాత్త్విక చింతతలో రెండు నియమాలు కనిపిస్తాయి.

**ఒకటి : స్వీయ చైతన్యం (Slef-realisation)**

**రెండు : ప్రాణి కేంద్రక సమానత్వం (Biocentric equality)**

అదేవిధంగా మానవ జీవన శైలి పట్ల కూడా ఈ వాదం అభ్యంతరాలను వ్యక్తపరిచింది. మానవులు సాధ్యమైనంత నిరాడంబరంగా ఉండాలని, సాంకేతిక రహితంగా ఉండాలని సూచించింది.

Our life styles ought to be simple in the sense that our consumer or material desires should be kept to a minimum.

దీనిని గురించి ఆలోచిస్తే మన భౌతిక వాంఛలు లేదా కోరికలు అన్నీ మానవ సమాజపు కృత్రిమ ఉత్పత్తులే అని తేలుతుంది.

డీప్ ఎకాలజీని గురించి పేర్కొన్న వారిలో ప్రముఖంగా ముగ్గురు చింతనాశీలురు కనిపిస్తారు. ఒకరు Arne Neass, రెండవ వారు Devall, మూడవ వారు George Sessions.

వీరిలో Arne Neass ఉపరి పర్యావరణ ఉద్యమం Shallow ecology movementలోని లోపాన్ని ఎత్తి చూపాడు. ఉపరి పర్యావరణ ఉద్యమం కాలుష్యానికి, వనరుల తరుగుదలకు వ్యతిరేకంగా నిబద్ధతతో పోరాడింది. ఈ నిబద్ధతాయుత పోరాటం పర్యావరణానికి చేకూర్చే హితవేమీ లేదు. పైగా ఇది అభివృద్ధి చెందిన దేశాలకు చెందిన సమృద్ధత గల ప్రజల ఆరోగ్యాలను సంరక్షించటమే ముఖ్య లక్ష్యంగా పోరాడింది. ఇది మానవ కేంద్రకమైనది. కాలుష్యానికి, వనరుల క్షీణతలకు గల సామాజిక, మానవ కారణాలను అన్వేషించకుండా కేవలం వాటికి వ్యతిరేకంగా పోరాడటం ప్రయోజన రహితమని డీప్ ఎకాలజిస్టులు భావించారు. నేస్ మనం విడివ్యక్తులుగా మనల్ని మనం మార్చుకొని, సంస్కృతిని మార్చాల్సిన అవసరాన్ని గుర్తించగా దేవాల్, సెషన్స్‌లు కొత్తది ఏమీ సృష్టించకుండానే పాతదాన్ని జాగృతం చేయాలని ఆశించారు. ఈ కొత్తది రూపొందటంలో పర్యావరణ చైతన్యం, పర్యావరణ, తాత్త్విక, ఆధ్యాత్మిక విధానాలు దోహదం చేయాలని ఆశించారు. భూమి, వృక్షాలు, జంతువులు, మానవుల మధ్య ఐక్యత ఉండాలని ఆకాంక్షించారు.

పర్యావరణ సమస్యలు, సంక్షోభాలకు కారణం మన ప్రాపంచిక, తాత్త్విక దృక్పథాలే కనుక అవి మారాలని ఆశించారు. ప్రత్యామ్నాయాల కొరకు అన్వేషించారు. ప్రత్యామ్నాయ ప్రాపంచిక, తాత్త్విక దృక్పథాలను 'పర్యావరణ తాత్త్వికత'గా 'ఇకో–సోఫీ'గా పేర్కొన్నారు.

ఇందుకోసం వారు కొన్ని సాధారణ సూత్రాలను, ప్రకటనలను రూపొందించి డీప్ కాలజీకి ఒక భూమికను సమకూర్చారు. వాటిల్లో ముఖ్యమైనవి ఇవి.

1. The flourishing of human and non human life on Earth has intrinsic value.

The value of non human life-form is independent of the usefulness these may have for narrrow human purposes.

2. Rich ness and diversity of life -forms are values in themselves and contribute to the flourishing of human and non human life on Earth.

3. Humans have no right to reduce the richness and diversity except to satisfy vital needs.

4. Present human interference with the non human world in excessive and the situation is worsening.

వీటితో పాటు మరికొన్ని సూత్రాలను రూపుదిద్దారు. మొత్తం మీద మానవ ఆధిపత్య భావనతో కూడిన ప్రాపంచిక దృక్పథం మారి పర్యావరణ హితకారక ఆలోచన విధానం రూపొందాల్సిన అవసరాన్ని డీప్ ఎకాలజీ నొక్కి చెప్పింది.

*(ఈ అధ్యాయంలోని మిగతా భాగం వచ్చే సంచికలో)*

–డా॥ ఆర్. సీతారామారావు,
m : 9866563519
e : sitametaphor@gmail.com

# చీర్యాలలో శిథిల శివాలయం: కళ్యాణీ చాళుక్యుల శాసనం

తెలంగాణా జాగృతి ఆధ్వర్యంలో తెలంగాణ చరిత్రను అన్వేషిస్తున్న కొత్తతెలంగాణ చరిత్రబృందం సభ్యులు శ్రీరామోజు హరగోపాల్, వేముగంటి మురళీకృష్ణ, సహాయకుడు చంటి, వారసత్వశాఖ ఉద్యోగి జి.రాజేందర్ గైడెన్స్ లో మేడ్చల్ జిల్లా, కీసర మండలంలోని చీర్యాల గ్రామంలో 1200 యేండ్ల నాటి పురాతన శివాలయ శిథిలాలను సందర్శించారు. అక్కడున్న శాసనాన్ని ఎడిట్ చేసి, పరిష్కరించారు.



మనం చూసే వీరగల్లులలో ప్రాణత్యాగం చేసిన శివభక్తుల ప్రతిమలు కూడా చేరి గౌరవించ బడుతున్నాయి. అటువంటి వీరగల్లు చీర్యాలలోని శివాలయు శిథిలాలలో కనిపించింది. భక్తుని తల నరుకుతున్న వీరుని శిల ఒకటి అక్కడ వుంది. ఆ శిథిలాలలో ఒక కాలు ఆనవాలు మిగిలిన నందిశిల్పం, దేవాలయ శిఖరం, దేవాలయ స్తంభాలు, రాతిగోడల భాగాలు కనిపిస్తున్నాయి. దేవాలయానికి అంతరాళం లేనట్టుంది. గర్భగుడి పూర్తిగా కూలిన రాళ్ళతో నిండిపోయింది. తూర్పు ముఖంగా వున్న శివాలయానికి ఎదురుగా నంది (మంటపంలో) వుంది. గుడికి 30అడుగుల దూరంలో పశ్చిమాభిముఖుడై వున్న ఎరుపురాతిలో చెక్కిన 5 అడుగుల ఎత్తు, అడుగున్నర మందం, మూడడుగుల వెడల్పున్న వినాయకశిల్పం వుంది. వినాయక రూపం రాష్ట్రకూటశైలిలో వుంది. ఈ వినాయకునికి రెండుచేతులే వున్నాయి. వినాయకుని విగ్రహం వెనకవైపు కూడా వినాయకుని సిగ, వీపుభాగం చెక్కివుంది. ఆ దేవాలయ ప్రాంగణంలో భక్తాంజ నేయుడు దక్షిణాభి ముఖంగా నిలిపివుంచబడి, పూజలందు కుంటున్నాడు.



అక్కడే రాతిసలపలకు ఒరిగించి పెట్టిన 4అడుగుల పొడవు, ముప్పావు అడుగు వెడల్పుతో వున్న నల్లరాతిమీద శాసనం చెక్కబడి వుంది. ఈ శాసనం కళ్యాణీ చాళుక్యుల పాలనాకాలంనాటిది. 1వ జగదేకమల్లుడు కళ్యాణపురం(కర్ణాటక) నెలవీడుగా (తాత్కాలిక రాజధాని) వున్నపుడు, శ్రీర్యాలపురం (చీర్యాల)లోని పెద గండిరడ్డి గడేశ్వరదేవరకు (స్థానికనామం) కొన్ని మరుతురుల భూమి, కొన్ని మాడల ధనం, రాటనాలపన్ను, కొడంగల సుంకం యిచ్చినట్టు శాసనంలో చెప్పబడింది. అట్లే గడేశ్వరునికి కవచము చేసిన బ్రహ్మోజుకు కూడా 1 మరుతురు భూమి యిచ్చినట్టు తెలుపబడింది.

**చీర్యాల**

**మండలం:** కీసర

**జిల్లా:** మేడ్చల్

శిథిల శివాలయం ఆవరణలో నాలుగడుగుల పొడవు, ముప్పావు అడుగు వెడల్పున్న నల్లరాతి స్తంభంపై శాసనం

**రాజవంశం:** కళ్యాణీ (పశ్చిమ) చాళుక్యులు

**రాజు:** 1వ జగదేకమల్లుడు

**తేదీ:** శక సం.(9)6(4) అంటే క్రీ.శ. 1042, (ఆ)షాఢ శుద్ధ 15, గురువారము

**భాష:** కన్నడము

**లిపి:** తెలుగన్నడము

**శాసన పంక్తులు:** 27

**శాసన సారాంశము:**

కళ్యాణీచాళుక్య చక్రవర్తి 2వ అయ్యన తమ్ముడు జయసింహుడు 'జగదేకమల్ల' బిరుదుతో క్రీ.శ.1014లో సింహాసనాన్ని అధిష్ఠించాడు. 1042 లేక 1044వ సం.లో ఆహవమల్ల, త్రైలోక్యమల్ల బిరుదులు కల సోమేశ్వరుడు జగదేకమల్లుని తర్వాత అధికారానికి వచ్చాడు. క్రీ.శ.1042సం.లో వేయబడిన ఈ శాసనంవల్ల "శ్రీర్యాలపురము" (చీర్యాల) వాసి (పె)దగండిరడ్డి దేవాలయములోని గడేశ్వరదేవరకు (ప)ది మరుతురులు, మాడ, రాటణమునకు ... మాడలు, ....పొలము కొలిచి రెండు మరుతురుల భూమి, ప్రతియంటికి రెండు మాడలు, గడేశ్వరదేవరకు, అడ్డా... గంధి కాలువ (కింద) 1మర్తురు భూమి, రాటణమునకు 1పుట్టెడు ధాన్యం, కొడంగడసుంకం చెల్లించాలని, గడేశ్వరదేవ కవచము చేసిన బ్రహ్మోజుకు 1మర్తురుభూమి ఇచ్చినట్లు తెలుస్తున్నది.

పూర్వం కొన్ని దేవాలయాల ఆవరణలో ఒకచోట సాగునీటి నందించేందుకు పెద్దబావిని తవ్వించి, దానికి రాటణస్తంభాన్ని ఏర్పాటు చేసి, అవసరమైన రైతులకు నీరు అందజేసి, వారివద్ద కొంత



పన్ను వసూలు చేసేవారు. మనకిటువంటి రాటణస్తంభాలు వరంగల్ దగ్గరలో వున్న శాయంపేట దేవాలయంలో, జాఫర్ గడ్ లోను, ఖమ్మంజిల్లా రాజేశ్వరపురంలోని దేవాలయంలోను కనిపిస్తాయి.

ఆనాటి కాలంలో రాజులు విధించే సుంకాలలో అంగడిసుంకం ఒకటి. ఈ శాసనంలో 'కొడంగడసుంకము' అని వుంది.

ఈ శాసనం రాసినవాడు.... రాజు అని చివరలో రాసివుంది.

**చీర్యాల శాసన పాఠం:**

1. "...(ద్రి.................హా రాజాధి
2. .........(శయ కులతిలక చాళుక్యాభర
3. ..........రాజ్యముత్తరోత్తరాభివ ృద్ధి ప్ర
4. ....ళ్యాణ పురద నెలవీడి నోళు
5. .....త్తుమిం ఏస్వస్తి(శ్రీ మచ్చాళు
6. (9)6(4)నేయ (శ్రీమతు జగనేకమల్ల
7. ....శాడ శుద్ధ15 గురువారదందు (శ్రి
8. (ర్యా)లపురము (పె)దగండిరెడ్డి మరి
9. ...ది మఱుతురున మాడ రె
10. ..త్తురున మాడ రాటనము కా
11. మాడలు ష...మి పొలము
12. గొలువ మరుతురు రెండు
13. రానకు నెతియింటికి రెండు
14. స్వస్తి(శ్రీ గడేశ్వరదేవర
15. ...ద...ము..పొ...........
16. ..గడేశ్వరదేవరకు మఱ్ఱురు
17. .............శ్వర దేవరకు అడ్డా
18. ..గంధి కాలువ మఱ్ఱు1
19. ..... ...సోమ..............
20. రాటణము ...పుట్టెండు1
21. ...ము నంద్య కొడంగడ సుంక
22. ..విలలు..(శ్రీగడేశ్వరదేవా
23. చము జేసినె (బమ్మోజునకు
24. మ1 గద్దపసము(ద్రము మ1
25. మ..స్వదత్తం పరదత్తం వా
26. ...సహ(సాణి మిష్టాయాం జా
27. ......రాజు (వాలు

ఈ శాసనాన్ని చదివి, పాఠం రాసింది:

-(శ్రీరామోజు హరగోపాల్, m : 9949498698
e : akshara25@gmail.com

ద

## రచయితలకు :

- కథ, వ్యాసం రెండు రెండున్నర (ఎ4 సైజ్) పేజీలకు మించరాదు.
- కవిత 20-22 లైన్లు మించకూడదు.
- పుస్తక సమీక్షలు, విశ్లేషణలు రెండు పేజీలకు మించరాదు.
- రెండు కాపీలు విధిగా పంపాలి.
- ప్రతి రచయితా తమ రచనతో పాటు, ఫోన్ నెంబర్, ఇ-మెయిల్, పోస్టల్ అడ్రస్ తప్పనిసరిగా ఇవ్వాలి.
- మ్యాటర్ టైప్ (డిటిపి) చేసి ఉంటే ఓపెన్ & పీడీఎఫ్ ఫైల్ పంపాలి.

## పాఠకులకు :

సామాజిక అంశాలు, చరిత్ర, వివిధ చేతివృత్తుల కళారూపాలు, నైపుణ్యాలు, వారసత్వం, పర్యావరణం, పర్యాటకం లాంటి అంశాలతో పాటు కథ, కవితలు, పుస్తక పరిచయాలు, సమీక్షలు, విశ్లేషణతో 'దక్కన్ ల్యాండ్' మీ చేతుల్లో ఉంది. ఇందులో ప్రచురితమైన రచనల పట్ల మీ అభిప్రాయాలను లేఖల రూపంలో తెలియ జేయగలరు.

చిరునామా :

TRC TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND : "CHANDRAM" 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
Fax: 040-27635644 Mobile: 9030626288
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com

# మునగాకు పొడి - ఔషధాల ఒడి

సాధారణంగా మనం మునగను కాయల కోసం వాడే ఒక కూరగాయ పంటగా పరి గణిస్తాం. కాని మునగ బహుళ ప్రయోజనకారి అని చాలా మందికి తెలియదు. దీని ఆకులు, కాయలు, విత్తనాలు చాలా ఔషధ విలువలు క లిగి ఉన్నందున దాదాపు 300 రకాల వ్యాధు లను నయం చేసే గుణాలు కలిగి ఉండటం వలన మునగను అద్భుత వృక్షంగా అభివర్ణి స్తారు. మునగాకు వివిధ ప్రయోజనాలను చూ ద్దాం.

ఆకులను ఆహారంలో ఒక భాగంగా తీసు కోవడం వల్ల గర్భిణులకు, బాలింతలకు రక్త హీనత తగ్గి ఆరోగ్యవంతమైన శిశు వు జన్మించ డానికి, పాలు అధికంగా రావటానికి దోహద పడుతుంది. అందుకే ఫిలిఫైన్స్ దేశంలో ము నగను 'తల్లుల మిత్రుని' గా పరిగణిస్తారు.

**ఆకుల పొడిలో గల పోషక విలువలు:**

మన ఆరోగ్యానికి అవసరమయ్యే పోషకాలలో దా దాపు 90 కంటే ఎక్కువ పోషకాలు మునగ ఆకుల్లో ఉంటాయి. తాజా ఆకుల కంటే పొడి లో ఎక్కువ మోతాదులో పోషకాలు, ఖనిజాలు, విటమిన్లు ఉంటాయి. తాజా ఆకుల పొడిలో (100గ్రాముల్లో) ఉండే పోషకాలు పట్టికలో తెలుపబడినవి.

| పోషకం | పచ్చి ఆకులు | ఎండిన ఆకులు |
|---|---|---|
| శక్తి (కాలరీలు) | 92 | 329 |
| (ప్రొటీన్లు) (గ్రా.) | 6.7 | 29.4 |
| కొవ్వు (గ్రా.) | 1.7 | 5.2 |
| పిండిపదార్థాలు (గ్రా.) | 12.5 | 41.2 |
| పీచుపదార్థాలు (గ్రా.) | 0.9 | 12.5 |
| విటమిన్ బి1 (ఎంజి) | 0.06 | 2.02 |
| విటమిన్ బి2 (ఎంజి) | 0.05 | 21.3 |
| విటమిన్ సి (ఎంజి) | 220 | 15.8 |
| విటమిన్ ఇ (ఎంజి) | 448 | 10.8 |
| కాల్షియం(ఎంజి) | 440 | 2185 |
| మెగ్నీషియం (ఎంజి) | 42 | 448 |
| పాస్ఫరస్ (ఎంజి) | 70 | 252 |
| పొటాషియం (ఎంజి) | 259 | 1236 |
| కాపర్ (ఎంజి) | 0.07 | 0.49 |
| ఇనుము (ఎంజి) | 0.8 | 25.6 |

**కొన్ని ఆసక్తికరమైన విషయాలు:**

- ఒక గ్రాము మునగ ఆకుల పొడిలో 3 రెట్లు ఎక్కువ విటమిన్లు ఉంటాయి.
- పాలకూర కంటే 25 రెట్లు ఎక్కువ ఇను ము, విటమిన్లు ఉంటాయి.
- అరంటి పండు కంటే 15 రెట్లు ఎక్కువ పొటాషియం ఉంటుంది.
- క్యారెట్ కంటే 10 రెట్లు ఎక్కువ విటమిన్ -ఎ ఉంటుంది.
- గుడ్డులో కంటే 9 రెట్లు ఎక్కువ మాంసకృ త్తులు ఉంటాయి.
- బత్తాయి కంటే 7 రెట్లు ఎక్కువ విటమిన్ -సి ఉంటుంది.

మునగాకును ఏ విధంగా ఆహారంలో తీసు కోవచ్చు అంటే మనం రోజు చేసుకునే చపాతీ లు, ఇడ్లీ, దోశ, సూపులు, సలాడ్‌లలో కలిపి ఆహారంగా తీసుకోవచ్చు. శాకాహార, మాంసా హార, వంటకాల్లో కలిపి వాడుకుంటే ఆ వంట ల పోషక విలువతో పాటు రుచి కూడా పెరు గుతుంది. 'టీ' రూపంలో కూడా తీసుకోవచ్చు.

**లాభాలు:**

మునగ ఆకుల పొడిని సిఫారసు చేసిన మోతాదులో వివిధ రకాలుగా ఉపయోగించు కోవడం వలన అనేక లాభాలు ఉన్నాయి. పోష కాల లోపాలతో బాధపడుతున్న చిన్న పిల్లలకు దివ్యౌషధంగా, సహాయకారిగా ఉపయోగ పడుతుంది. చాలా తక్కువ ఖర్చుతో, మానవ శరీరానికి కావాల్సిన పోషకాలను, ఖనిజాలను, విటమిన్లు మొదలైన వాటిని అందిస్తుంది.

అధికంగా పోషకాలు, పీచు పదార్థాలుండ టం వల్ల ఆహారంగా తీసుకోవడం వల్ల నిండు తనాన్ని ఇస్తుంది. కాలేయ పనితీరును క్రమ బద్ధీకరిస్తూ సాధారణ ఆరోగ్యాన్ని మెరుగుపరు స్తుంది.

ప్రాచీన ఆయుర్వేద వైద్య విధానాల్లో మున గ 300 లకు పైగా వ్యాధుల చికిత్సకు సమర్థ వంతంగా ఉపయోగించుకోవచ్చు. కేన్సర్, ఎయిడ్స్, మధుమేహం, అధిక రక్తపోటు, జీర్ణ సంబంధిత రుగ్మతలకు, కీళ్ళనొప్పులకు, రక్త హీనతకు, నిద్ర సహాయకారిణిగా, నొప్పుల ఉపశమనానికి మొదలైన వాటికి చికిత్సగా ఉపయోగించ వచ్చు.

అంతేకాకుండా కళ్ళ రక్షణకు, ఎముకల ఆరోగ్యానికి, దృఢత్వానికి, వ్యాధి నిరోధక శక్తి వృద్ధి చేయడానికి, శరీర జీవక్రియల్లో తోడ్పడు తుంది.

మునగ ఆకుల పొడిని క్రమం తప్పకుండా తీసుకోవటం వల్ల జీవిత కాలం పెరగడమే కాకుండా ముసలితనానికి ప్రతికూలంగా మరి యు బరువు తగ్గకుండా చేయడంలో సహకరి స్తుంది.

- ఇందులో గల 'క్లోరోజెనిక్ ఆమ్లం' రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నియంత్రిస్తుంది.
- 'క్వెర్సిటిన్' ఉండటం వలన రక్తపోటును నియంత్రించడంలో సహాయకారిగా పని చేస్తుంది.

- అభివృద్ధి చెందుతున్న దేశాలలో విటమి న్లు, ఖనిజపదార్థం, మాసంకృత్తుల లోపం తో, బాధ పడే వారికి మునగాకు ఒక దివ్య ఔషధంగా పనిచేస్తుంది.

**పొడిని తయారుచేసే పద్ధతి:**

మునగ ఆకుల పొడిని మన ఇళ్ళలో, వాణి జ్య సరళిలో తయారు చేసుకొని వాడుకోవచ్చు. ఈ కింద తెలిపిన విధంగా పొడిని చేయవచ్చు.

**ఆకుల కోత / సేకరణ:**

ఒకసారి మునగ మొక్కలు స్థిరపడిన తరువాత ఎప్పుడైనా ఆకు లకు స్వీకరించవచ్చు. అన్ని దశల్లోని ఆకులు అనగా లేత, ముదురాకులు పొడి తయారికి ఉపయోగపడతాయి. చెట్ల నుంచి లేదా మునగ మళ్ళ నుంచి ఆకులను సేకరించవచ్చు. చెట్లను భూమట్టానికి 1-2 మీటర్ల ఎత్తులో నరికి లేదా బాగా పెరిగిన చెట్లలో ఎంపిక చేసుకున్న కొ మ్మలను కత్తిరించి లేదా కొమ్మలను సగం వ రకు కత్తిరించి ఆకులను సేకరించవచ్చు. ము నగ మళ్ళ నుంచి ఆకులను సేకరించటానికి మొక్కలను భూమికి 15-50 సెం.మీ. ఎత్తులో కత్తిరించి ఆకులను సేకరించాలి. ఒక సంవత్స రంలో మళ్ళ నుంచి తగిన వ్యవధిలో 6-9 సార్లు ఆకులను సేకరించవచ్చు. ఆకులను వర్షాకాలంలో సేకరించుట వలన పొడి కాలం వచ్చే సమయానికి కత్తిరించిన చెట్లు తిరిగి చిగుర్లు వేస్తాయి.



మునగ ఆకులు త్వరగా నీటిని కోల్పోతా యి. కనుక త్వరగా వాటిని చల్లని ఉదయం వేళలో సేకరించాలి.ఆకులను సేకరించే సమ యంలో పురుగులు తెగుళ్ళు ఆశించిన ఆకుల ను, రంగు మారిన ఆకులను తొలగించి పశు గ్రాసానికి లేదా కంపోస్టు తయారుచేయుటానికి ఉపయోగించవచ్చు. సేకరించిన ఆకులను మంచి నీటితో శుభ్రంగా కడగాలి. దీనివల్ల ఆకులపై దుమ్ము, ధుళి సూక్ష్మక్రియులు తొలగి పోతాయి. వాణిజ్య సరళిలో చాలా బలహీన మైన బ్లీచ్ ద్రావణంతో ఆకులను శుభ్రపరు స్తారు.

**ఆకులను ఆరబెట్టటం:**

పై విధంగా శుభ్రం చేసిన ఆకులను నీడలో ఆరబెట్టాలి. వెలుతురు, ధూళి, దుమ్ము, పురు గుల నుంచి రక్షణ ఉండే ప్రదేశాల్లో ఆరబె ట్టాలి. ఇళ్ళలో తయారుచేసుకునేటప్పుడు ఇంటి లోనే ఆరబెట్టవచ్చు. వాణిజ్య సరళిలో పై వాటి నుంచి రక్షణగా షెడ్లలో ఆరబెట్టాలి. ఆకులను ఎండలో ఆరబెట్టకూడదు. ఎండలో ఆరబెట్టిన పుడు ఆకులనుంచి కొన్ని పోషకాలు, విట మిన్లు నశించిపోతాయి. ఆరబెట్టిన ఒకటి, రెం డు రోజుల్లో పెద్దాకుల నుంచి చిన్న ఆకులు సులువుగా విడిపోతాయి. లేదా ఆకులను దు లిపి రెమ్మలను, ఆకుల కాడలను తొలగించా లి. ఆకులను ఒక పలుచని గుడ్డమీద పలు చగా పరచి ఆరబెట్టాలి. అప్పుడప్పుడు ఆకులను కదలిస్తూ సమంగా ఆరేలా చూడాలి. ఆరబెట్టె ప్రాంతంలో గాలిలో తేమ అధికంగా ఉన్నప్పు డు నిర్ణీత పరికరాలను లేదా ఓవెన్లు లేదా ఫ్యాన్ల సహాయంతో ఆరబెట్టాలి. ఆకులు పెళ పెళలాడి, సులువుగా పొడిగా వచ్చే వరకు ఆ రబెట్టుకోవాలి. ఆకులను ఎంత త్వరగా వీలైతే అంతా త్వరగా ఆరనివ్వాలి. లేనిచో ఆకులకు బూజు, బూడిద తెగుళ్ళు ఆశించే అవకాశముం ది. ఆరబెట్టిన ఆకులను తరచుగా పరిక్షిస్తుండాలి. వీలైనంత వరకు ముదిరిన ఆకులనే సేకరిం చాలి.సాధారణంగా ఆరబెట్టిన ప్రాంతంలో గల పొడి వాతవరణాన్ని బట్టి, తేమ మోతాదును బట్టి ఆకులు 4-6 రోజుల్లో ఎండిపోతాయి. 10 కిలోల తాజా ఆకుల నుంచి 1 కిలో ఎం డిన పొడిని పొందవచ్చు.

**ఆకులను పొడి చేయుటం:**

కొద్ది మోతాదుల్లో లేదా ఇళ్ళలో రోట్లో లేదా విద్యుత్ గ్రైండర్లను వినియోగించాలి లేదా చే తులతో నలిపిగాని ఆరబెట్టి ఆకులను పొడి చేయవచ్చు. పొడి చేసిన తర్వాత జల్లెడ పట్టి మిగిలిపోయిన కాండం ముక్కలను, ఆకుల తొడిమల ముక్కలను తొలగించాలి.

**ఆకుల పొడిని ఆరబెట్టడం:**

ఆరబెట్టిన సమయంలో, పొడి చేసే సమ యంలో మునగ ఆకులు, పొడి పరిసరాల నుం చి తేమను త్వరగా గ్రహిస్తాయి. అలాంటి ఆకు లను, పొడిని, బూజు, బూడిద తెగుళ్ళూ ఆశిం చే అవకాశముండటం వల్ల పొడిని కూడా ఓవెన్లలో 50 డిగ్రీల సెం.గ్రే. వద్ద పొడిలోని తేమను తగ్గించటానికి ఎండనివ్వాలి.

**పొడిని నిల్వ చేయుటం:**

మునగ ఆకుల పొడిని వాణిజ్యపరంగా ఎక్కువగా తయారుచేసుకుంటాం. వర్షకాలం లో తయారుచేయుటం వల్ల, ఎడాది పొడవునా వినియోగించాలి కనుక పొడిని జాగ్రత్తగా, చెడిపోకుండా, తెగుళ్ళు ఆశించకుండా నిల్వ చేసుకోవాలి. ఇందుకుగాను గాలి చొరబడని డబ్బాల్లో నిల్వచేసుకొని వేడి, వెలుతురు తేమ నుంచి రక్షణగల ప్రదేశాలో నిల్వచేసుకోవాలి. నిల్వచేసిన పొడివెలుతురు, వేడి తగలడం వల్ల నాణ్యత దెబ్బతినడమే కాకుండా అందులోని పోషకాలు నష్టపోతాయి. అలాగే గాలిలో తేమ ను గ్రహించటం వల్ల బూజు తెగుళ్లు ఆశించి కొన్ని సమస్యలు వచ్చే అవకాశముంది. బూజు

# కొన్ని స్నేహికలు



కొన్ని స్నేహాలు అంతే
పొద్దటెండలు
కడుపుల పుట్ట పెట్టుకొని
వెటకారంగా కావలించుకుంటయి

ఎండు టాకుల కింద
సరసర పారే చేమీలియన్ చప్పుళ్లై
ఉరికొచ్చి మీద పడతయి

గాలి రొద చూపి
చేతిరుమాళ్ల
చుట్టి దాస్తయి.
కొన్ని స్నేహాలు
కొలిమి ల పెట్టినట్టు
నిప్పుల మీద
మలుపుతుంటయి

తనకోసమే పుట్టినట్టు
త్రిశంకు స్వర్గం
రంగుల రాట్న మెక్కిస్తయి
కొన్ని స్నేహాలు
మాటలు రాసిన

తేనె రుచులు
తెలువక ముందే
పదనుగ
చీరు కుంటయి
ఆనందం ఇంకి పాయేదాంక
అర చేతిలో
ఆశల బెల్లం
యూజ్ అండ్ త్రో

లౌ క్యా లు

కొన్ని స్నేహాలు
దోసిలి ఇచ్చినా
అందవు
అవి మెరిసినట్టే మెరిసి
రాలే చుక్కలు
పారే పాదరసాలు
సంధియ్యవు
సహకరించవు

అంతే సహజంగా
కొన్ని స్నేహికలు
క్షమా నిలయాలు అంతే
మనిషి కేంద్రికలు
నడినెత్తి మీద
ఎండలా మొదలవ తాయి
మట్టికీ
వేర్లకూ ఉన్న
బంధాలు
పరుచుకున్న
జీవ వాహికల అల్లుకుంటయి

**-బెల్లం కొండ సంపత్ కుమార్**
m : 9908519151

ఆశించిన పొడి దుర్వాసన కలిగి హానికరమైన ప్రభావాలు కలిగి ఉంటుంది. కనుక అలాంటి పొడి వినియోగానికి పనికిరాదు. కనుక పారే యాలి. చాలా జాగ్రత్తగా నిల్వ చేసినప్పుడు మునగ ఆకుల పొడిని 6-12 నెలల వరకు నిల్వ చేసుకోవచ్చు. సరిగా ఆరిపోయి, శుభ్రం గా ఉన్నప్పుడు, గాలి చేరని డబ్బాల్లో నిల్వ చేసినప్పుడు వేడి, వెలుతురు, తేమల నుంచి, రక్షణ కలిగినప్పుడు 24 డిగ్రీల సెం.గ్రే. కంటే తక్కువ ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేసినప్పుడు ఎ క్కువ కాలం నిల్వ ఉంటుంది.

**ఎంత మోతాదులో తీసుకోవాలంటే:**

- ప్రతిరోజు ఒకటిన్నర చెంచాల పొడిని క్ర మం తప్పకుండా 3 నెలలపాటు తీసుకున్న ట్లయితే మంచి యాంటి ఆక్సిడెంట్స్ గా పని చేస్తుంది.
- సాధారణ ఆరోగ్యవంతులకు రోజుకు 1 లేదా 2 చెంచాల పొడి, అధిక కొలెస్ట్రాల్ కలిగిన వారికి రోజుకు 2 టేబుల్ స్పూన్ పొడి.
- మధుమేహం, అధిక రక్తపోటుతో బాధపడే వారు రోజుకి 2 టేబుల్ స్పూన్ పొడి తీసుకో వచ్చు.
- పోషకాహార లోపం గల చిన్న పిల్లలకు (1-3 సంవత్సరాలు) రోజుకు 50గ్రా. పొడి ఇవ్వాలి.

ఇన్ని రకాల పోషకాలు, ఆరోగ్యపరంగా మేలు చేసే గుణం ఉన్న మునగాకు పొడికి అంతర్జాతీయ మార్కెట్లో కూడా ముఖ్యంగా యూరోపియన్ దేశాల్లో చాలా డిమాండ్ ఉన్నది. ఈ పొడిని ఎగుమతి చేసే అవకాశం ఉంది. దీని ఉత్పత్తిని వాణిజ్య సరళి లో పెద్ద ఎత్తున చేపట్టడం వలన గ్రామీణ ప్రాంతాల్లోని వారికి, మహిళలకు ఉపాధి అవకాశాన్ని కల్పించవచ్చు.

**-కె.స్వాతి, కె.సుకుమార్, ఆర్.ఉమారెడ్డి,**
అగ్రికల్చర్ పాలిటెక్నిక్, పొలాస, జగిత్యాల, తెలంగాణ




# గ్లోబల్ ఆర్ట్ ఆధ్వర్యంలో బాలభవన్‌లో చిత్రకళా ప్రదర్శన

## నగరం నుండి పలు పాఠశాలల పిల్లలు హాజరు

గ్లోబల్ ఆర్ట్ ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ ఆర్ట్‌ఫెస్ట్ 2020 చిత్రకళా ప్రదర్శనను నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్‌లోని జవహార్ బాలభవన్‌లో జనవరి 30న నిర్వహించారు. అందులో భాగంగా రకరకాల చిత్రాలు, అల్లికలు మరియు కుట్లు, వర్లీ ఆర్ట్, కోలార్జ్, బుక్‌లెట్స్, గ్రీటింగ్స్ కార్డ్స్, తోలుబొమ్మల చిత్రాలు, మెహిందీ, పచ్చబొట్లు, రంగోలి మొదలైన వాటిలో పిల్లలకు మెళుకువలు నేర్పించారు. అద్దంలో వారి ముఖ చిత్రమును వారే గీసుకునే విధంగా తర్ఫీదునిచ్చారు.



ఈ కార్యక్రమంలో పాఠశాల పిల్లలకు పెయింటింగ్‌పై పలు రకాల పోటీలు నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలల నుండి పాల్గొన్న పిల్లలు టీమ్‌లవారీగా విడిపోయి వైవిధ్యమైన చిత్రాలు గీశారు. ఆక్స్‌ఫర్డ్ పాఠశాల నుండి పాల్గొన్న విద్యార్థులు విభిన్నమైన చిత్రాలను గీసి చూపరులను ఆకట్టుకున్నారు. వాటర్ కలర్స్, మల్టీకలర్స్, కలర్ పెన్సిల్స్‌తో పిల్లలు పేపర్‌పై వేసిన వివిధ రకాల బొమ్మలు ఎంతో ఆకర్షణగా నిలిచాయి. చిత్రకళా నిర్వహణ (ఆర్ట్ క్రియేటివిటి)లో హిమాయత్‌నగర్ ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూలు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్న పిల్లల నుండి 10వ తరగతి వరకు నగరంలోని పలు పాఠశాలల నుంచి పిల్లలు పాల్గొని, ఎన్నో వైవిధ్యమైన చిత్రాలకు ప్రాణం పోశారు.

చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ చైర్మన్ మణికొండ వేదకుమార్ ఈ చిత్రకళ ప్రదర్శనలో పాల్గొని పిల్లలు వేస్తున్న చిత్రాలను ఆసక్తిగా తిలకించారు. చిత్రకళా నిర్వహణ జరుగుతున్నతీరును పరిశీలించి నిర్వాహ కులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ పాఠశాల నుండి సాబేర్, నుజహత్, ఉపాధ్యాయులు, సీబీఎస్ఈ, ఎస్ఎస్‌సీ విద్యార్థులు పాల్గొన్నారు.

– సచిన్, m : 9030 6262 88
e: desk.deccan@gmail.com




### రంగస్థలాన్ని రక్తి కట్టించిన రాగ సుగంధాలు - తొలి తెలుగు సినీ గేయాలు

# చందాల కేశవదాసు పాటలు

చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి తల్లడిల్లిన పాట. తల్లి చేయి పట్టుకొని ఊరూర తిరిగిన పాట. అన్న తపోదీక్షతో జీవితాన్ని అవగాహన చేసుకున్న పాట. భక్తి తత్వాన్ని, పరమార్థిక చింతనను గానం చేసిన పాట. మదినిండ శ్రీరామ తత్వాన్ని నింపుకొని తమ్మర సీతారామచంద్ర స్వామికే అంకితమైన పాట. దేహమే దేవాలయంగ ఉత్సవ విగ్రహాలను ఊరేగించిన పాట. హరికథా సుగంధాలను వెదజల్లిన పాట. మొట్టమొదటి మాటల సినిమాకు పాటలు రాసిన తొలి తెలుగు సినీ గేయకవి చందాల కేశవదాసు గురించి నేటి మన 'అలుగెల్లిన పాట'లో...

క్రీ.శ. 18వ శతాబ్దంలో కేశవదాసు పూర్వీకులు గుంటూరు జిల్లాలో గల చందవోలు గ్రామాన్ని విడిచి ఖమ్మం జిల్లా గంగదేవి పాడుకు చేరుకున్నరు. క్రమంగా చందవోలు చందాలగా మారి వీరు అక్కడే చందాలవారిగా స్థిరపడ్డారు. చందాల లక్ష్మీనారాయణ - పాపమ్మ దంపతులకు వెంకట్రామయ్య, కేశవదాసు అనే ఇద్దరు కొడుకులు కలిగిండ్రు. 1876 జూన్ 20న జక్కేపల్లిలో జన్మించిన కేశవదాసుకు పసితనం నుంచి ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. ఈయన తండ్రి వద్దనే ప్రాథమిక విద్యను పూర్తిచేసిండు. చిన్నప్పుడే తండ్రి చనిపోవడంతో తల్లి పావమ్మ కేశవదాసును గంగదేవిపాడులోని ఒక పంతులు దగ్గర చదువుకోసం పంపింది. మూడు నెలలకు కలిపి 25 పైసలు ఇచ్చేది. ఆ డబ్బు కూడా లేకపోవడంతో అనేక బాధలు పడ్డది. అప్పటికే తపోజీవితాన్ని గడుపుతున్న పెద్దకొడుకు వెంకట్రామయ్య వద్దకు తీసుకొచ్చింది. అన్నవద్దనే కేశవదాసు ఉపాసన విద్యను, అవధాన విద్యను అభ్యసించిండు. రామ నామ మంత్రాన్ని ఉపదేశించిన అన్నకు కేశవదాసు అనుంగు శిష్యుడిగా మారిపోయిండు. అయితే తనలాగ తమ్ముడు బ్రహ్మచర్యం పాటించ కూడదని ఆశించిండు. గృహస్థ జీవితం గడపమని ఆజ్ఞాపించిండు. ఖమ్మం గాడేపల్లి వెంకటప్పయ్య గారి బంధువుల అమ్మాయిని పెండ్లి చేసుకుండు. ఆమె రామకవి అనే కుమారునికి జన్మనిచ్చి చనిపోయింది. రామయ్య కూతురు చిట్టెమ్మను పెండ్లి చేసుకుండు. చందాల కేశవదాసు - చిట్టెమ్మ దంపతులకు కృష్ణమూర్తి, సీతారామయ్య, అండాలు అనే ముగ్గురు పిల్లలు కలిగిండ్రు.



భక్తి తత్వాన్ని అలవర్చుకున్న కేశవదాసు మనుషులంతా సమానమనే భావనతో పల్లెపల్లెకు తిరుగుతూ, తన ఇష్ట దైవమైన శ్రీరాముని కీర్తిస్తూ ఉండేవాడు. 1907లో కేశవదాసు నేలకొండపల్లిని దాటి శ్రీరామనవమి ఉత్సవాలు జరిగే తమ్మర గ్రామానికి చేరుకుండు. ఆలయ ప్రధాన అర్చకుల కోరిక మేరకు కేశవదాసు రాముని మీద 'స్తవమాలిక'ను రాసి ఇచ్చిండు. ఆలయ ప్రధానార్చకుడు, కవి పండితుడైన నరహరి నర్సింహాచార్యులు దగ్గర వైష్ణవ తత్వ రహస్యాలను తెలుసుకుండు. కవితా నిర్మాణ విశేషాలను, పౌరాణిక రచనా లక్షణాలను నేర్చుకుండు. ఆయననే గురువుగా స్వీకరించి జీవన గమనాన్ని కొనసాగించిండు.

చందాల కేశవదాసు శ్రీరాముని సేవలోనే శ్రీరామదండకం, పంచముఖ ఆంజనేయ దండకం, మంగళహారతులు, జోలపాటలు హెచ్చరికల వంటి ఎన్నో భక్తి గీతాలను రాసిండు.

చందాల కేశవదాసు రచించిన మంగళహారతులు అనేక దేవాలయాలలో ఎంతో ప్రసిద్ధి చెందినవి

దేవాలయ వేడుకలలో చివరిదైన ఊంజల సేవకు సంబంధించి ఆయన ఎన్నో పాటలు రాసిండు. ఉత్సవ విగ్రహాలను, ఊరేగింపు అనంతరం తిరిగి దేవాలయాలలో ప్రవేశపెట్టడాన్ని 'వేంచేపు' అంటరు. ఈ సందర్భంలో అర్చకులు చతుశ్లోకి, అష్టశ్లోకి వంటి స్తోత్రాలను చదువుతరు. ఈ సందర్భంలో పాడే పాటలను 'హెచ్చరికా' అంటరు. చందాల కేశవదాసు ఈ సందర్భానికి తగ్గట్టుగా అనేక హెచ్చరికా గీతాలను రాసిండు.

పొద్దునే దేవున్ని నిద్రలేపే సమయంలో ఆలపించే 'మేలుకొలుపు' గీతాలనే ప్రభాత గీతాలని, వైతాళిక గీతాలని కూడ అంటరు. తమ్మర సీతారామచంద్ర స్వామిని మేలుకొలిపే పాటలను చందాల కేశవదాసు రాసిండు.

చందాల కేశవదాసు పెండ్లీలలో సరదాగా ఆటపట్టించే తలుపుల పాటను కూడ రాసిండు.

"శ్రీజానకి తలుపుల బంధనమును జేసితి వేటికి
భామా పూజిత సద్గుణ గణధామా"

ఈ పాట అతి తేలికైన పదాలతో సరదాగ సాగిపోతది. అత్యంత ఛమత్కారంతో కూడిన ఈ పాట నూతన వధూవరుల జీవితంలో మరిచిపోలేని ఒక అద్భుతమైన ఆనందకరమైన సంఘటనగా, సన్నివేశంగా మిగిలిపోతది. చందాల కేశవదాసు రచనల్లో ఒకే ఒక్క శివనామ స్తోత్రం కనిపిస్తది.

1910లో యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలలో పాల్గొన్నారు. ఆ సంవత్సరం నుంచి వీరి కోరిక మేరకు స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగ సంగీత, సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కేశవదాసు రాసిన ప్రార్థనా గీతం నాటక సమాజాలలో ఎంతో ప్రసిద్ధి చెందింది. మొట్ట మొదట 'సురభి' నాటక సంస్థ వారు దీన్ని ప్రార్థనా గీతంగా పాడుకున్నరు. దాదాపు ఇరవై ఏడు సంవత్సరాల తర్వాత 1937లో విడుదలైన 'భక్తధృవ్' అనే హిందీ సినిమాలో టైటిల్స్ నేపధ్యగీతంగా కేశవదాసు పాటను వాడుకున్నరు. నెల్లుట్ల గ్రామానికి చెందిన రామనర్సింహారావు ప్రోత్సాహంతో 1911లో 'కనక్తార' అనే నాటకాన్ని రాసిండు. 1912లో 'రుక్మాంగధ' అనే నాటకాన్ని రాసిండు. "శ్రీరామ నామామృతం" అనే 108 చరణాల గీతాన్ని రాసిండు. 1913లో కేశవ నామాన్ని మకుటంగా చేసుకొని మరో 108 చరణాలతో 'కేశవశతకం' రాసి శ్రీరామునికి అంకితం ఇచ్చిండు.




మైలవరం గ్రామానికి చెందిన 'బాలభారతి' అనే నాటక సమాజంలో ప్రాంప్టరుగా చేరుతడు. 1915లో 'నాగదాసు చరిత్ర' అనే హరికథను రాసి, ఒక గొప్ప సాహితీ కళాఖండంగ తీర్చిదిద్దుతడు. మహాభారతంలోని 'విరాటపర్వాన్ని' అదే పేరుతో హరికథాగానం చేస్తడు. దీనినే 'పాండవ అజ్ఞాతవాసం, అజ్ఞాతవాసం, నర్తనశాల' అనే వేరువేరు పేర్లతో పిలుస్తుంటరు. ఈ కథాగానంలో 19 పద్యాలు 21 పాటలు ఉంటయి. జనం కరువు కాటకాలు సంభవించిన సమయంలో ఈ పాటలు ఎక్కువగా పాడుకునేది. 1922లో ముత్తరాజు సుబ్బారావు రచించిన 'శ్రీకృష్ణ తులాభారం' అనే నాటకానికి కేశవదాసు పాటలు రాసిండు. ఈ పాటలకు పాపట్ల బాణీలను సమకూర్చిండు. ఇవి ఎంతో ప్రసిద్ధి చెందినవి. ఈ పాటలు ఎక్కడ పాడిన ఆ రోజుల్లో కనకవర్షం కురిసిందంటే అతిశయోక్తి కాదు.

"బలే మంచి చౌక బేరము / ఇది సమయము మించినన్

దొరుకదు త్వరన్ గొనుడు / సుజనులారా..." అనే పాట ఆ నాటకంలో పదిహేనవది. శ్రీ కృష్ణున్ని అమ్మకానికి పెట్టిన సందర్భంలో వచ్చే పాట. దీంతో పాటు "మునివరా తుదకిట్లు" అని నారదున్ని సంబోధించి పాడుకునే పాట, "కొట్టు కొట్టండిరా బుర్ర పగుల కొట్టండిరా" వంటి పాటలు బహుళ ప్రచారాన్ని పొందినవి.

1923లో చందాల కేశవదాసు తన సంగీత గురువు పాపెట్ల లక్ష్మీకాంతయ్య చనిపోయినపుడు రాసిన

"స్వరనిధి స్వరపంజరమును

స్వరపేటి స్వరాలయంబు స్వరమూర్త్యనుచున్" అను పాట ఆర్ద్రత నిండిన పదాలతో, ఆవేదనతో ఆలపించిన ఈ గీతం అందరినీ కదిలిస్తది. ఇట్ల చందాల కేశవదాసు రచనలు చేస్తూ, నాటకాలు ప్రదర్శిస్తూ అనేక ప్రాంతాలు పర్యటించిండు. 'కనక్తార, రంగూన్‌రౌడి' వంటి నాటక ప్రదర్శనల కోసం బంబాయి, మద్రాసు, కలకత్తా, బెంగుళూరు, బర్మా వంటి నగరాలను సందర్శించిండు. తిరిగి 1925లో తమ్మరలో సప్తాహాన్ని ఏర్పాటుచేసి రామనామ సంకీర్తన చేయించిండు.

పానుగంటి లక్ష్మీనర్సింహారావు రాసిన 'రాధాకృష్ణ' నాటకం కోసం కేశవదాసు అనేక పాటలు రాసిండు. 1930 ప్రాంతంలో చనిపోయిన మోతీలాల్ నెహ్రూను గురించి కేశవదాసు కొన్ని పద్యాలు రచించిండు. బహుశా రాజకీయ నాయకుల మీద తెలుగులో వచ్చిన మొట్టమొదటి రచన కూడ ఇదే కావచ్చు. ఇదే కాకుండ చందాల కేశవదాసు "దేశమాత దిగులేల" అనే గీతాన్ని సాలురి రాజేశ్వర్‌రావుతో కలిసి రికార్డు చేసిండు.

చందాల కేశవదాసు గాంధీజీ ఉద్యమస్ఫూర్తిని, పోరాట పటిమను, దేశ స్వాతంత్ర్యకాంక్షను రంగరించి పాట రాసిండు.

ఈ పాటను కూడ సాలూరి రాజేశ్వర్‌రావు బెంగుళూరులో పాడి రికార్డు చేసిండు. 1931లో జగ్గయ్యపేటలో 'విరాటపర్వం' కథను హరికథాగానం చేస్తున్న సందర్భంలో సుప్రసిద్ధ కథారచయిత శ్రీపాద కృష్ణమూర్తి లేచి అదే వేదిక మీద చందాల కేశవదాసును 'అభినవసూత' అనే బిరుదుతో సత్కరించిండు. రంగస్థలం మీద ఎన్నో నాటకాలను రక్తికట్టించిన కళాకారులు రఘుపతి వెంకయ్య ప్రోత్సాహంతో క్రమంగా సినిమా వైపు అడుగులు వేసిండ్రు. 1931లోనే తొలి తెలుగు మాటల సినిమాకు అంకురార్పణ జరిగింది. మొదట ఆధ్యాత్మిక, పౌరాణిక నాటకాలనే సినిమాలుగా నిర్మించే ప్రయత్నం చేసినవాడు హెచ్.యం. రెడ్డి. ఆ రోజుల్లో ధర్మవరం రామకృష్ణాచార్యులు, బళ్ళారి రాఘవ వంటి ప్రముఖులలో ఒకరైన చందాల కేశవదాసుకు సినిమాలో పాటలు రాయడానికి హెచ్.ఎం. రెడ్డి నుంచి ఆహ్వానం అందింది.

ధర్మవరం రామకృష్ణాచార్యులు రాసిన నాటకాలలో చిత్రనళీయం, విషాద సారంగధర, ప్రహ్లాద, నాటకాలు అత్యంత ప్రసిద్ధి చెందినవి. వీటిలో భక్తిరస ప్రధానమైన 'ప్రహ్లాద' ను "భక్తప్రహ్లాద" అనే పేరుతో సినిమాగా తీయాలని, బొంబాయిలోని 'ఇంపీరియల్ ఫిల్మ్ స్టూడియో' సహకారంతో కృష్ణా ఫిలింస్ ఆధ్వర్యంలో సినిమాను ప్రారంభించిండ్రు. హెచ్.యం. రెడ్డి దర్శకత్వంలో మొదటి టాకీ సినిమాకు హెచ్.ఆర్. పద్మనాభ శాస్త్రి సంగీతాన్ని సమకూర్చిండు. ధర్మవరం నాటకంలోని మాటలు, పాటలు యధాతథంగ సినిమాలోకి తీసుకున్నప్పటికీ మరికొన్ని ప్రత్యేక సందర్భాలలో కూడ పాటల అవసరం ఏర్పడింది. వివిధ నాటకాలలో ఎన్నో సుప్రసిద్ధ గీతాలు రాసిన చందాల కేశవదాసును దర్శకుడు. తాను తీస్తున్న తొలి తెలుగు టాకీ సినిమాకు పాటలు రాయాల్సిందిగా ఆహ్వానించిండు. నాటకంలోని పాటలు కాకుండ సినిమాలోని సన్నివేశానికి తగ్గట్టుగ పాటలు రాసిన చందాల కేశవదాసు తొలి తెలుగు సినీ గేయ రచయితగా సుస్థిరమైన స్థానాన్ని సంపాదించిండు.

ఈ మొట్టమొదటి తెలుగు టాకీ సినిమా 'భక్తప్రహ్లాద' 1932

ఫిబ్రవరిలో విడుదలైంది. తర్వాత ఇవే పాటలను 'సురభి' నాటక సంస్థవారు వారి 'ప్లహ్లాద' నాటకంలో చేర్చుకొని ఇప్పటికీ ప్రదర్శిస్తూనే ఉన్నరు. సోమరాజు రామానుజ రావు రచించిన 'సతీసక్కుబాయి' నాటకాన్ని 1935లో 'సతీసక్కుబాయి'అనే పేరుతోనే సినిమా తీసింట్రు. ఈ సినిమాకోసం చందాల కేశవదాసు రాసిన ఐదు పాటలు బహుళ ప్రజాదరణ పొందినయి.

"నీ పదములనింక నే విడువ జాల" వంటి పాటలు జనం నాలుకల మీద నాట్యం చేసినయి. పొద్దున్లేస్తే ఈ పాటలతోనే పల్లె తెల్లారేది. సందర్భానుసారంగ పాడుకొని జనం సరససల్లాపాల్లో తేలియాడేవారు.

1935లో సి. పుల్లయ్య దర్శకత్వంలో వచ్చిన 'శ్రీ కృష్ణతులా భారం' సినిమాలోను చందాల కేశవదాసు పాటలన యథాతథంగ వాడుకున్నరు. 1966లో సురేష్ ప్రొడక్షన్స్‌వారు 'శ్రీ కృష్ణతులాభారం' అనే సినిమాను ఎన్.టి.ఆర్ హీరోగా నిర్మించింట్రు. ఇందులో చందాల కేశవదాసు మూడు పాటలను వాడుకున్నరు. కాని పేరు వేయలేదు. ఇది గమనించిన కేశవదాసు కుమారుడు కృష్ణమూర్తి కోర్టును ఆశ్రయించడంతో తీర్పు ఆయనకు అనుకూలంగా వచ్చింది. 1971లో తిరిగి ఆ సినిమా ప్రింట్లలో చందాల కేశవదాసు పేరును చేర్చడం జరిగింది.

1935లో తమ్మరలో భాగవత సప్తాహం నిర్వహిస్తున్న రోజుల్లోనే కేశవదాసు వామనావతార చరిత్రను 'బలిబంధనం' అనే పద్యనాటకంగా రాసిండు. ఈ నాటకంలో "గుండగొయ్యా రకం" అనే మాట గాని, 'కులాసాగా బతికినారు' అనే తెలుగు, హిందీ పదబంధాల సమ్మిళితం గాని తెలంగాణ భాషాఔన్యత్యాన్ని చాటిచెప్పినట్లయితది. ఈ నాటకంలో ఇంకా అనేక సామెతలు చోటుచేసుకున్నయి. ఇదే సమయంలో చందాల కేశవదాసుకు కలకత్తాలోని ప్రముఖ నటి దాసరి కోటిరత్నం నుంచి ఆహ్వానం అందింది. ఆమే నటించి నిర్మించిన 'సతీ అనసూయ' సినిమాకు కేశవదాసుతోనే కథ, మాటలు, పాటలు రాయించుకుంది.

1936 లో సదాశివరావు దర్శకత్వంలో వచ్చిన 'లంకాదహనం' సినిమా కోసం చందాల కేశవదాసు కథ, మాటలు, పాటలు రాసిండు. ఇవే కాకుండ కేశవదాసు ప్రసిద్ధ నాటకం 'కనక్తార' 1937లో 'కనకతార' సినిమాగ వచ్చింది. ఇందులోని ఈ పాటలు పూర్తి జానపదశైలిలో ఉండడంతో అమితమైన జనాదరణ లభించింది. ఈ సినిమాను 1956లో రజనీకాంత్ దర్వకత్వంలో వచ్చినప్పుపడు కూడ కేశవదాసు పాటలను యథాతథంగ వాడుకున్నరు. వీటిని ఘంటసాల స్వరపరిచిండు.

1941లో బేతవోలు జమీందారు పర్సా నారాయణరావు వంటి ప్రముఖుల ఆర్థిక సహకారంతో 'కనక్తార' నాటకాన్ని చుట్టుపక్కల గ్రామాలలో లెక్కలేనన్ని సార్లు ప్రదర్శించింట్రు.

ఈ క్రమంలోనే చందాల కేశవదాసు 'రాధాకృష్ణ' లంకాదహనం' వంటి సినిమాలకు పనిచేసి, 1946లో తిరిగి జక్కేపల్లికి చేరుకుండు. కుటుంబ పోషణ నిమిత్తం అనేక బాధలు పడ్డడు. జక్కేపల్లిలోని చందాల కేశవదాసు ఇంటిపై డాడిచేసిన రజాకార్‌లు సర్వస్వం ధ్వంసం చేసింట్రు. గాయపడ్డ మనసుతో చందాల కేశవదాసు ఉన్న భూమిని కౌలుకిచ్చి, పెట్టెబేడ సర్దుకొని ఖమ్మం పట్టణానికి చేరుకుండు. పెద్దకొడుకు వైద్యవృత్తికి అనువైన ప్రదేశం కోసం వెతికి సూర్యాపేట దగ్గరలోని నాయకన్‌గూడెం చేరుకొని, అక్కడే స్థిరపడ్డడు.

1948లో ఘంటసాల బలరామయ్య దర్శకత్వంలో అక్కినేని నాగేశ్వర్‌రావు, ఎస్. వరలక్ష్మి నటించిన 'బాలరాజు' సినిమాలో చందాల కేశవదాసు 'రాధాకృష్ణ' నాటకం కోసం రాసిన పాటలను కొన్నింటిని వాడుకున్నరు.

చందాల కేశవదాసు చివరి రోజుల్లో నాయకన్‌గూడెంలో పెద్దకొడుకు దగ్గర ఉన్న సమయంలో మునగాల కళాకారుల్లో ఒకడైన గంధం నర్సయ్య నటనాకౌశలం కేశవదాసును ఎంతగానో ఆకట్టుకుంది. ఆయన మాటతీరును, ప్రవర్తనను పరిశీలించిన కేశవదాసు 1955లో తన బిడ్డ ఆండాలును గంధం నర్సయ్యకు ఇచ్చి వివాహం చేసిండు. అనంతరం తమ్మరకు వెళ్ళిన కేశవదాసుకు తన మిత్రులు ఎవరు తారసపడలేదు. "నేను తెలిసిన వాళ్ళు, నాకు తెలిసిన వాళ్ళు అంతా పోయారు. నేను ఏకాకిని" అంటూ నిరాశ. నిస్పృలకు లోనై కుప్పగూలిపోయిండు. తెలంగాణ కీర్తిని ప్రశస్త్యం చేసిన చందాల కేశవదాసు ఒక్కసారి కుటుంబ సభ్యులందరిని కండ్లనిండ చూసుకొని కండ్లు మూసిండు. 1956 మే 14న శాశ్వతంగ ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోయిండు.

–అంబటి వేకువ,
m: 94927 55448
e: varji.ambati@gmail.com

## పుస్తక పరిచయం

పుస్తక పరిచయం శీర్షిక ద్వారా వివిధ పుస్తకాలను పాఠకులకు పరిచయం చేసే ప్రయత్నం ఇది. ఈ వేదిక ద్వారా పాఠకులకు తమ పుస్తకాలను పరిచయం చేయాలనుకునే రచయితలు, ప్రచురణ సంస్థలు తమ పుస్తకాలు రెండు కాపీలను దిగువ చిరునామాకు పంపించవచ్చు. వీలు వెంట వాటిని ప్రచురిస్తాం. సమకాలీన సామాజిక అంశాలతో కూడిన కొత్త పుస్తకాలకు ప్రాధాన్యం.

పుస్తకాలు పంపించాల్సిన చిరునామా:

TELANGANA RESOURCE CENTRE

**DECCAN LAND : "CHANDRAM"** 3-6-712/2, St.No.12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com

# 1938లో హైదరాబాద్‌కు మొదటి రంజీ ట్రోఫీ

**● సౌత్ ఇండియాలో ట్రోఫీ అందుకున్న మొదటి రాష్ట్రం ● నవనాగర్ జట్టుపై అద్భుత విజయం**

అదొక అండర్‌డాగ్స్ రంజీ జట్టు.. స్టార్ ప్లేయర్లు లేకుండా, ఎలాంటి అంచనాల్లేకుండా ఆటను ప్రారంభించింది. బరిలోకి దిగి ఒక్కో ప్రత్యర్థి జట్లకు దిమ్మదిరిగే షాక్ ఇస్తూ ఫైనల్ వరకు దూసుకొచ్చింది. ఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ప్రిన్స్లీ స్టేట్ ఆఫ్ నవనాగర్ జట్టుపై అద్భుతమైన విజయం సాధించి చరిత్ర సృష్టించింది. 1938వ సంవత్సరంలో హైదరాబాద్ రంజీ క్రికెట్ జట్టు ఈ రికార్డును నెలకొల్పింది.

భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) నిర్వహించే ఫస్ట్‌క్లాస్ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీ. ఈ రంజీ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ 1938, ఫిబ్రవరి 22 నుంచి 24 వరకు జరిగింది. ఈస్ట్‌జోన్, నార్త్‌జోన్, వెస్ట్‌జోన్, సౌత్ జోన్ నుండి మొత్తం 18 జట్లు పాల్గొన్నాయి. ముంబైలోని బ్రబోర్న్ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ రంజీ క్రికెట్ జట్టు మరియు ప్రిన్స్లీ స్టేట్ ఆఫ్ నవనాగర్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. హైదరాబాద్ జట్టు ఎలాంటి అంచనాలు లేకుండా పాల్గొనగా, డిఫెండింగ్ ఛాంపియన్ అయిన నవనాగర్ జట్టులో ప్రసిద్ధ క్రికెటర్లు అమర్‌సింగ్, సొరాబ్జీ కోలా (ఈ ఇద్దరు భారత క్రికెట్ టీమ్‌లో ఎంపికై టెస్టు మ్యాచ్‌లు ఆడారు) ఉన్నారు.



టాస్ గెలిచి మొదటి బ్యాటింగ్ ఎంచుకున్న నవనాగర్ జట్టు హైదరాబాద్ జట్టు అద్భుతమైన బౌలింగ్ ధాటికి కకావికలమైంది. నవనాగర్ జట్టు ఒకానొక దశలో 99 పరుగులకే 7 వికెట్లను కోల్పోయింది. బౌలర్ల ధాటికి 54.4 ఓవర్లలో 152 పరుగులకు కుప్పకూలింది. అందులో నారిమన్ మార్షల్ ఒక్కరే 36 పరుగులు సాధించి టాప్ స్కోరర్‌గా నిలిచారు. హైదరాబాద్ బౌలర్లలో హైదర్ అలీ 4/55 (22.4 ఓవర్లు) వికెట్లు, ఇబ్రహీం ఖాన్ 3/44 వికెట్లు తీసి ఉత్తమ ప్రతిభ కనబరిచారు.

అనంతరం హైదరాబాద్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 113 పరుగులు (31.2ఓవర్లు) సాధించింది. అందులో మహ్మద్ హుస్సేన్ ఒక్కరే 36 పరుగులు సాధించి టాప్ స్కోరర్‌గా నిలిచారు. నవనాగర్ బౌలర్‌లలో షూటే బెనర్జీ 4/34 వికెట్లు పడగొట్టారు.

రెండో ఇన్నింగ్స్‌లో నవనాగర్ జట్టు 270 (70.4ఓవర్లు) పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అల్బర్ట్ వెన్స్లీ 67 పరుగులు సాధించి టాప్ స్కోరర్‌గా నిలిచారు. హైదరాబాద్ బౌలర్లలో హైదర్ అలీ 5/92 (23 ఓవర్లు) వికెట్లు తీసి బెస్ట్ నమోదు చేశారు.

హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 310/9 పరుగులు (100.4 ఓవర్లు) సాధించి విజయం నమోదు చేసింది. ఎదుల్జీ ఐబరా ఒక్కరే 137 (నాటౌట్) పరుగులు చేసి హైదరాబాద్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. నవనాగర్ జట్టులో ముబారక్ అలీ 3/48 (21ఓవర్లు) వికెట్లు సాధించారు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలుపుకొని నవనాగర్ జట్టు మొత్తం 422 పరుగులు సాధించగా, రెండు ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ జట్టు 423 పరుగులు సాధించి జయకేతనం ఎగురవేసింది.

**హైదరాబాద్ విన్నింగ్ టీమ్‌లో సభ్యులు :**

ఎస్.ఎం.హుస్సేన్ – (క్యాప్టెన్), అసదుల్లా ఖురేషీ, ఎస్.ఆర్.మెహతా, అశ్వక్ అహ్మద్, ఈబీ.ఐబరా, హైదర్ అలీ, ఎస్.ఎం.హదీ, ఎఫ్.టుర్కీ, వీజీ.మచి (వికెట్ కీపర్), వజుభా, ఇబ్రహీం ఖాన్, 12వ ఆటగాడు హెచ్.అలీ.

**సౌత్ ఇండియాలో మొదటి జట్టు :**

రంజీ క్రికెట్ మ్యాచ్‌లో సౌత్ ఇండియా నుండి మొదటి సారిగా రంజీ క్రికెట్ ట్రోఫీ సొంతం చేసుకున్న జట్టుగా హైదరాబాద్ చరిత్ర పుటల్లో స్థానం సంపాదించుకుంది.

హైదరాబాద్ రంజీ జట్టులో ఆడిన ఇదుల్జీ బుర్జోర్జీ ఐబరా 1986–87 రంజీ ట్రోఫీ విన్నింగ్ టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించారు.

– ఖైజర్ భాషా, m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

## పాఠకులు, రచయితలకు శుభవార్త   దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

దక్కన్ ల్యాండ్ మాసపత్రిక ISSN (International Standard Serial Number) ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా ISSN 2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, వర్ధమాన రచయితలు, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింపజేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరుతున్నాం.

రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :
"చంద్రం" 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029 Telangana.
సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com
- ఎడిటర్



'మాభూమి' సన్నివేశంలో ఆర్టిస్టులకు డైలాగ్స్‌ను వివరిస్తున్న దర్శకుడు గౌతంఘోష్, నిర్మాత బి.నరసింగరావు

# నలభై వసంతాల మాభూమి

**1950**లలో భారతదేశంలో నవ్య సినిమా ప్రారంభమై దాని ప్రభావం క్రమంగా మరాఠి, ఒరియా, అస్సామి రంగాలకు పాకినా దక్షిణాదిని తాకింది 1970 ప్రారంభంలో. అదీ మలయాళ రంగాన్ని. అప్పటికే రామూ కారియత్ వంటివారు 'నీలక్కుయిల్' (1954), 'చెమ్మీన్' (65), పి.రాందాస్ 'న్యూస్‌పేపర్ బాయ్' (1954) వంటి ఆలోచనాత్మక చిత్రాలు మలయాళంలో వచ్చినవి. అయితే ఆదూర్ గోపాల కృష్ణన్ మలయాళ చిత్రరంగ ప్రవేశం మలయాళ సినిమా రంగాన్ని మహత్తరమైన మలుపు తిప్పింది.

వీటన్నింటి ప్రభావం మద్రాసును తాకలేదు కానీ హైదరాబాదును తాకి3. అది సికిందరాబాదు ఆల్వాల్‌లో పుట్టి పెరిగిన 'శ్యాం బెనగల్'ని ప్రభావితం చేశాయి. శ్యాంబెనగల్ అచ్చ తెలంగాణ జీవితాన్ని ప్రతిబింబిస్తూ, 'అంకుర్' సినిమాగా 1974లో తీశారు. తెలంగాణలోని భూస్వాముల దౌర్జన్యాలు, స్త్రీలపట్ల అమానవీయంగా ప్రవర్తించే తీరుకు దృశ్యరూపం ఇస్తూ ఈ




సినిమా తీశారాయన. జాతీయస్థాయిలో అది ఉత్తమ చిత్రం, ఉత్తమ నటీ నటుల అవార్డులను సాధించింది. అట్లా భారతదేశంలో సమాంతర సినిమాకు హైదరాబాదు తొలి బీజం వేసింది. శ్యాంబెనగల్ తెలంగాణ గడీల దొరల కథతో ఆ తరువాత 'నిశాంత్' తీశారు.

సరిగ్గా ఇదే కాలంలో వరంగల్‌కు చెందిన, టి.మాధవరావు దాశరథి రంగాచార్య రాసిన 'చిల్లర దేవుళ్ళు' నవలను అదే పేరుతో తెరకెక్కించారు. ప్రయత్నం మెచ్చుకోదగినదే అయినా సినిమా ట్రీట్‌మెంట్ సరిగ్గా లేకపోవడంతో ఫెయిలయింది. కానీ తెలంగాణ భాష, యాస, కథలతో తెలుగులో తయారైన తొలి చిత్రంగా 'చిల్లర దేవుళ్ళు' (1977) చరిత్రకెక్కింది. ఇటు డైభ్భైల్లో తెలుగు సినిమా పతన దశకు చేరుకున్నది. అగ్ర హీరోలుగా ఉన్న ఎన్టీఆర్, ఎఎన్నార్‌లు స్టెప్పులు, ఫైట్లు చేస్తూ కొత్తతరంతో పోటీపడుతూ ఉంటే సినిమా రంగం సంక్షోభిత కాలంలోకి వెళ్ళిపోయిన పరిస్థితి అది.

తెలుగు సినిమా రంగంలో 1970లో మొదలైన పతనదశ 1980 నాటికి క్రమంగా



తన ఆధిపత్యాన్ని పెంచుకుంటున్న సమయం అది. తెరనిండా హత్యలు, దోపిడీలు వికృత నృత్యాలు, ద్వంద్వార్థాల సంభాషణలు, పాటలు ఆ తరానికి చెడుపు చేసే కథలు, విలయతాండవం చేస్తున్న కాలమది. అప్పటి దాకా (1970) కాల్పనిక కథలే అయినా సమాజానికి చెరుపు చేయని చిత్రీకరణ కొంత ఉండేది. సంగీత, సాహిత్యాలు, విలువల గురించి కొద్దిగా బాధ్యతలుండేవి. కానీ ఆ తరువాత అవన్నీ సినిమాకు అంటరానివైనవి. ఇలాంటి తరుణంలో ఒక కొత్త ప్రత్యామ్నాయాన్ని, విభిన్నతను ఇంకా చెప్పాలంటే ఒక వాస్తవిక సమాజాన్ని తెరకెక్కించాలని ప్రజలు తమ కోసం చేసిన ఒక మహత్తర తెలంగాణ సాయుధ పోరాటాన్ని దృశ్యమానం చేస్తూ కొందరు ఔత్సాహిక ప్రగతిశీల వాదులు చేసిన అపూర్వ ప్రయత్నమే 'మా భూమి' సినిమా.

**మాభూమి : వెండితెరపై**

**తెలంగాణ మట్టిమనుషుల పోరాటం**

మా భూమి సినిమా నిర్మాణ ప్రయత్నాలు 1977లోనే మొదలైనవి. అయితే అంతకు ముందు వచ్చిన మృణాల్ సేన్ 'ఒక వూరి కథ' విడుదలైంది. దాని నిర్మాత రవీంద్రనాథ్. అయితే అది వ్యాపార పరంగా విజయం పొందక పోయినా, తెలంగాణలో సినిమా నిర్మాణానికి ఊతమిచ్చింది. దీని ఫలితం ఎలా ఉన్నా మళ్ళీ కూడా మృణాల్ సేన్‌తో తమ సినిమాను దర్శకత్వం చేయించాలని రవీంద్రనాథ్– బి.నరసింగ రావులు అనుకున్నారు. ఆనుకున్నట్లుగానే ఇద్దరూ వెళ్ళి మద్రాసులో ఉన్న మృణాల్‌సేన్‌ను అడిగారు. ఆయన బడ్జెట్ ఎంతపెడతారని అడిగితే తాము అనుకున్న బడ్జెట్ చెప్పారు. ఆయన దృష్టిలో అది చాలా చిన్న బడ్జెట్ అనిపించడంతో ఇప్పుడున్న పరిస్థితుల్లో అంత తక్కువ బడ్జెట్‌లో నేను సినిమా తీసిపెట్టలేనని చెప్పారు. అయితే మళ్ళీ ఆయనే మీకు సరిపోయె దర్శకుడు బెంగాల్‌లో ఒకడున్నాడు. అతనిప్పటికే డాక్యమెంటరీలు తీసి మంచి పేరు తెచ్చుకున్నాడని గౌతంఘోష్‌ను సూచించారు. గౌతంఘోష్ అప్పటికే 'ది న్యూ ఎర్త్', 'హంగ్రీ ఆటమ్' డాక్యుమెంటరీలు తీసి జాతీయ స్థాయిలోనే కాదు అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు, ప్రశంసలు అందుకున్న యువ దర్శకుడు. మృణాల్‌సేన్ సలహా మేరకు 'మాభూమి' సినిమా కోసం గౌతంఘోష్‌ని దర్శకుడిగా ఎంపిక చేయడానికి నరసింగరావు– రవీంద్రనాథ్‌ల బృందం కలకత్తా వెళ్ళింది.

గౌతంఘోష్ సినిమా తీయడానికి ఒప్పుకున్నాడు. అయితే కథ ఏమిటనే చర్చ మొదలైంది. తెలంగాణ ఇతివృత్తంగా ఉండాలన్నది మొదటి ప్రాధాన్యం. దాంతో కిషన్ చందర్ ఉర్దూలో రాసిన 'జబ్ ఖేత్ జాగే' నవలను సినిమాగా తీయడానికి నిర్ణయమైంది. ఈ నవల అప్పటికే 'జైత్రయాత్ర' పేరుతో తెలుగులోకి అనువాదమైంది. దీనికి కింద ట్యాగ్‌లైన్ 'పొలాలు మేల్కొన్నపుడు". హిందీలో కొంత ప్రవేశం ఉన్న గౌతంఘోష్ 'జబ్ ఖేత్ జాగే' నవల ఆధారంగా ఒక స్క్రీన్‌ప్లే రాసుకుని హైదరాబాదు వచ్చారు.

"అయితే ఆయన తయారుచేసిన స్క్రిప్టు మాకు నచ్చలేదు. తెలంగాణలో చోటుచేసుకున్న సంఘటనల గురించి 'మగ్దూం మొయినుద్దీన్ చెప్పిన సంఘటనల ఆధారంగానే కిషన్ చందర్ 'జబ్ ఖేత్ జాగే' నవలను రాశారు. ఆ నవలలోని కొన్ని విషయాలు అశాస్త్రీయంగా అనిపిస్తాయి. గౌతం బెంగాలీ కావడం తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర గురించి తెలియనివాడవటంతో ఆ నవలలో ఉన్న అంశాల ఆధారంగానే తన స్క్రిప్టు తయారుచేసుకున్నాడు. అందుకే మేం ఆ స్క్రిప్టును ప్రక్కనపెట్టి అందరం కలిసి తెలంగాణలో సాయుధ పోరాటం జరిగిన కొన్ని ప్రాంతాలలో తిరగాలని నిర్ణయించుకున్నాం. అనుకున్నట్లుగానే సూర్యాపేట, బైరాన్‌పల్లి, బాలముల, నల్గొండ, వరంగల్, కరీంనగర్ తదితర ప్రాంతాలు తిరిగాం. తెలంగాణ పోరాటంలో పాల్గొన్నవాళ్ళని ప్రత్యక్షంగా కలుసుకుని వాళ్ళ అనుభవాలను తెలుసుకున్నాం. వీటికితోడు లైబ్రరీల్లో 1940 ల నాటి మీజాన్ డెక్కన్ క్రానికల్, గోల్కొండ పత్రికల్ని తిరగేశాం. సాయుధ పోరాటంపై నాయకులు, రచయితలు రాసిన పుస్తకాలు సేకరించాము. ఫోటోల్ని సేకరించాము. సమాచార సేకరణ పూర్తయ్యాక నేను, గౌతం, పార్థా బెనర్జీ, ప్రాణ్‌రావు కూర్చుని స్క్రిప్టు సిద్ధం చేశాం. గ్రామీణ జీవితంలో అనుభవజ్ఞుడైన లక్ష్మారెడ్డిని పిలిపించి స్క్రిప్టులో అశాస్త్రీయమైనవి ఏవైనా ఉంటే చెప్పమని సలహాలు తీసుకుని ఫైనల్ స్క్రిప్టు సిద్ధం చేశాం" అంటారు బి.ఎన్.

సినిమా అంతా 1940ల నాటి వాతావరణం ప్రతిబింబించాలి. తెలంగాణ పల్లె జీవనం ఎట్ల ఉంటదోనన్నది కనిపించాలి. అందుకు నర్సింగరావు, గౌతంఘోష్ బృందం అంతా ఊర్లలోకి తెల్లవారు తుండగానే వెళ్ళి ప్రజల ఇండ్లముందు కాపలా కాసేవారు. లేస్తూనే వారి దినచర్య ఎట్లా ఉంటది, స్త్రీలు ఎలాంటి పనులు చేస్తారు, జనాల కట్టు, బొట్టు, ఆహార్యం, అలవాట్లు, వాచికం అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. వీటన్నింటి వెనుక ఉన్నది బి.నర్సింగ్‌రావే. ఇంకా మా భూమిలో ఉపయోగించడానికి ఎలాంటి పాటలుండాలి, బుర్రకథ, పీర్ల పండుగ, దూలా, పోచమ్మ పండుగ, వరినాట్ల పాట, వాటికి సంబంధించిన ట్యూన్లు అన్ని కూడా బి.నర్సింగరావు ఎంపిక చేసినవే. లొకేషన్‌లో అప్పటికప్పుడు డైలాగ్‌లు రాసి షూటింగ్ చేయడంవల్ల సినిమాలో సహజత్వం కనిపిస్తుంది. పెద్ద మనుషులంతా ఒకచోట కూర్చుని వ్యూహ రచన చేసేటప్పుడు మాట్లాడుకునే మాటలు "పెద్దమనిషి తరీఖానేనా ఇది" అని అనడంవంటివి గ్రామీణ సంభాషణ రీతులను పట్టిచూపుతవి.

సినిమా షూటింగ్ హైదరాబాదులోని సారథి స్టూడియోస్, పురానాపూల్, హైకోర్టు పరిసరాలు, సిటీ కాలేజి, జూబ్లీహిల్స్,



## మా భూమి నిర్మాత అన్న గుర్తింపు గర్వంగా అనిపిస్తుంది. - బి. నరసింగరావు

"మా భూమి సినిమాకు నలభై ఏళ్లు వచ్చిన సందర్భం చాలా అపురూపమైనది. ఒక ఆశయం కోసం ప్రజల ఆలోచనలను మార్చడానికి చేసిన సమిష్టి కృషి ఫలితమే మా భూమి. నిజంగా కూడా అంతా సంబరాలు జరుపుకోవాల్సిన సందర్భం ఇది. సినిమా నిర్మాణం నాటి జ్ఞాపకాలన్నీ ఇంకా తాజాగానే ఉన్నాయి. షూటింగ్ జరిపిన ప్రతిరోజూ ఒక గొప్ప అనుభవం మరువరాని అనుభూతులతో నిండి పోయేది."

"నేను చాలా కాలం నాటకరంగంలో పని చేసిన తర్వాత 1977లో కొత్తగా ఏమైనా చేయాలనుకున్నప్పుడు సినిమా ఆలోచన వచ్చింది. అయినా తెలుగులో మనకు ఎవరు అవకాశమిస్తారు అనుకుంటున్నప్పుడు నా మిత్రుడు జి.రవీంద్రనాథ్ ఫీల్డ్‌లోకి తెచ్చాడు. అతనప్పటికే మృణాల్ సేన్ 'మృగయా', 'ఒకవూరి కథ' చిత్రాల నిర్మాణంలో పని చేశాడు. వీటి తరువాత ఇద్దరం వెళ్లి మృణాల్‌ని అడిగాం. మాకు ఒక సినిమా తీసి పెట్టమని. కానీ మా బడ్జెట్ ఒక లక్షలో తనకు సాధ్యం కాదని, కలకత్తాకే చెందిన గౌతంఘోష్‌తో డైరెక్ట్ చేయించుకోండి అన్నారు. కలకత్తాలో బెంగాల్ జర్నలిస్ట్ అసోసియేషన్ అవార్డుల సభలో మొదటి సారి గౌతంను కలుసుకున్నాం. విచిత్రమేమిటంటే ఆ సభలో సత్యజిత్‌రే పక్కనే నా సీటు. అనిర్వచనీయ అనుభూతి. ముగ్గురం కిషన్ చందర్ నవల 'జబ్ ఖేత్ జాగే' కథతోనే సినిమా చేయాలనుకున్నాం. తరువాత నవల బేస్‌గా గౌతం ట్రీట్‌మెంట్ రాసుకుని హైదరాబాద్‌కు వచ్చేశాడు. అది సరిగ్గా నచ్చక మొత్తం తెలంగాణలోని కడవెండి, బాలముల, సూర్యాపేట్, వరంగల్ వంటి ప్రాంతాలను సందర్శించి తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న వారితో ఇంటర్వ్యూలు, ఫొటోలు, రావినారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, సుందరయ్య, బసవపున్నయ్య, రాసుకున్నవి, ఇతర 20, 30 పుస్తకాలు, క్రానికల్, గోలకొండ, మీజాన్ ప్రెస్ రిపోర్టులు అట్లా అదో పెద్ద రీసెర్చ్ వర్క్ చేశాం. అప్పుడు మళ్ళీ రాసుకున్న స్క్రిప్టుతో సినిమా సెట్స్ మీదికెళ్లాం. నటీనటులు, టెక్నీషియన్లు అంతా కొత్త వాళ్లమే. మొదటిరోజు అందరం లారీలో వెనుక తాటిపత్రి మీద కూర్చుని షూటింగ్‌కు వెళ్లాం. అప్పటికే సిండికేట్ బ్యాంక్ అల్వాల్ బ్రాంచ్‌లో మా ఇల్లును కుదువపెట్టి లక్ష రూపాయల లోన్ తీసుకున్నాను."

మెదక్‌జిల్లా మంగళపర్తిలో షూటింగ్ ప్రారంభించాం. మామూలు జనంలోనే కొందరిని ఎంపిక చేసుకుని ట్రెయిన్ చేసుకునేవాళ్లం. రోజూ షూటింగ్‌లో దెబ్బలు తాకేవి. రోజుకు ఒక అయోడిన్ బాటిల్ ఐపోయేది. కొత్త చీరలు, రుమాల్లు, పంచెలు వాళ్లకిచ్చి పాతవి తీసుకుని షూటింగ్స్‌లో వాడేవాళ్లం. నర్సాపూర్ తాలూకా దొంతి గడిలో దాడి చేసే దృశ్యం తీయడం అదో గొప్ప అనుభవం. కొంత హైదరాబాదు, లంబాడి తండాల్లో షూట్ చేశాం. సినిమా విడుదలై జైత్రయాత్ర చేసింది. అభినందనల్లో తడిసి ముద్దై పోయాము. వెళ్లిన చోటల్లా సభలు, సమావేశాలు, అభినందనలు. మహబూబ్‌నగర్‌లోనైతే మాకు పోలీస్ సెల్యూట్ ఇచ్చారు. నల్గొండ, నిజామాబాద్, విజయవాడ అన్ని చోట్లా ఇదే సీను. 'మా భూమి' ప్రజల సినిమా గనుకనే ప్రజలే ఆదరించారు. ఒకసారి సారస్వత పరిషత్తులో ఏదో సభ. ఒకాయన చాలాసేపు



నా చుట్టూ తిరుగుతున్నాడు. నేనే అడిగాను. 'ఏమిటి విషయం' అని. "ఏమీ లేదు నేను మీ 'మాభూమి' 22 సార్లు చూశాను" అన్నాడు. ఇంకొకాయన "40 సార్లు చూశా"నని చెప్పాడు. అప్పట్లో అదొక క్రేజ్. ఇప్పటికీ "మాభూమి నర్సింగరావు" అనే గుర్తింపు గర్వంగా అనిపిస్తుంది. సినిమాకు పేరేం పెట్టాలని అనుకున్నప్పుడు జైత్రయాత్ర, ఇంకా ఏదో అన్నారు. అదంతా నాటకీయంగా ఉంటుందని, భూమి కోసమే పోరాటం జరిగింది కదా "మాభూమి" అంటే పోతుంది అని పేరు పెట్టాము. ఆ పేరు చాలా పాపులర్ అయింది. పొలిటికల్ ఓరియెంటెడ్ హిస్టారికల్ చిత్రంగా 'మాభూమి'లో సెమీ డ్రామా, సెమీ డాక్యుమెంటేషన్, (మాంటేజెస్, ఫిక్షనల్ ఎలిమెంట్స్) స్పష్టంగా కనిపిస్తాయి. అవన్నీ జీవితానికి దగ్గరగా ఉంటాయి. చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటం ఒకసారే జరిగింది. అలాగే 'మాభూమి' సినిమా నిర్మాణం కూడా.





## సామాన్యుని తెరపై చూపిన సినిమా : రవీంద్రనాథ్

మాభూమి తరువాత నేను సినిమాలకు దూరమైనాను. అయితే మాభూమితో మాత్రం నా అనుబంధం తొలినాటి ఉత్సాహపుదశను దాటనేలేదు. అంతా రెండున్నర సంవత్సరాల సమిష్టికృషి. 1978 మార్చి నాటికి స్క్రిప్టువర్క్ పూర్తయింది. దర్శకునిగా గౌతంఘోష్‌ను పనిచేయమని అడిగితే ఆయన నవ్వుతూ మీకేమైనా పిచ్చిపట్టిందా నాకు రానిభాషలో సినిమా ఎలా చేస్తానని నవ్వేరు. అతని హంగ్రీ ఆటం డాక్యుమెంటరీ చూసిన తరవాత అతనైతేనే చేయగలడని మా నమ్మకం.

మొదటనే తెలంగాణ కథాంశాన్ని తీయాలనుకున్నాం. మాభూమి, ఇతర తెలంగాణ రచనలు చాలా చదివాం. కానీ కిషన్ చందర్ 'జబ్ ఖేత్‌జాగే' నవలనే ఆధారంగా స్క్రిప్టు తయారు చేసుకున్నాం. నాకు నవయుగ పంపిణీరంగం, సారథీ స్టూడియోస్ నేపథ్యం ఉన్న వామపంథా భావాలుండటం వల్ల మృణాల్‌తో పనిచేశాక (మృగయా, ఒకవూరికథ) జాతీయస్థాయి సినిమాలు పరిచయమై 'మాభూమి' తీసేదాక సాగింది నా ప్రయాణం.



సినిమాలో ప్రతిఒక్కరూ అనుభూతి చెంది పనిచేశారు. నర్సింగ్‌రావు, సాయిచంద్, వైకుంఠం, భూపాల్ ఎవరికీ సినిమా అనుభవంలేనివారే. చివరికి ఎడిటర్‌కి కూడా తొలి అనుభవమే. వీరిలో కొందరికి రంగస్థల అనుభవం ఉంది. కాకరాల ఒక్కరే సినిమా అనుభవం ఉన్న నటుడు.

అయితే స్టోరీ రాసి దాన్ని సినిమాటిక్ చేయడం అంత సులభం కాదు. గౌతం ఘోష్ – నర్సింగ్‌రావు అద్భుతమైన స్క్రీన్ ప్లే రాశారు. ఆ ఘనత మొత్తం వారిద్దరిదే. అందుకే మాభూమిలో ప్రేక్షకులు తమనుతాము చూసుకున్నారు. సినిమా అభిమానులు తమలో ఎన్.టి.ఆర్., ఎ.ఎన్నార్‌లను చూసుకునే కాలంలో సామాన్యులు కూడా తెరపై తమను తాము చూసుకున్నారు. కారెక్టర్స్ కాన్సెప్ట్‌లో మమేకమై చేసిన సినిమా ఇది. తెలుగులో రియలిజంతో చేసిన ఏకైక సినిమా ఇది.

గర్వంగా ఒకటిమాత్రం చెప్పగలను. అందరూ ఆందోళనపడినా, నేను మాత్రం చిత్రం రషెస్ చూస్తున్నప్పుడే సినిమా ఖచ్చితంగా హిట్ అవుతుందని యూనిట్‌తో ముందుగానే చెప్పాను. ఎందుకంటే తెలంగాణ పోరాట చిత్రంగా మాభూమిని ఒక ప్రేరణగా తీసుకుని యూనిట్ పనిచేసింది. అది రషెస్‌లో ప్రతిఫలించింది.

నలభైయేళ్లు గడచినా మాభూమి సినిమాకు గ్లామర్ తగ్గలేదు. అలాంటి పాత్రలు, కథలు నేటికీ సమాజంలో ఉన్నవి. ఇప్పటికీ నేను మాభూమి మానియాలోనే ఉన్నాను. ఎందుకంటే అప్పటి మా యువ తరానికి ఒక శక్తిని, చైతన్యాన్ని నింపిన సినిమా మాభూమి.

గాంధీనగర్‌లోని పైపుల ఫ్యాక్టరీ, వనస్థలిపురంలోని నయాఖిల్లా, పాతబస్తీలోని జహనుమా, ఖజానా తదితర ప్రాంతాలతోబాటు యాప్రాల్, అల్లీపూర్, దొంతి, నర్సాపూర్ ఫారెస్టు, మంగళపర్తి, మెదక్ లో జరిగింది.

పాత్రధారుల కాస్ట్యూమ్స్ చార్మినార్ ఏరియాలో కొనుగోలు చేశారు. వీటితోబాటు పోలీసుల టోపీలు, డ్రెస్‌లు, బూట్లు, బాడ్జెస్‌లన్నింటినీ కాలానుగుణంగా ప్రత్యేకంగా సంపాయించారు. ఈ ప్రయత్నాల, ప్రయాసల వెనుక దర్శక నిర్మాతల కృషి చిత్తశుద్ధి కనిపిస్తుంది.

సినిమా షూటింగ్ మొదలైంది. మెదక్ జిల్లాలోని మంగళపర్తి, దొంతి, దౌల్తాబాదు గ్రామాలతో బాటు మెదక్‌లో సుమారు 50 రోజుల పాటు మాభూమి చిత్రీకరణ జరుపుకున్నది. ప్రధానపాత్రధారులు విడిగా కనిపించకుండా జనంలో ఒకరుగా కనిపించడం చిత్రీకరణలో ప్రత్యేకత. గ్రామస్తులుగా నటించినా వారిలో చాలా మటుకు నిజమైన ఊరి జనమే నటించారు. కేవలం 5.5లక్షల చిన్న బడ్జెట్‌లో భారీ కాన్సెప్ట్‌తో సినిమా మాభూమి. దొరల మీద దాడి లాంటి సీన్లలో నటించడం కాదు అంతా జీవించారు. 'దొంతి'లో గడిని ముట్టడించే సీన్ తీసే నాటికి వాళ్లేమనుకున్నారో గాని ఆ సీన్ తీయడానికి ఒప్పుకోలేదు. అనుమతి లేకుండానే జనం ఆగ్రహంతో ఉరికి వస్తుంటే సెట్ చేసుకున్న కెమెరాలతో జనం గడి తలుపులు తోసుకొని ముందుకెళ్ళే షాట్‌ను చిత్రీకరించారు.

దర్శకుడు గౌతం ఘోష్ మాభూమి షూటింగ్ అనుభవాన్ని చెప్పుకుంటూ "ఈ




## ఇప్పటికీ 'మా భూమి' స్పిరిట్‌తోనే: - దర్శకుడు గౌతమ్ ఘోష్

దర్శకుడు గౌతమ్‌ఘోష్‌కి 'మాభూమి' మొదటి ఫీచర్ ఫిలిం. ఆయన తెలంగాణ గురించి పూర్తిగా అధ్యయనం చేశాకే ఈ సినిమా చేశాడు. హరీన్ చటోపాధ్యాయ, సుందరయ్యవంటివారు తెలంగాణపై రాసిన పుస్తకాలు, కవితలు, సాహిత్యం చదివాడు. మాభూమి అనుభవాన్ని ఆయనే ఒక ఇంటర్వ్యూలో ఇలా చెప్పుకున్నారు.



ఈ సినిమాను మొదట హిందీలో తీయాలనే ఆలోచన వచ్చింది. అయితే ఇది తెలంగాణకు చెందిన కథ. హిందీలో తీస్తే అప్పటి ఆంధ్ర ప్రజలు చూడలేరు. కనుక తెలుగులోనే తీశాం. నాకు తెలుగు రాదు. వారికి బెంగాలీ రాదు. నాకు తెలిసిన హిందీ కూడా అంతంత మాత్రమే. నర్సింగ్ - ప్రాణ్‌రావులు నాకు అన్నీ వివరించేవారు. ఈ సినిమాలో చేసిన చాలా మంది ఆర్టిస్టులకు ఉర్దూ రావడం నాకు ప్లస్ పాయింట్ అయ్యింది. ఏదైనా ఉర్దూలో చెప్పేవాడిని. తెలంగాణ పల్లె జీవితం ఎలా ఉంటుందో పరిశీలించడానికి పొద్దున్నే లేచి వాళ్ల ఇళ్ల ముందు కాపలా కాసేవాళ్లం. కట్టూ, బొట్టు తీరు నుంచి ఆహార్యం, మాట్లాడే విధానం వరకు అంతా గమనించి ఒక అవగాహనకు వచ్చాక దాని ప్రకారం స్క్రిప్ట్ తయారు చేసుకున్నాం. అంతా యువ రక్తం మా భూమి నాకు విలువైన పాఠాలు నేర్పింది. అవి ఇప్పటికీ ఉపయోగపడుతూనే ఉన్నవి. ఆ మధ్య నేనొక సినిమాను మావోయిస్టు ప్రాబల్యం ఉన్న ప్రాంతంలో షూట్ చేశాను. యూనిట్ అంతా ఆందోళన పడ్డారు. కానీ మా భూమి స్పిరిట్ అన్న మనోబలంతో ఆ సినిమా షూటింగ్ పూర్తి చేశాం.

"మొత్తానికి మా భూమి సినిమా రిలీజ్ అయింది. ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లోని సుదర్శన్ థియేటర్‌లో అనుకుంటా.... మొదటి షో స్టార్ట్ అయింది. నర్సింగ్, రవి, ఇంకా టీమ్ అందరూ థియేటర్‌లో సినిమా చూస్తున్నారు. నాకేమో పిచ్చి టెన్షన్. ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, చిక్కడపల్లి జంక్షన్‌లో ఉన్న ఇరానీ హోటల్లో ఓ మూల టేబుల్ దగ్గర టీ సిప్ చేస్తూ సిగరెట్ కాలుస్తూ కూర్చున్నా. అందరూ వెదుకుతున్నారు నాకోసం. 'గౌతం ఏడీ' అంటూ. వాళ్ళకు ఎవరో చెప్పారు 'గౌతం క్రాస్ రోడ్స్ హోటల్‌లో ఉన్నాడని. అంతే మోహన్ కోడా పరుగు పరుగున నా దగ్గరకు వచ్చి 'అక్కడ థియేటర్‌లో ఈలలు, చప్పట్లతో మారుమోగుతుంటే నువ్వేమో ఇక్కడ కూర్చున్నావా?' అని చేయి పట్టుకుని లాక్కుపోయాడు. ఆ మాటలు విన్న తరువాతనే నేను ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నాను. తర్వాత షోలో ఆడియన్స్ సంబరాన్ని కళ్ళారా చూసి ఆస్వాదించాను. తెలంగాణ యాసలో డైలాగులు వస్తుంటే ఒకటే చప్పట్లు.

'మాభూమి విజయం తెలంగాణ ప్రతి పోరుడి విజయంగా భావిస్తాను. ఈ సినిమాకు వచ్చిన ఆదరణ ఇప్పటికీ నాలో ఒక ఉత్తేజాన్ని నింపుతుంది. అప్పుడు మీడియా పాత్ర చాలా పరిమితమే అయినా నా సినిమాకు మీడియా ఎంతో సపోర్ట్ చేసింది అందుకే మాభూమి వచ్చి నలభైఏండ్లు దాటినా నాకు నిన్ననో మొన్ననో జరిగినట్లే అనిపిస్తుంది. నా భార్య కూడా ఇలాగే ఫీలవుతుంది. ఈ సినిమా మా ఇద్దరికీ మంచి అనుభూతులను పంచింది. ఆ విషయాలను గుర్తు చేసుకుంటూ ఇప్పటికీ రీఛార్జ్ అవుతుంటాను.'

సినిమాలో నటించిన వారంత అమెచ్యూర్ ఆర్టిస్టులే. మోహన్ కోడా, సాయిచంద్ సహా. వీళ్లకు ఒక వారం రోజులపాటు ట్రైనింగ్ ఇచ్చాం. మా భూమిలో గ్రామస్తులుగా నటించిన వారిలో చాలా మంది నిజమైన గ్రామస్తులే. అదీగాకుండా సాయుధ పోరాటంలో పాల్గొన్నవాళ్లు కొందరు ఇందులో నటించారు. నిజంగా ఇది నా అదృష్టం. ఒకరకంగా ఈ సినిమా నాకు సాహసం వంటిది. చిన్న బడ్జెట్. భారీ కాన్సెప్ట్. పైగా ఇది నా తొలి సినిమా. డైరెక్టర్‌గా నన్ను నేను నిరూపించుకునే అవకాశం ఇచ్చిన సినిమా. క్లైమాక్స్‌లో దొరల మీద దాడి లాంటి





సీనులో నటించడంకాదు అంతా జీవించారు. గడీని ముట్టడించే సీన్ ఒకటుంది. అప్పటి వరకూ గడీలో షూటింగ్‌కు పర్మీషన్ ఇచ్చిన వాళ్లు ఎందుకో గాని తర్వాత షూటింగ్ చేయవద్దన్నారు. గేట్ మూసేశారు. ఏం చేయాలో అర్థం కాలేదు. జనాలు అంతాగేట్లు పగలగొట్టేంత ఆవేశంలో ఉన్నారు. అప్పుడు నేను "భూపాల్ నిజంగానే అటాక్ చేద్దామా?" అన్నాను. నువ్వు ఒకే అంటే చేద్దాం అన్నాడు. తెల్లవారే పద్బందీగా ప్లాన్ వేశాం. ఊళ్లో ప్రజలంతా ఆగ్రహంతో ఉరికి వస్తుటే కెమెరాలను సెట్ చేసుకున్నాను. ఇంకేముంది జనం తలుపులు బద్దలు కొట్టారు. షాట్ డబుల్ ఒకే అయింది."

చిత్రీకరణలో చారిత్రక సంఘటనలు చూపించేటప్పుడు అప్పటి వార్తా పత్రికలు లైబ్రరీ షాట్స్‌ని వాడటంలో సినిమా స్థాయి మరింత పెరిగింది.

సినిమా అంతా మూడు షెడ్యూల్స్‌లో పూర్తయింది. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ గౌతాఘోష్‌నే చేశాడు. పాటలన్నీ హైదరాబాదులోని జర్మన్ లైబ్రరీలో రికార్డు చేశారు. సినిమా పూర్తయి సెన్సార్‌కి వెళ్లింది. ఏమవుతుందోననే భయం. కానీ సెన్సార్ సభ్యులు నిర్మాతలను లోపలకు పిలిచి అభినందించి సర్టిఫికెట్ ఇచ్చారు. విడుదల చేయడానికి డిస్ట్రిబ్యూటర్స్ ఎవరూ ముందుకు రాలేదు. చూసిన వారంతా ఇదేదో రాజకీయ పాఠాలు చెప్పినట్లుగా ఉందని వెనక్కివెళ్లి పోయారు. చివరికి లక్ష్మీ ఫిలింస్, శ్రీతారకరామా ఫిలింస్ వారు రిలీజ్ చేశారు. ఆ రోజు 1980 మార్చి 23. విడుదలైన చోటల్లా హౌస్‌ఫుల్. టికెట్స్ దొరక్క థియేటర్ల వద్ద జనం



## ఎప్పటికీ "మాభూమి" డ్రీమ్‌లోనే...: యాదగిరి

"అంకుర్" సినిమా చూసిం తరువాత నేను శ్యాంబెనెగల్ కోసం వెదుకుతున్న టైమది. ఐతే సూర్యప్రకాశ్, సూర్యకుమారి (మాభూమిలో నటించారు)ల ద్వారా నాకు మా భూమి యూనిట్‌తో, పరిచయం ఏర్పడింది. చిక్కడ్‌పల్లిలోని ఆఫీసులో వారిని కలుసుకున్నాము. రాములు పాత్రకు నన్ను ఎంపిక చేశారు. నా భాష చూసి ఇది తెలంగాణ సినిమా అదే యాసలో మాట్లాడాలన్నారు. అప్పటి వరకు నాకు తెలియదు. తెలంగాణ భాషలో సినిమా తీస్తారని. యూనిట్ అంతా ఒకే లారీలో రవీంద్రనాథ్, నర్సింగ్‌రావు, గౌతంఘోష్, మోహన్ కోడా అందరం మంగళపర్తికి వెళ్లి షూటింగ్ చేశాం.



నాకో ధోతీ, అంగీ ఇచ్చి దీంతోనే ఉండాలి అన్నారు. ఎందుకంటే అవి బాగా మాసిపోవాలి గనుక. నా తొలి సీన్ కొత్త దంపతులుగా నేను భార్యతో వస్తాను. సాయిచంద్ -హంసలకు ఎదురు పడతాను. దొర వద్ద పనిచేసే వాడు కొత్త పెళ్లి కూతురును చూసి "ఏరా రాములు నీపెండ్లాం జోర్‌దార్‌గా ఉంది" అంటాడు. నేను సిగ్గు పడుతూ అమాయకంగా కిసుక్కన నవ్వుతాను. ఆ రాత్రికే ఆ అమ్మాయిని ఎత్తుకెళ్తారు. ఇవి సీన్లు.

ఆ తరువాత ప్రతీకారెచ్చతో ఉన్న రాములు సంఘంలో చేరి పోరాటంలోకి వెళ్తాడు. భూపాల్‌రెడ్డి, ఉప్పల నరసింహం, నేను రజాకార్లకు ఎదురుపడే సమయంలో ఎండ్లబండి వద్ద జరిగే మూవ్‌మెంట్‌లో బాంబ్‌బ్లాస్ట్ అవుతుంది. నేను ఒక్క ఫీటు దూరంలోనే బాంబు పేలింది. నేను పడిపోవాలి. అదే జరిగింది. కానీ బాంబ్‌బ్లాస్ట్ అయిన పద్ధతిలో నేను నిజంగా చనిపోయాననుకుని గౌతం ఘోష్ పరుగెత్తుకుంటూ వచ్చాడు. ఏమీ జరగలేదు.

ఇంతలో నా ఆరోగ్యం పాడై ఆస్పత్రిలో చేరాను. డాక్టర్లు ఆపరేషన్ ఏదోదే అన్నారు. అదే జరిగితే సినిమాలో నా రోల్ తీసేస్తారేమోనని నేనేమీ చేయొద్దు మందులతో తగ్గించమని డాక్టర్లను కోరాను. వెంటనే కోలుకుని మళ్లీ షూటింగ్‌లో పాల్గొన్నాను. నేను, కాకరాల, ప్రదీప్ శక్తి, రూపశిల్పి కుమార్ అంతా ఒకే రూంలో ఉండేవాళ్లము. నేను తొలి తెలంగాణ చారిత్రక చిత్రం మాభూమిలో నటించినందుకు గర్వంగా భావిస్తాను. తొలిసారిగా సామాన్యులు సినిమా నటులు కావడం మా భూమితోనే మొదలు. నలభై ఏళ్ళైనా నేను ఇప్పటికీ 'మా భూమి' డ్రీమ్‌లోనే ఉన్నా. ఎప్పటికీ ఉంటాను.





గుంపులు గుంపులుగా వెనక్కి వెళ్ళిపోయారు. థియేటర్లు ఈలలు డ్యాన్సులతో మారు మ్రోగినవి. అదో గొప్ప చరిత్రాత్మక విజయం. ప్రజలు ఇండియన్ ఆర్మీ దళాలపై పోరాటం చేసిన చారిత్రక వాస్తవాన్ని దృశ్యమానం చేసిన తొలిచిత్రం మాభూమి నే. ఇందులోని పాత్రలన్నీ సహజమైన గ్రామీణ భాషను, ముస్లిం పాత్రలు హైదరాబాదీ ఉర్దూలో మాట్లాడుతై. ఈ సినిమా రాకతో తెలుగు సినిమాకు మంచి రోజులు రానున్నాయని పత్రికలు రాశాయి.

### వెండితెరపై ప్రజల పోరాట చరిత్ర

'మా భూమి' చిత్ర కథాకాలం 1936-51. తెలంగాణలోని సిరిపురం గ్రామానికి జగన్నాథరెడ్డి ఒక పెద్ద జమీందారు. భూస్వామ్య వ్యవస్థకు ప్రతినిధి. ప్రజలను దోపిడీ చేసే విలాస జీవితం గడుపుతుంటాడు. పేదలకు, రైతులను అణగద్రొక్కుతుంటాడు. కానీ పెత్తందార్ల దోపిడీ, దౌర్జన్యాలు ఎంతకాలం సాగుతాయి. ఏదో సందర్భంతో ప్రజల్లో చైతన్యం మొదలవుతుంది. అది రామయ్య అనే రైతు రూపంతో మొదలవుతుంది. పేద రైతు వీరయ్య కొడుకే రామయ్య. వీరయ్య కొడుకుగా రామయ్య కూడా చిన్ననాటనే జీతగాడవుతాడు. పెరిగి పెద్దవాడైన రామయ్య చంద్రిని ప్రేమిస్తాడు. కానీ ఆమె జమీందారు కామవాంఛకు బలవుతుంది. అది తెలిసిన రామయ్య చంద్రిని తిరస్కరించి ఊరు వదలివెళ్లిపోతాడు. సూర్యాపేట, హైదరాబాదులకు పోయి అక్కడ యూనియన్ నాయకులతో ఎన్నో విషయాలు తెలుసుకుని మానసికంగా పరిణతి సాధిస్తాడు. తాను పని చేస్తున్న ఫ్యాక్టరీలో జరిగిన సమ్మెలో పాల్గొని అరెస్టవుతాడు. జైల్లో మిత్రుడు నాగయ్య (బి.నర్సింగరావు)ను కలుస్తాడు. సిరిపురంలో జమీందారుకు విరుద్ధంగా జరుగుతున్న పోరాటాల గురించి వివరిస్తాడు. ప్రజలకు భూమి మీద హక్కు ఉండాలనే సిద్ధాంతాన్ని నమ్మి తిరిగి గ్రామానికి వెళ్లి పోరాటానికి నాయకత్వం వహిస్తాడు. గెరిల్లా దళాలు ఏర్పడతాయి. భూస్వాముల పునాదులు కదిలిపోతాయి. అంతా పట్టణాలకు వలసపోతారు. 1948లో నిజాం లొంగిపోయి నిరంకుశపాలన అంతమైనా భూమిపై హక్కులను ప్రజలు పొందలేకపోయారు. పోరాటం కొనసాగుతుంది. చివరకు రామయ్య పోలీసు కాల్పుల్లో మరణిస్తాడు. సినిమాలో అంతా కొత్త వారే అయినా పరిణతి చెందిన నటన చూపిస్తారు.

చిత్ర నిర్మాతల్లో ఒకరైన రవీంద్రనాథ్ ఏమంటారంటే "మాభూమి' ప్రజల సినిమా. జీవితంలో నేనేమైనా మంచిపని చేశానంటే అది 'మాభూమి' సినిమా తీయడం . 'మాభూమి' తీసిన ఆ రెండేళ్ళు ఒక యజ్ఞంలా

## ఒకటారెండా ఎన్నెన్నో జ్ఞాపకాలు! : భూపాల్ రెడ్డి

మాభూమి వచ్చి నలభై ఏండ్లయిందంటే నమ్మలేకపోతున్న. అంతా నిన్న మొన్ననే అన్నట్లుంది. రవి, బి.ఎన్. (బి.నర్సింగ్‌రావు) తరువాత మా భూమి కష్ట సుఖాలో నేనే ఎక్కువ భాగం పంచుకున్ననేమో అనిపిస్తుంది. గొప్ప సినిమా తయారైంది. కమర్షియల్ సినిమా కన్నా పెద్ద విజయం పొందింది 'మా భూమి'. వంద గొప్ప తెలుగు సినిమాలలో మా భూమి స్థానం ఒకటోదో రెండోదో ఉంటది.



ఈ సినిమాలో అన్నీ పాత్రలే కనిపిస్తవి. నటించిన వారు కనిపించరు. సామాన్యుడు గొల్ల కొమరయ్యను చూసి అతను నటుడనుకున్నారు. అంత సహజంగా నటించాడు. సామాన్య గ్రామస్తులు కూడా అంతగా కలిసిపోయి నటించారు. సినిమాలో ఒక పీనుగు దగ్గర ఏడ్వాలి. ఎవరూ ఏడ్వాడానికి ముందుకు రాలేదు. మూడు నాలుగు ఊర్లు తిరిగి ఏడ్పుల పోచమ్మను పట్టుకు వచ్చి యాక్ట్ చేయించినం. వెంట్రుకలు వీరపోసుకుని, తలకాయ కొట్టుకుంటూ అద్భుతంగా నటించింది ఆమె.

ఒకరా ఇద్దరా చాలా మంది పాత్ర ఉంది. ప్రదీప్‌శక్తి. లక్ష్మణ్‌రావు (పట్వారి), ప్రసాదరావు, సూర్యకుమారి, సూర్యం, గొల్ల కొమరయ్య కిషన్ అందరూపోయారు. ఆ వూర్లో తొలి తిరుగుబాటు దారుడు పాపిరెడ్డి పాత్ర నాది. నటుడిగానే కాదు నేను ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌ని కూడా. ఒకటా రెండా ఎన్నెన్నో జ్ఞాపకాలు.

# నేను బ్లాక్ అండ్ వైట్ చివరి హీరోనేమో! సాయిచంద్

సాయంత్రం తిరిగి వచ్చేటప్పటికి యింటి తాళానికి ఒక చీటి పెట్టివుంది. ఏమిటా అని చూస్తే 'ఒకసారి వెంటనే పంజాగుట్ట ఆఫీసుకు రా...!' అని మోహన్‌కోడా సంతకం వుంది. పంజాగుట్ట ఆఫీసు అడ్రస్ వ్రాసి వుంది. నన్ను ఎందుకు పంజాగుట్ట ఆఫీసుకు రమ్మంటున్నారో అర్థం కాలేదు.

ఏమైవుంటుందా అన్న ఆలోచన తప్ప. వెతుక్కుంటూ ఆఫీసుకు వెళ్ళాను. ఆఫీసు పైభాగంలో వుంది. మెట్లపైకెక్కి వెళ్ళగానే మోహన్‌కోడా ఎదురయి 'నీకోసమే ఎదురుచూస్తున్నాం... రా..!' అని ఒక హాల్ అంత పెద్ద గదిలోకి తీసుకెళ్ళాడు.

నర్సింగరావు వచ్చి నన్ను లోపలికి రమ్మన్నాడు. లోపలికి వెళ్ళాను. అదో చిన్నగది. టేబుల్, కుర్చీవేసి వుంది. గౌతంఘోష్ నిలబడి వున్నాడు. నాతో 'ఒకసారి చొక్కా విప్పు' అని ఇంగ్లీషులో అడిగాడు. నాకు అర్థం కాక నర్సింగరావు వైపు చూసాను. 'తరువాత చెబుతాను కానీ, ఒకసారి చొక్కావిప్పు' అని అన్నాడు. నేను నెమ్మదిగా గుండీలు తీసి చొక్కా విప్పాను.



గౌతంఘోష్ కాసేపు నన్నుచూసి, నర్సింగరావుకి సైగచేసి అవతలి గదిలోకి వెళ్ళాడు. నర్సింగరావు యిప్పుడేవస్తా కూర్చోమని చెప్పి, లోపలికి వెళ్ళాడు. కాసేపటికి యిద్దరూ వచ్చారు. కుర్చీలో కూర్చున్న నేను నిలబ్డాను. 'నువ్వే మా హీరోవి' అన్నాడు దర్శకుడు గౌతంఘోష్ అభినందిస్తూ. ఒక్కసారి క్రింద భూమి కదిలిపోతున్నట్లుగా, నేను క్రింద లోయలో పడిపోతున్నట్లుగా... అస్సలేమీ అర్థం కాలేదు. నర్సింగరావు సినిమా గురించి, హీరో పాత్ర గురించి, హీరో మార్పిడి గురించి చెప్పాడు. నేను నెమ్మదిగా తేరుకుని 'నేను... నేను అంత గొప్ప పాత్ర చేయగలనా!' అన్నాను. నా భుజం మీద చెయ్యివేసి 'నువ్వు చేస్తానని గట్టిగా నమ్ము. మేం చేయించుకుంటాం' అన్నాడు నర్సింగరావు.




రాత్రంతా తెలంగాణ రైతాంగ పోరాటం గురించి ఆలోచనలే. నాన్నగారు రజాకార్ల నేపథ్యంలో రాసిన 'గతించిన గతం' నాకు చాలా యిష్టమైన నవలిక. అప్పటికే వట్టికోట ఆళ్వారుస్వామిగారి నవల 'ప్రజల మనిషి', పుచ్చలపల్లి సుందరయ్యగారి 'వీరతెలంగాణా' చదివివుండడం వల్ల నాటి తెలంగాణ రైతాంగ పోరాటం గురించి నాకు అవగాహన వుంది.

షూటింగ్‌లో వైకుంఠం చెప్పాడు. "నువ్వు దేనికీ భయపడాల్సిన పనిలేదు. భూపాల్ నీకు అన్ని విధాల సహాయంగా వుంటాడు" అని. నిజంగానే భూపాల్ నాకు పెద్ద అండ అయ్యాడు... అప్పుడే కాదు యిప్పటికి కూడా!

మరుసటి రోజు గౌతంఘోష్ నన్ను పిలిచి 'మూడు రోజులు నీ మీద షూటింగ్ వుండదు. ఈ మూడు రోజులు గ్రామం అంతా తిరిగి, గ్రామీణ ప్రజలని అబ్జర్వ్ చేయి. నీ పాత్రకు బీడీ తాగడం కావాలి. కాబట్టి బీడీ తాగడం నేర్చుకో. అలవాటు మాత్రం చేసుకోవద్దు' అని చెప్పాడు. ఆయన చెప్పినట్లే ఆ మూడు రోజులు ఆ వూరంతా తిరుగుతూ, అందరితో పరిచయం చేసుకుంటూ, బీడీ తాగడం నేర్చుకున్నాను.

ఆ ఊరి ప్రజలు చాలా మంది ఈ సినిమాలో ముఖ్య పాత్రలు వేసారు. అసలు సినిమా అంటే ఏమిటో తెలీనివారు కూడా వున్నారు. వాళ్ళతో గౌతంఘోష్ నటింపజేసే తీరు చూసి తీరవలసిందే. గౌతంఘోష్‌కి నాటకరంగ అనుభవం ఎక్కువ వుండడం వల్ల ఎవరితోనైనా సునాయాసంగా నటింపజేయించుకునే వాడు. సీనియర్ నటుడైనా, మరీ కొత్త నటుడైన ఆయనకు బేధం లేదు. తనకు కావలసిన విధంగా నటన రాబట్టుకునే వాడు.

దర్శ నిర్మాతలు హైద్రాబాద్‌కి రాగానే అంతకు ముందు జరిగిన షూటింగ్ రషెస్ చూసుకుని తాము అనుకున్న దానికన్నా బాగా వచ్చినందుకు ఎంతో ఆనందించారు. 'బండెనక బండిగట్టి' పాట నర్సింగరావు చేసిన నాగయ్య పాత్ర మీద చిత్రీకరించారు. నర్సింగరావు వాలంటరీగా రషెస్ చూసాక ఆ పాట తనకన్నా గద్దర్ చేస్తే బాగుంటుందని సూచించాడు. ఆ తరువాత గద్దర్‌ని పెట్టి రీషూట్ చేశారు. ఆ పాట గద్దర్‌కి ఎంతో పేరు తెచ్చింది. నాటి రైతాంగ పోరాటంలో ప్రజాకవి యాదగిరి వ్రాసిన ఆ పాట గద్దర్ వ్రాసాడనుకున్నారు.

మార్చి 23, 1980 'మాభూమి' విడుదల తేదీ నిర్ణయించబడింది. మార్చ్ 23కి ఒక ప్రత్యేకత వుంది. భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను ఉరితీసిన రోజు (1931). ఆ ముగ్గురికి మాభూమి గొప్ప నివాళి అవుతుందని దర్శక నిర్మాతలు నిర్ణయించారనుకుంటా. విడుదల తేదీ దగ్గరవుతున్న కొద్దీ ఉత్సాహం, ఉత్కంఠ.

మా భూమి ఒక చరిత్ర. ఆ చరిత్రలో నేను భాగం అయినందుకు నాకు మరీ పెద్ద పండుగ. ఒక విధంగా తెలుగు సినిమాలో మా భూమి చిట్టచివరి బ్లాక్ & వైట్ చిత్రం అనుకుంటా... అంటే తెలుగు సినిమాలో నేను చివరి బ్లాక్ & వైట్ సినిమా హీరోనేమో?

*(కేరాఫ్... త్రిపురనేని సాయిచంద్ పుస్తకం నుండి)*

భావించాము. రెండో పనిలేదు. ఎందరో ఈ మహాయజ్ఞంలో తోడ్పడ్డారు. ముఖ్యంగా నా భార్య. సినిమా విడుదలైన మూడోరోజు ఆదివారం. మాకు యజ్ఞఫలం దక్కింది. సుదర్శన్ టాకీస్‌లో టిక్కెట్ల కోసం పెద్ద దాడే జరిగింది. అది చూసి ఇంతమంది జనం మా సినిమా కోసం వచ్చారా అన్న ఆనందం ఒకవైపు. అలాగే ఆరోజు పొందిన ఆనందం జీవితంలో మరువలేను. సినిమా అంతగా సక్సెస్ అవుతుందని ఊహించి ఉండలేదు. ఏదో సినిమా తీయాలనుకున్నాం చేశాం అనుకున్నారు. కానీ నేనొక్కడినే 'మాభూమి' అపూర్వ విజయం సాధిస్తుందని నమ్మాను. ఎందుకంటే ప్రజలకు మనం కావలసింది ఇస్తే వాళ్ళు మనకు ఆదరణ రూపంలో తిరిగి ఇస్తారని నమ్మినవాణ్ణి. అది అక్షరాలా నిజమైంది.

సినిమా తీసినంత కాలం ఏరోజుకారోజు డబ్బులు వెదుక్కుని సెట్స్ మీదికి వెళ్ళేవాళ్ళం. ఇందుకు అమ్ముకవలసినవన్నీ అమ్మేశాను, కుదువ పెట్టాల్సినవన్నీ కుదువపెట్టేశాను. సినిమా పూర్తయింది. సెన్సార్ చేయించాలి. చివరికి భద్రంగా దాచుకున్న వెడ్డింగ్ రింగ్స్ కూడా అమ్మేశాను. (గుర్తుందా భూపాల్?). వచ్చిన 700/- రూపాయలతో సెన్సార్ చేయించాము. అవన్నీ తలచుకుంటె భావోద్వేగం తన్నుకువస్తోంది. ఎంతోమందిమి కలిసి పనిచేశాం. వారంతా హృదయపూర్వకంగా పనిచేశారు. అందరూ తమదైన పాత్ర పోషించారు. తక్కువ, ఎక్కువ అని లేదు. సమిష్టి కృషి ఫలితమే 'మాభూమి'. 'మా భూమి' ప్రజల సినిమా గనుకనే ప్రజలు ఆదరించారు అని అంటారు ఆయన."



**మాభూమి తెరపై**

'మాభూమి'లో కథా నాయకుడు రామయ్యగా త్రిపురనేని గోపీచంద్ కొడుకు సాయిచంద్, తండ్రి వీరయ్యగా కాకరాల, జమీందార్‌గా ఎంబీవీ ప్రసాదరావు, పట్వారీగా లక్ష్మణ్‌రావు లంబాడి చంద్రిగా మరాఠీ నటిహంస, ఇంకా నరసింగరావు, గద్దర్, భూపాల్‌రెడ్డి, రామిరెడ్డి, ప్రదీప్‌శక్తి, విజయప్రకాశ్, మాస్టర్ సురేశ్, యాదగిరి, రాజగోపాల్, రాజేశ్వరి, శకుంతల, పోచమ్మ, సూర్యకుమారి, రమణి తదితరులు నటీనటులు. బి.నరసింగరావు – ప్రాణ్‌రావ్‌లు సంభాషణలు రాశారు. తెలంగాణ యాసలో మాటలు జీవం పోసుకున్నవి. సహజ జానపద స్వరాలతో సంగీతం చేసింది వింజమూరి సీతాదేవి. బి. గోపాలం ఆర్కెస్ట్రా సమకూర్చారు. గద్దర్ పాడిన, బండి యాదగిరి రాసిన 'బండెనక బండికట్టి' నేటికీ తెలంగాణ జనజీవన గీతమే. సుద్దాల హనుమంతు రాసిన 'పల్లెటూరి పిల్లగాడ పసులగాసె మొనగాడ' పాట సంధ్యనోట జీవం పోసుకున్నది. 'పొడలా పొడలా గట్ల నడుమ' పాట కూడా మరవదగినది కాదు. సినిమాటోగ్రఫి నిర్వహించింది కమల్‌నాయక్. వైకుంఠం కళ, డి.రాజగోపాల్ ఎడిటింగ్ నిర్వహించారు. కాస్ట్యూమ్స్ గౌతం గర్ల్‌ఫ్రెండ్ నీలాంజన చేశారు. (అప్పటికి వారిద్దరికి పెళ్లి కాలేదు). చైతన్య చిత్ర ఇంటర్నేషనల్" బ్యానర్‌పై చిత్ర నిర్మాణం జరిగింది.

**మాభూమి నా జీవితంలో ఒక అద్భుతం : సాయిచంద్**

ఎప్పటికీ 'మాభూమి రామయ్య'నే అని అంటారు ప్రధాన పాత్ర పోషించిన సాయిచంద్. "మాభూమి సినిమా నా జీవితంతో పెనవేసుకుపోయింది. అంతా నిన్న మొన్న జరిగినట్లుగా ఉంది. నా జీవితం 'మాభూమి'కి ముందు తరువాతగా మారింది. నన్ను ఈ చిత్రం జీవితానికి దగ్గరగా తీసుకుపోయింది. అంతకుముందు నేను అలాంటి వాస్తవిక జీవితాన్ని చూడలేదు. సహజత్వం కోసం 1940ల నాటి వాతావరణం ఉట్టిపడేలా వున్న మంగలపర్తిలో సినిమా తీశారు. కరెన్సీ దగ్గర్నుంచి అన్నీ ఆ కాలం నాటివే వాడారు. అవే కాస్ట్యూమ్స్. థియేటర్ నుంచి వచ్చిన వారవడం వల్ల వారిద్దరు ప్రతీది చేసి చూపేవారు. దాంతో నాకు నటించడం ఈజీ ఐపోయింది. 'రామయ్య' పాత్రలో లీనమయ్యాను. నాతోనేమిటి ఊరి వాళ్లతో కూడా ఉదా॥ కొమరయ్య, సాయిలు మొదలైనవారిని వారి వారి పాత్రల్లో సహజంగా నటింపజేయడం గౌతం, నర్సింగ్‌ల గొప్పతనమే. 'మాభూమి' నా జీవితంలో ఒక అద్భుతం. ఆ సింద్రోమ్‌లోనే ఉండిపోయాను. అందుకే అప్పటికి ఇప్పటికి ఎప్పటికి 'మాభూమి రామయ్య'గానే ఉండిపోతాను."

**మాభూమి అద్భుత ఆవిష్కరణ : బి.నర్సింగరావు**

"మాభూమి"లోని ఒక్కో ఎపిసోడ్‌లో ఒక్కో సినిమా ఉంది అంటారు బి.నర్సింగరావు. ఆ సినిమా ఏడాది పాటు ఏకబిగిన ఆడింది. స్వర్ణోత్సవాలు జరుపుకుంది. ద్వితీయ ఉత్తమ చిత్రం, స్క్రీన్‌ప్లేకు నంది అవార్డులు అందుకున్న మాభూమి ఇండియన్ పనోరమాకు ఎంపికైంది. రాజకీయ కారణాల వల్ల జాతీయ అవార్డు రాలేదు. ఫిలింఫేర్, సిని హెరాల్డ్ అవార్డులతో బాటు ట్రివేండ్రమ్, కార్ల్ వివరీ, కైరో, సిడ్ని, తాష్కెంట్ ఫిలింఫెస్టివల్స్‌లో ప్రదర్శితమైంది. సీఎన్ఎన్ ఐబిఎన్ వారు భారతదేశంలో ఎంపిక చేసిన నూరు అత్యుత్తమ చిత్రాల్లో మాభూమి స్థానం సంపాదించుకున్నది. ఏ విధంగా చూసినా వెండి తెరపై తెలంగాణ మట్టి వాసనకు దృశ్యరూపం ఇచ్చిన సినిమా 'మాభూమి'. ప్రజల పోరాటానికి, ఆ చరిత్రకు, సంస్కృతికి, భాషకు సినిమా పరిభాష 'మాభూమి'. ఒకనాటి తెలంగాణ సాయుధ పోరాటానికి సహజమైన నలుపు తెలుపులో అద్భుత ఆవిష్కరణ 'మాభూమి'.

– హెచ్.రమేష్‌బాబు,
m: 7780736386
e:rameshbabuh99@gmail.com



# మాటల జ్వరం

రాత్రి సుదీర్ఘ మౌనం పిదప
మాటల లోకం లోకి అడుగు పెడతావు

శుభ్ర ఆహారంతో కడుపు నింపుకోవడం కోసం
దేహాన్ని శుభ్రపరుచుకోవడమే కాదు
శుభ్రమైన మాటల కోసం
నోటినీ చెవులనూ శుభ్రం చేసుకుంటావ

ఇక మాటలు నిన్ను చేరడం మొదలవుతుంది

అవసరం మేర సాగే మాటలు
అతి మర్యాదల మాటలు
యంత్ర శబ్దాల్ని కూడా
పరిహసించగలిగిన లోహ మాటలు
నిన్నా మొన్నటి పాచి పోయిన మాటలు
మధ్యలో కొన్ని అబద్ధపు మాటలు

అన్నీ చెవుల తలుపుల దగ్గరే
ముక్కలుగా విరిగి పడిపోతుంటాయి

తప్పదు కదా
శుభ్రం చేసుకున్న నీ నోటి నుండి కూడా
అటువంటి మాటలేవో దూసుకెళ్తాయి

మధ్యలో మార్కెట్ వల ధరించిన మాటలు
ప్లాట్ కొనమనీ, అప్పు తీసుకొమ్మనీ
సెల్ ఫోన్ ని పేల్చి మరీ విసిగిస్తుంటాయి
వందసార్లు కసిరికొట్టినా తుడిచేసుకుని
నూటా ఒకటోసారి మాటలకు నవ్వులు పూసుకుని

దేశపటం మీద ఏ మాటలు ప్రవహిస్తున్నాయో
కాస్త విందామని ప్రయత్నిస్తావు కదా

సింహాసనాల పరమ అశుద్ధ మాటలు
అసహ్యాన్ని వెదజల్లుతూ వుంటాయి
భయాందోళనలతో వొణికి పోతావు

ఇంటిని చేరాక
చెవుల దగ్గరా నోటి దగ్గరా రాలిపడిన
మాటలన్నింటినీ దులిపివేసి

గుండెల్ని నింపే ఆక్సిజన్ వంటి
మాటలు గుప్పెడు కూడా దొరకని
వేదన ఏదో జ్వరమై పీడించిన దేహంతో
మరొక సుదీర్ఘ రాత్రి మౌనంలోకి

–కోడూరి విజయకుమార్,
m : 8330954074
e : kodurivijay@gmail.com

చందాదారులుగా చేరండి! **దక్కన్ ల్యాండ్** చందాదారులను చేర్పించండి!

'ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో ప్రజాఉద్యమాల వేదికగా ఆరంభమైన 'దక్కన్‌ల్యాండ్' తెలుగు సామాజిక రాజకీయ మాసపత్రిక అనతికాలంలోనే అన్ని వర్గాల ఆదరణ పొందింది. తెలంగాణ ఉద్యమకారులకు కరదీపికగా మారింది. ఈ పత్రిక మరిన్ని వర్గాలకు చేరడంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందాదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందాదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా**
DECCAN LAND
**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029. Mob: 9030626288
E-mail:desk.deccan@gmail.com, www.deccanland.com

**చందా వివరాలు:**

| | | |
|---|---|---|
| వార్షిక చందా | : | రూ. 300 |
| 2 సంllలకు | : | రూ. 600 |

'దక్కన్ ల్యాండ్' పేరిట ఎంఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.

# మనిషి భావాలకు రంగులద్దిన వర్ణధారి విజయ్‌కుమార్

## దేశవిదేశాల్లో వందకుపైగా చిత్రకళా ప్రదర్శనలు

మనిషిలోని సంఘర్షణకు అద్దం పట్టే మనోజ్ఞ చిత్రాలను గీసి ఔరా అనిపిస్తున్నారు ప్రముఖ చిత్రకారులు విజయ్ కుమార్. తన భావాలకు అనుగుణంగా రంగులు అద్దడం, ప్రకృతికి, మనిషికి విడదీయరాని సంబంధం ఉందంటూ మనిషిపడే తపన, ఎదుర్కొనే మానసిక సంఘర్షణలను ప్రకృతిలో వెతికి వైవిధ్యమైన చిత్రాలు గీయడం వంటివి ఆయన ప్రతిభను చాటిచెప్తున్నాయి.

**బరోడా విశ్వవిద్యాలయం నుంచి మెళకువలు:**



ఇద్దరి వ్యక్తుల మధ్య ఉన్న అనుబంధం భిన్నాభిప్రాయాలతో విడిపోవడాన్ని పడిపోయిన చెట్టుతో పోల్చి విభిన్న చిత్రాలు గీసి మెప్పించారు చిత్రకారులు విజయ్‌కుమార్. హైదరాబాద్ నగరానికి చెందిన ఆయన మనిషి భావాలను ప్రకృతికి అన్వయించి అద్భుతమైన చిత్రాలు గీయడం లక్ష్యంగా ఎంచుకున్నారు. చిన్ననాటి నుండే చిత్రలేఖనంపై ఆసక్తి ఉండటం వల్ల ఈ రంగంలో ప్రవేశించారు. పెయింటింగ్‌లో తొలి మెళకువలన్నీ బరోడా విశ్వవిద్యాలయం కేంద్రంగా నేర్చుకున్నారు. పెయింటింగ్‌లో పోస్టుగ్రాడ్యుయేట్ పూర్తిచేసి, చిత్రలేఖనంలోకి 1982లో ప్రవేశించారు. ఎక్రిలిక్ రంగులు ఉన్నప్పటికీ ఆ రంగుల ద్వారా అన్ని రకాల షేడ్స్ రావనీ, 50 సంవత్సరాల నుంచి చిత్రలేఖనంలో ఆయిల్ కలర్స్ ఎక్కువగా ఉపయోగిస్తూ ప్రయోగాలకు కేంద్రంగా నిలిచారు. దేశవిదేశాల్లో వందల సంఖ్యలో ప్రదర్శనలు నిర్వహించి పేరు గడించారు.

**మనిషి మనుగడలో మలుపులు :**

మనిషి మనుగడలో మలుపులు ఉన్నట్లే ప్రకృతిలోని చెట్టుచేమలు, పశువులు, జంతువుల్లోనూ ఉంటాయని తన చిత్రాల ద్వారా నిరూపించే ప్రయత్నం చేశారు. మానవ మేథస్సులో దాగిన ఊహాలకు ప్రాణం పోసి రంగుల ప్రపంచాన్ని ఆవిష్కరించారు. దూరంగా కనిపించే కొండకోనలు, చుట్టూ ఉన్న చెట్టుచేమల్లో ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ తన కుంచేతో ప్రయోగాలు చేస్తున్నారు. తాను గీసే చిత్రాల్ని ఎవరిదృష్టితో వాళ్లు ఎవరి విశ్లేషణతో వాళ్లు వేరువేరుగా చూసుకొని విశ్లేషించుకునే వీలుందంటారు. తన యవ్వనంలో ఎదుర్కొన్న సమస్యలు, జీవితం గూర్చి నేర్చుకున్న గుణపాఠాలే తనను ఇలాంటి భావ చిత్రాలు గీయడానికి దోహదపడిందంటారు ఆయన. భావ చిత్రాలు గీయడానికి ప్రతి చిత్ర లేఖకుడు కృషి చేయాలని విజయ్‌కుమార్ కోరుతున్నారు. చిత్రకారుడిగా నిలదొక్కుకోవాలంటే క్రియేటివిటి ఉండాలంటున్నారు.

**విద్య :**

- 1983లో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (బీఎఫ్ఏ)లో ఫ్యాకల్టీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, ఎంఎస్. యూనివర్సిటీ బరోడా.
- 1985లో మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (ఎంఎఫ్ఏ) (క్రియేటివ్ పెయింటింగ్)

**అవార్డ్సు :**

- 1974లో లలిత కళా సమితి, సిద్ధిపేట, ఆంధ్రప్రదేశ్
- 1979లో ఇంటర్ కాలేజియేట్ టాలెంట్ కాంపిటీషన్, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్
- 1989 చిత్రకళ శాంసద్, మచిలీపట్నం, ఆంధ్రప్రదేశ్
- 1987 ఆలిండియా యూత్ ఆర్ట్ ఎగ్జిబిషన్, కమిమోరేటింగ్ జామిని రాయ్ బర్త్ సెంటినరీ ఇయర్, కలకత్తా
- 1989–96 ఆలిండియా ఆర్ట్స్ ఎగ్జిబిషన్, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ
- 1997 స్టేట్ లెవల్ ఆర్ట్ ఎగ్జిబిషన్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్
- 2001 గోల్డ్‌మెడల్ ఇన్ డైమండ్ జూబ్లీ ఇయర్ ఆలిండియా ఆర్ట్ ఎగ్జిబిషన్, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ

**స్కాలర్‌షిప్స్ అండ్ ఫెలోషిప్స్ :**

- 1979–83 ప్రొఫెషనల్ స్టడీస్ స్కాలర్‌షిప్, నిజాం ఛారిటబుల్ ట్రస్టు, హైదరాబాద్













- 1980 మెరిట్ స్కాలర్‌షిప్, ఫ్యాకల్టీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, ఎం.ఎస్. యూనివర్సిటీ, బరోడా
- 1983-84 బెస్ట్ స్టూడెంట్ స్కాలర్‌షిప్ (ఫ్యాకల్టీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్) ఉర్జా ట్రస్టు, బరోడా
- 1984-85 హయ్యర్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్, ఏపీ స్టేట్ లలిత కళా అకాడమీ
- 1995-97 జూనియర్ ఫెలోషిప్ (విజువల్ ఆర్ట్స్), హెచ్ఆర్‌డీ, న్యూఢిల్లీ

**సోలో షోలు :**

- 1987 పెయింటింగ్స్ అండ్ డ్రాయింగ్స్ ఉత్తీసింగ్ విజువల్ ఆర్ట్ సెంటర్, అహ్మదాబాద్
- 1987 పెయింటింగ్ అండ్ డ్రాయింగ్స్ మ్యాక్స్ ముల్లర్ భవన్, హైదరాబాద్
- 1988 పెయింటింగ్స్, డ్రాయింగ్స్ అండ్ ఫొటోగ్రాఫ్స్ - శ్రీధరణి ఆర్ట్ గ్యాలరీ, న్యూఢిల్లీ
- 1991 'రోరింగ్ సైలెన్స్' పెయింటింగ్స్ అండ్ డ్రాయింగ్స్ - జహంగీర్ ఆర్ట్ గ్యాలరీ, ముంబై
- 1993 ఇన్నర్ తుర్‌మోయిల్ పెయింటింగ్స్ అండ్ డ్రాయింగ్స్ మ్యాక్స్ ముల్లర్ భవన్, హైదరాబాద్
- 996 పెయింటింగ్స్ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్
- 1998 డ్రాయింగ్స్- కలర్‌షీ, అహ్మదాబాద్ అండ్ బరోడా
- 2000 మీనియేచర్ పెయింటింగ్స్ - ఇండోట్రోనిక్స్, హైదరాబాద్

**గ్రూప్ షోలు :**

- 1975 ది ఆర్ట్ ఆఫ్ త్రీ డికేడ్స్ ఇన్ కనెక్షన్ విత్ ఫస్ట్ వరల్డ్ తెలుగు కాన్ఫరెన్స్, లలిత కళా అకాడమీ, హైదరాబాద్, ఏపీ
- 1982 యంగ్ ఆర్టిస్టు కాంటెంపరరీ ఆర్ట్ ఎగ్జిబిషన్, ఆంధ్రాసమితి, బరోడా
- 1985 డిగ్రీ షో, ఫ్యాకల్టీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, ఎంఎస్.యూనివర్సిటీ, బరోడా
- 1988 ఎక్స్‌పోజిషన్ 88, క్రియేటివ్ ఆర్ట్స్ ఫండ్, సంస్కార్ కేంద్రం, అహ్మదాబాద్
- 1990 'నైన్ టు నైన్‌టీ' 50 ఆర్టిస్టు ఆఫ్ ఫేమ్ అండ్ ప్రామిస్, లలితకళా అకాడమీ, న్యూఢిల్లీ
- 1990 5 యంగ్ కాంటెంపరరీస్, ఎల్.వి.ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ అండ్ సీసీఎంబీ, హైదరాబాద్
- 1994 గ్రూప్ 5, జహంగీర్ ఆర్ట్ గ్యాలరీ, ముంబై
- 2000 యాన్యువల్ షో, బిర్లా అకాడమి ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, ముంబై
- 2005 ఆర్ట్ క్యాంప్ షో, కళాకృతి ఆర్ట్ గ్యాలరీ, హైదరాబాద్
- 2015 ఆర్ట్ ఎట్ తెలంగాణ, సాలార్‌జంగ్ మ్యూజియం, హొటల్ మారియట్, హైదరాబాద్
- 2018 ఫస్ట్ ఇంటర్‌నేషనల్ కళామేళ, లలితకళా అకాడమి, న్యూఢిల్లీ
- 2020 6 డైమెన్షియన్స్ సీజన్ 4, ఆర్ట్ షో, ఎం.ఈశ్వరయ్య ఆర్ట్ గ్యాలరీ, హైదరాబాద్.

- రామకృష్ణ కాంపాటి,
m : 9866168863
e: ramakrishna.praja@gmail.com

ద





# అప్పుడప్పుడు - 12

ఏడేడు సముద్రాలు దాటి
ఏడేడు కొండలు గడిచి
ఏడేడు మంచు పర్వతాలు చుట్టి
ఏడేడు ఖండాలు పారి
ఏడేడు దుఃఖపర్వతాలు
ఏడేడు సంతోష శిఖరాలు
ఏడేడు సంగీత సరస్సులు
ఏడేడు మానవ విస్ఫోటనాలు
ఏడేడు జీవజాల మాయాజాలాలు
ఏడేడు ప్రకృతి జనన రహస్యాలు
ఏడేడు మానవ మానసిక సరిగమలు
ఏడేడు సిద్ధాంత రాద్ధాంతరాలు
ఏడేడు విజయోత్సవ పతాకలు
ఏడేడు అపజయపరంపరల అంపశయ్యలు
ఏడేడు నిన్నలు నేడులు రేపులు
ఏడేడు వాయుజనిత భావోద్రేకాలు
ఏడేడు భారతాలు
ఏడేడు రామాయణాలు
ఏడేడు భాగవతాలు
ఏడేడు ఉల్లాస గీతాలు
ఏడేడు అగ్ని పర్వతాల ఆగ్రహాలు
ఏడేడు మంచు శిఖరాల మంటల శకలు
ఏడేడు ఛమ్కీకోట్లు
ఏడేడు జరీ ఖండువాలు
ఏడేడు పిల్లల చెడ్డీలు
ఏడేడు బంగారు కడ్డీలు
ఏడేడు జంతరు పెట్టెలు
ఏడేడు ముంతల మూతలు
ఏడేడు ధాన్యపు గింజలు
ఏడేడు తాటి ముంజలు
ఏడేడు రాట్నాలు జట్కాలు మట్కాలు

ఏడంటే ఏడే సప్తస్వరాలు
ఏడంటే ఏడే నక్షత్రాలు
ఏడులోనే పాడు
ఏడులోనే జోడు
ఏడులోనే కాడు
ఏడులోనే ఆడు
ఏడులోనే గోడు
ఏడులోనే లాడు
ఏడులోనే ఏడులోనే యాడులోనే...

పలికిందే పలికి
అలికిందే అలికి
కెలికిందె కెలికి
గిలికిందే గిలికి
వాలికిందే వాలికి
వాలియొ వాలియే వాలియె..
రాగాల కోసల మీంచి
అల్లనేరేడు జాడలలోంచి
కోతీ కొమ్మల ఆటల
ఊడల ఊపుల జోరులలోంచి
ఉయ్యాల జంపాల పాటల
చిరుమత్తుతో జోగుడులోంచి
నింగి లోంచి
నేలలోంచి
అగ్ని లోంచి
గాలి లోంచి
నీటి లోంచి
ఆకాశపు అంచు లోంచి
పాతాళపు పదఘట్టన లోంచి
మంచి లోంచి
చెడు లోంచి
చెడుగుడు లోంచి

చెంగల్వ పూదండ లోంచి
ఆకాశం పూసిన ఎండకు
నీళ్లలో కదిలే
వెలుగు రేఖల లోంచి
అడుగులో అడుగు వేసి
ఆఖరి అడుగుగా
ఆగిపోయిన వైనంలోంచి
పానిపట్ లోంచి
కనికట్టు లోంచి
కష్టాల కానుకల
లోతట్టు జగమెట్టు లోంచి
జట్లు జట్లుగా నడక సాగించే
మానవ సమూహాల
స్మశానాల క్షరశాలల
మర బొమ్మల
మత తెన్నుల
పలు భాషల
పర యాసలో
పలు మాటల
ఈటెల వేటలలో..

శరానికి చిక్కిన
పక్షి లా
స్వతంత్రత
అసలే లేని
సామాన్యుడిలా
కీర్తి కిరీటాలు
భుజకీర్తులు
ధరించిన కండూతీపరుడిలా
ఆశ కదిలి
ఆశ కలిగి
ఆశ పెరిగి
ఆశ విరిగి
విసిగి వేసారి
అదే విముక్తి కీర్తనలలో
మెట్లు ఎకుతూ
దూరం ఎరగక
తీరం దొరకక
భారం మోయలేక
ఈడ్చ లేక పూడ్చలేక
ఏడేడు దుఖ్ఖ పర్వతాలని
అరువు తెచ్చుకుని
ఏడేడు తోబుట్టువులను పట్టుక వగచి



ఏడేడు తొవ్వలలో
ఏడేడు మలుపులలో
ఏడేడు నిండు భాండాగారాలలో
ఏడేడు పండు వెన్నెలలో
విరిగిన పాలలా
విరిగిన శిఖరంలా
విరిగిన కాళ్ళ వేళ్ళలా
జరుగుతున్న కాలం
వెలవెల బోతున్న
జీవనకాంతి
అడుగంటిన క్రాంతి
అణగారిన భ్రాంతి
నిటారుగా నడిచి వెళ్ళి
శిఖరంపై నుండి
లోయలోకి చూపు సారించి
గాలిలోకి తేలి తేలి పోయే
రెండుకాళ్ళు, రెండు కళ్ళు, రెండు చేతి వేళ్ళు, లేని కాలి జోళ్ళు
యుక్తి మాట
విముక్తి బాట
పగిలిన వెన్నెల..

– (అయిపోయింది)

-బి. నరసింగరావు

# కొలాము గిరిజనుల పెండ్లి - పాటలు

కొలాం సంప్రదాయ వివాహంలో కొన్ని ఆచారాలు ప్రత్యేకంగా ఉంటాయి.

కొలాం వివాహ వ్యవస్థలో వరకట్నం అనేది ఉండదు. వరుడు గృహం వద్దనే వివాహం జరుగుతుంది. వివాహానికి అనేక దూర ప్రాంతాల వారిని ఆహ్వానించుతారు. ఆహ్వాన ఆనవాలుగా పసుపుతో కలిపిన జొన్న ధాన్యాలను తలూవల్ (అక్షింతలు)గా వారికి అందజేస్తారు.

ఊరిలో కళ్యాణ మండపం నిర్మించడానికి గ్రామంలోని ప్రజలందరు సహకరిస్తారు. అడవి నుండి వెదురు (బొంగులు) పెళ్ళిపందిరి నిర్మాణానికి తీసుకొని వస్తారు.

కళ్యాణానికి వచ్చే బంధువుల, చుట్టాల కోసం, భోజనం చేయడానికి, మోదుగు టేకు ఆకులను సేకరిస్తారు. గ్రామ పురుషులందరు కలిసి వంట చెరకు అడవి నుండి సేకరిస్తారు. వివాహానికి వచ్చిన వారిని గౌరవ, ఆప్యాయతలతో పలకరిస్తూ, తనీరు, చుట్టలు (బీడీలు) విందు అందిస్తారు.



వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు వివాహానంతరం, డెమ్సా, దుల్లికి, రేలా పాటలకు నృత్యం చేస్తారు. వివిధ కళాకారులు నాటకాలు హాస్యచలోక్తులతో ఉండి సామాజిక స్పృహను కల్గి ఉండి అందరిని కడుపార నవ్విస్తారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన యువతి యువకులు తమ పరిచయాలు, సంబంధాలను, స్నేహ సంబంధాలుగా ఏర్పరచుకుంటారు.

కొలాం సమాజంలో వివాహాలు 4రకాలుగా జరుపుతారు. అవి:

1) ఈర్ల్ 2) పెండ్లిక్ 3) ఇల్లుటమ్ పెండ్లిక్ 4) హెట్ల్

**1. ఈర్ల్ :** పెండ్లికి ముందు ఒకరోజు మాత్రమే జరుపుతారు. తమ గ్రామంలో ఉండే యుక్త వయస్సు కల్గిన యువతి, యువకులు ప్రేమించుకొని తల్లితండ్రులను ఎదిరించలేక ఐదు రోజుల పాటు దూర ప్రాంతాలకు వెళ్లి తమ బంధువుల వద్ద లేక మిత్రుల వద్ద ఉండి తిరిగి తమ స్వగ్రామాలకు వస్తారు. తర్వాత ఎలాంటి ఘర్షణలు లేకుండా సంబంధాలు కలుపుకుంటారు. వారి తల్లిదండ్రులను, బంధువులను పిలిచి గ్రామ పెద్ద, కారోబారి, ఊరి పటేల్, గ్రామ ప్రజల సమక్షంలో పన్స్‌ద్ ద్వారా తీర్పునిచ్చి, గ్రామ ప్రజల మధ్య, ప్రేమ అనురాగ ఆప్యాయతల మధ్య వివాహం సంబురంగా జరుపుతారు.

ఈర్ల్ అనేవి రాత్రి వేళనే జరుపుతారు. మొదట వరుడు వధువులకు వారి తనువులకు పసుపు రాసి స్నానం చేయిస్తారు. అదే విధంగా వరుడుకి పంచె (ధోతి), వధువుకు చీర ధరింపజేస్తారు.

ఈర్ల్ అనంతరం ఊరి పెద్ద దేవరి వారిని ఆశీర్వదించుతాడు. దేలాక్ (దేవరి) సమక్షంలో పోలకమ్మ (ఊరికట్టు బయట ఉండే దేవత)ను దర్శించడానికి డోలు, పెంపెరే వాయిద్యాలతో చాలా సంబురంగా సమూహంగా వెళ్ళుతారు.

నోవ్రక్ (వరుడు), నోవ్రీ (వధువు)లను పై నుంచి పడదను పట్టుకుంటారు. వారి ముఖాలు ఎవరికి కన్పించకుండా పసుపుతో ముంచిన వస్త్రాలతో కప్పి ఉంచుతారు. అమ్మోరు (పొలకమ్మ) బేటిక్ అనంతరం తిరిగి ఊరికి ప్రయాణం అవుతారు.

డోల్, పెంపెరే మార్మోగిస్తూ కళ్యాణ (ఈర్ల్) పందిరికి వచ్చిన అనంతరం వారిని చెక్క పీటల మీద కూర్చోబెట్టి నోవ్రక్ (వరుడు) యొక్క పెద్దన్న (పొత్తి) మంగళసూత్రాన్ని ఈర్ల్ (కళ్యాణ సభికులందరి)కి చూపిస్తారు అందరు నమస్కరించుతారు. వరుడు – వధువు మెడలో పొత్తి (మంగళసూత్రాన్ని) కట్టుతాడు. అక్కడ ఉన్న ప్రజలందరు తల్వాల్ (అక్షింతలు) వేసి దీవించుతారు. ఈర్ల్ అనంతరం ప్రజలందరు విందు ఆరగించి, డోల్, పెంపెర్ మ్రోగించుతు పెళ్ళి పందిరిలో ఈర్ల్‌కు వచ్చిన వారందరు డెమ్సా దుల్లికి, కేల్ (నాటకం) ఆడతారు. ఈర్ల్ పందిరిలో యువతి/యువకుల పాటలు ఆకట్టుకుంటాయి.

**డెమ్సా పాట :**

తెల్లోడి పూత తెల్లోడిపూత
కన్లు ఏనా కనున్‌కిలేదే ఏదే ఏనా సేద్దేనా ఆదిఏనా వారేద్ ॥2॥
పసుడి పూత పుసుడిపూత
కన్లు ఏనా కనున్‌కిలేదే ఏదే ఏనా సేద్దేనా ఆదిఏనా వారేద్ ॥2॥
గులాబి పూత గులాబిపూత
కన్లు ఏనా కనున్‌కిలేదే ఏదే ఏనా సేద్దేనా ఆదిఏనా వారేద్ ॥2॥
ముగ్రి పూత ముగ్రిపూత
కన్లు ఏనా కనున్‌కిలేదే ఏదే ఏనా సేద్దేనా ఆదిఏనా వారేద్ ॥2॥

**తెలుగులో అర్థం :**

ఇంత పెద్ద అడవిలో ఎక్కడుందో ఆ తెల్లనైన పువ్వు, ఎటైనా వెళ్ళుతున్నప్పుడు జ్ఞాపకం వస్తుంది. దానికి తోడుగా పచ్చని పసుపు పువ్వు నా కన్నులకైనా కనబడటం లేదు. గులాబిపువ్వులుగా ఉండే పువ్వు నాకు కనబడుత లేదు, ముద్ద మందారం పువ్వంత మొఖము చేసి అడవి అంతా వెతుకుతున్నా. నా కన్నులకు కనిపించవే. ఓ తెల్లని పుష్పమా!

**దుల్లికి పాట :**

వన్ద్ నీగురే అడవిత్
మట్ పొయ్యిలా సోగ నమ్లితానేవిసాదే ॥2॥
వన్ద్ నీగురే అడవిత్
మాక్ పొయ్యిలా సోగ నమ్లి ఎన్ద్ త్ ఇసాదే ॥2॥
వన్ద్ నీగురే అడవిత్
మక్ పొయ్యిలా సోగ నమ్లి ఎన్ద్ త్ ఇసాద్ ॥2॥
వన్ద్ నీగురే అడవిత్
మెట్ పొయ్యిలా సోగ నమ్లి తానేవిసాద్ ॥2॥
వన్ద్ నీగురే అడవిల్
ఇనే రూపున్ ఒల్స్ పన్ద్ త్ ఇసాదే ॥2॥
వన్ద్ నీగురే అడవిత్
మేట్ పొయ్యిలా సోగ నమ్లి తానే విసాదే ॥2॥

**తెలుగులో అర్థం :** వదిన, పచ్చదనంతో నిండిన ఈ అడవి అందాల్లో ఓ అందమైన గొంతుతో నెమలి పాట పాడుతుంది. వదిన నువ్వు విన్నావా!

ఆ కొమ్మపైన ఎగిరే నృత్యం చేస్తుంది. నీ రూపం/ అందం చూస్తూ నిన్నే చూస్తూ నృత్యం చేస్తుంది. ఆ నెమలి ఏమని పలకరిస్తుంది? అర్థం చేసుకో.

**2. పెండ్లిక్:** కొలాం సమాజంలో వివాహాన్ని 'పెండ్లిక్' అని పిలుస్తారు. ఈ పెండ్లిక్ మూడు రోజుల పాటు జరుగుతుంది.

ముందుగా వివాహం చేసుకొనే అమ్మాయి గృహానికి వెళ్ళి అమ్మాయిని అడుగుతారు. అమ్మాయి కుటుంబ సభ్యులు అంగీకరిస్తే ఊరిలోని పెద్దవారితోపాటు పట్టుకొని గ్రామ పెద్ద, పటేల్, కారోబారి నాలుగు సగాల వారు కలిసి సంబంధాలు కలుపుకోవడానికి నిర్ణయిస్తారు.

**చిదోరిక్ :** పెళ్ళి సంబంధం కుదిరినప్పుడు అబ్బాయి తల్లిదండ్రులు అమ్మాయి తల్లిదండ్రులకు 'చిదోరిక్' పెళ్ళి ఆనవాలు మర్యాదపూర్వకంగా వచ్చి ఇస్తారు. 'చిదోరిక్' అనగా అబ్బాయి పొలంలో పండించిన జొన్న, మొక్కజొన్న పప్పు, దినుసులు, ధాన్యాలు మొదలగునవి. తర్వాత కడియమ్ (నిశ్చితార్థం) చేస్తారు. అనగా కాబోయే వధువుకు వరుడు తరపున ఉంగరం, పట్టీలు (చాయినీక్) హారాలను ధరింపజేస్తారు.

కడియమ్‌కు వరుడు వెళ్ళరు. ఊరి పెద్ద వారు ప్రజలు అందరు సంబురంగా వెళ్ళుతారు. ఊరిలో ప్రజలందరూ భోజనం చేసి రాత్రివేళ కడియమ్ చేయడానికి దూర ప్రాంతాలకు ప్రయాణిస్తారు. ఎడ్లబండిలో సరిపడా ఆహార పదార్థాలతో ప్రయాణం చేస్తారు. కడియమ్ చేయడానికి వచ్చిన వారిని వధువు తల్లిదండ్రులు. మర్యాద పూర్వకంగా రాం.. రాం అని స్వాగతం పలుకుతు నమస్కరిస్తారు.

కడియమ్ చేయడానికి వచ్చిన వారికి తేనీరు, విందు, బీడి(చుట్ట) మొదలైనవి ఇచ్చి తగు సమాచారం, బాగోగులు ప్రయాణం గురించి, విశేషాలు తెలుసుకుంటారు.

**కడియమ్ చేయు విధానం :**

కొలాం భాషలో వధువును నోర్రీ అని వరుడిని నోర్వా అని పిలుస్తారు. నోర్వా తరపున వచ్చిన కొందరు యువతులు ఇంటిని ఆవుపేడతో శుభ్రం చేస్తారు.

నోర్రీకి స్నానం చేయించి కొత్త చీరను కట్టుతారు.

నోర్రీని పీటల మీద కూర్చోబెట్టి నోర్వా తల్లిదండ్రులు కడియమ్స్ ఆనవాలు ధరింపజేస్తారు. కడియం తొడిగించిన అనంతరం మేనమామ నోర్రీని తన దగ్గర కూర్చోపెట్టుకున్న సందర్భంగా మహిళలు పాడే పాట.

**పాట :**

రేల రేల రే రెల రేల రెల రెల
రేల రేల రేల రెల రేల రేల రెల ॥4 సార్లు॥
మామ ఇందద్ మామా బసి
మామ ఇంన్ద్ మామ బసి ॥ 4 ॥
తానుంజ మామా ఇంతి బసి
తానుంజ మామా ఇంతి బసి ॥ 4 ॥
ఇనే బొయ్యజ వత్తనే మామ
ఇనే బోయ్యజ వత్తనే మామా ॥ 4 ॥
నీ కవాడ్ పుసేవే మమా
నీ కవాడ్ పుసేవే మమా ॥ 4 ॥
కొత్త కవాడ్ గుల్ బెట్టి
కొత్త కవాడ్ గుల్ బెట్టి ॥ 4 ॥
కవాడున్ పూసె అప్పా
కవాడున్ పూసె అప్పా ॥ 4 ॥
నీవె లోప వారెవె బసి
నీవె లోప వారెవె బసి ॥ 4 ॥
లోప వార్సదె బసి
లోప వార్సదె బసి ॥ 4 ॥
లోపకమ్ అన్నెతే అప్ప
లోప కమ్ అన్నెతే అప్ప ॥ 4 ॥
ఎల్లాన్ అయ్యేకద్ అన్నెత్ అప్ప
ఎల్లాన్ అయ్యేకద్ అన్నెత్ అప్ప ॥ 4 ॥
పోక్లోండ్ కామే అన్నేతే అప్ప
పోక్లోండ్ కామే అన్నేతే అప్ప ॥ 4 ॥
బుగ్గియే సప్పెకద్ అన్నేతే అప్ప
బుగ్గియే సప్పెకద్ అన్నేత్ అప్ప ॥ 4 ॥
పొయ్యులే మేగేకద్ అన్నేత్ అప్ప
పొయ్యులే మేగేకద్ అన్నేత్ అప్ప ॥ 4 ॥
ఎల్లయే మేగేకద్ అన్నేత్ అప్ప
ఎల్లయే మేగేకద్ అన్నేత్ అప్ప ॥ 4 ॥
పుర్గు పల్లె అన్నేత్ అప్ప
పుర్గు పల్లె అన్నేత్ అప్ప ॥ 4 ॥
సిట్టి ముంత అన్నేంత్ అప్ప
సిట్టి ముంత అన్నేంత్ అప్ప ॥ 4 ॥
గంజుగొంది అన్నేంత్ అప్ప

గంజుగొంది అన్నెంత్ అప్ప ॥ 4 ॥
ఎల్లా ఇడుప్ అన్నెంత్ అప్ప
ఎల్లా ఇడుప్ అన్నెంత్ అప్ప ॥ 4 ॥
కైత చీపుర్ అన్నెంత్ అప్ప
కైత చీపుర్ అన్నెంత్ అప్ప ॥ 4 ॥
రంధ రాటి అన్నెంత్ అప్ప
రంధరాటి అన్నెంత్ అప్ప ॥ 4 ॥
అనుంజ రంధ కరపే అప్ప
అనుంజ రంధ కరపే అప్ప ॥ 4 ॥
అనుంజ రంధ వారేదే అప్ప
అనుంజ రంధ వారేదే అప్ప ॥ 4 ॥
నీవే ఇడుతే కరన్స్ తప్ప
నీవే ఇడుతే కరప్స్ తప్ప ॥ 4 ॥

**తెలుగు అర్థం :**

పెళ్ళికూతురు (స్త్రీ) ఉద్దేశించి మహిళలు పాడే పాట ఇది. పెండ్లికూతురు అత్త ఇంటి దగ్గర ఏ విధంగా ఉండాలి అనేది ఈ పాట ఉద్దేశ్యం.

మామా...మామా అంటుంది పెళ్ళికూతురు
మామా మామా ఎందుకు అన్నావ్ పెళ్ళికూతురా!
మామా మీ ఇంటికి వచ్చాను
మీ ఇంటి ముందు ఉన్నాను
తలుపులు తీయండి మామా
తలుపులు తెరవండి అత్తమ్మ
పెళ్ళికూతురా లోపలికి రావమ్మ
పెళ్ళికూతురా లోపలికి రావమ్మ
ఇంట్లోని పని మొత్తం నేనె చేస్తానమ్మ
ఇంట్లోని వస్తువులన్ని జాగ్రత్తగా చూస్తానమ్మ
మీ ఇల్లు నా ఇల్లు అత్తమ్మ
తలుపులు తెరవండి అత్తమ్మ.

**మరో పాట : (కోడలుకు అత్త పనులు చెప్పట)**

రేల రేల రేల రేల రేల రేల రేల రేల రేల రే రేల రేల రేల రేల
బసి ఇంన్డ్ బసి బసి ఇంన్డ్ బసి అప్ప
బసి ఇంన్డ్ బసి బసి ఇంన్డ్ బసి అప్ప ॥ 4 ॥
తనుంజ బసి ఇంతివే అప్ప
తనుంఞ బసి ఇంతివే అప్ప ॥ 4 ॥
తొలె పోత్ కుగాడ్ బసి, తొలెపోత్ కుగాడ్ బసి
తొలె పోత్ కుగాడ్ బసి తొలెపోత్ కుగాడ్ బసి ॥ 4 ॥
పోత్న్ సప్పుడ్ వినవె పోత్న్ సప్పుడు వినేవే బసి
పోత్స్ సప్పుడ్ వినేవే పోత్స్ సప్పుడు వినేవే బసి ॥ 4 ॥
సద్గాన సొల్లుతొదెవె సద్గాన సొల్లుతొదెవె బసి
సద్గాన సొల్లుతొదెవె సద్గాన సొల్లుతొదెవె బసి ॥ 4 ॥
సర్విమేరమ్ సెరెవె సర్విమేరమ్ సేరెవే బసి
సర్విమేరమ్ సెరెవె సర్విమేరమ్ సేరెవే బసి ॥ 4 ॥
కేయుగెట్ట లోడెవె కేయుగెట్ట లోడేవె బసి
కేయు గెట్ట లోడేవే కేయుగెట్ట లోడేవె బసి ॥ 4 ॥
పోయ్ మేరం సెరెవే పోయ్ మేరం సెరెవె బసి
పోయ్ మేరం సెరెవే పోయ్‌మేరం సెరెవె బసి ॥ 4 ॥
పోయుత బుగ్గిన్ ఉద్పెవె పోయుత బుగ్గిన్ ఉద్పెవె బసి
పోయుత బుగ్గిన్ ఉద్పెవె పోయుత బుగ్గిన్ ఉద్పెవె బసి ॥ 4 ॥
పోయునివె మేగ్గవే పోయునివే మేగ్గవే బసి
పోయునివె మేగ్గవే పోయునివే మేగ్గవే బసి ॥ 4 ॥
పోయులే కాలే మొక్కవె పోయులే కాలె మొక్కెవె బసి
పోయులే కాలే మొక్కవె పోయులే కాలె మొక్కెవె బసి ॥ 4 ॥
పోయ్ మేరం సెరెవె పోయ్ మేరం సెరెవె బసి
పోయ్ మేరం సెరెవె పోయ్ మేరం సెరెవె బసి ॥ 4 ॥
చీపుర్ మేరం సెరెవె చీపుర్ మేరం సెరెవె బసి
చీపుర్ మేరం సెరెవె చీపుర్ మేరం సెరెవె బసి ॥ 4 ॥
చీపుర్ కాలె మొక్కెవె చీపుర్ కాలె మొక్కెవె బసి
చీపుర్ కాలె మొక్కెవె ఛీర్ కాలె మొక్కెవె బసి ॥ 4 ॥
కెయ్దె చీపుర్ సుమ్మెవే కెయ్దె చీపుర్ సుమ్మేవే బసి
కెయ్దె చీపుర్ సుమ్మెవే కెయ్దె చీపుర్ సుమ్మేవే బసి ॥ 4 ॥
ఎల్లానైస కురియదే ఎల్లానైస కురియదే బాసి
ఎల్లానైస కురియదే ఎల్లానైస కురియదే బాసి ॥ 4 ॥
బొయ్దనైస కురియదే బొయ్దనైస కురియదే బాయి
బొయ్దనైస కురియదే బొయ్దనైస కురియదే బాయి ॥ 4 ॥
కయ్యుత్ సర్వి సుమ్మద్ కయ్యుత్ సర్వే సుమ్మద్ బాయి
కయ్యుత్ సర్వి సుమ్మద్ కయ్యుత్ సర్వే సుమ్మద్ బాయి ॥ 4 ॥
నువిత పావే సేరదే నువిత పావే సెరదే బాయి
నువిత పావే సేరదే నువిత పావే సెరదే బాయి ॥ 4 ॥
సర్విన్ ఉటప్పనన్నదే సర్విన్ ఉటప్పనన్నద్ బాయి
సర్విన్ ఉటప్పనన్నదే సర్విన్ ఉటప్పనన్నద్ బాయి ॥ 4 ॥
సర్విన్ నొడుసనన్నదే సర్విన్ నోడుసనన్నదే బాయి
సర్విన్ నొడుసనన్నదే సర్విన్ నోడుసనన్నదే బాయి ॥ 4 ॥
రేల రేల రేల రేల రేల రేల రేల రేల రేల రేల రేల రేల రేల రేల రేల
రేల రేల రేల రేల రేల రేల రేల రేల రేల రేల రేల రేల రేల రేల రేల ॥4॥

**తెలుగులో అర్థం :** కొత్త పెళ్ళి కూతురు (కోడలు)కు అత్తమ్మ పని చెప్పే విధానం. పెళ్ళికూతురా పెళ్ళికూతరా అంటుంది అత్తమ్మ. ఎందుకు అత్తమ్మ అన్నవే కోడలా...

కోడికూత వినిపించుతుంది లే కోడలా, కోడి చప్పుడు విను. త్వరగా .. బిందెదగ్గరికి వెళ్ళు. కాళ్ళు చేతులు శుభ్రంగా కడుగు, పొయ్యి దగ్గరకు వెళ్ళి పొయ్యి కాళ్ళు మొక్కు. పొయ్యిలో ఉండే బుగ్గిని పారేయ్. పొయ్యిని శుభ్రం చేయ్. చీపుర్ దగ్గర వెళ్ళు. చీపుర్ కాళ్ళు మొక్కు. చీపుర్ చేతిలో పట్టి, ఇంటి శుభ్రం చేసి బయటికి వెళ్ళు. చేతిలో బింద పట్టి బావి దగ్గరి వెళ్ళు. బిందెను చక్కగా శుభ్రం చేసి నీళ్ళు పట్టుకొని రా.. పొద్దు వెళ్ళుతుంది. అని అత్తమ్మ పని చెప్పే పాట.

–ఆత్రం మోతీరామ్



# నేనేమౌతానో .....?

అకస్మాత్తుగా.....
ఎందుకో......
మనసంతా నిశబ్దం
మనస్సు కిటికీలోంచి
బయటికెల్తే
నువ్వెదురౌతావు

ఆకాశంకొమ్మ
పూల పరిమళానికి
తన్మయత్వంలో నేను

గాలి అలలమీంచి
చెరగని నీ చిరునవ్వు
పెదాల ఇంద్రధనస్సుల్లోంచి
నా కళ్ళలోకి
ప్రవహించినట్లు....

ఒక్కసారిగా
ఒక్కో చినుకు
వేల జలపాతాలై
నా మొహమ్మీద
కుమ్మరిస్తే ......
నిశబ్ద నదిలో
కొట్టుకుపోతున్న
ఒంటరి నావలా నేను

వెంటాడే చూపుల్ని
కురిపించే
అందానికే అందమా
లయ తప్పిన
నా గుండె పాడే
చిరుమువ్వల నాదమా.....

యుగాల అనుబంధమేదో
నా రక్తనాళాలను తట్టిలేపే
పురాఅనుభూతి నువ్వే

నువ్వలా......
గాలి అలలా.....
తాకితేనే ......
నేను
నువ్వయ్యాను
మరి
నేను నిన్ను తాకితే !
?????????????

-డాక్టర్ బాణాల శ్రీనివాసరావు
m : 9440471423
e : banala2005@gmail.com

DECCAN దక్కన్ CHANNEL
సామాజిక, సాంస్కృతిక ఛానల్



# మంచి సమాజం కోసం గొప్ప సాహిత్యం అవసరం

## తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి

## చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీలో బడిపిల్లలు రాసిన బాలచెలిమి కథల పుస్తకాలు ఆవిష్కరణ

మెదళ్లను కదలించే శక్తి ఒక్క సాహిత్యానికి మాత్రమే ఉంటుందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. బాలచెలిమి పిల్లల వికాస పత్రిక, చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ సంయుక్తాధ్వర్యంలో తెలంగాణ బడి పిల్లల కథల పుస్తకాల ఆవిష్కరణ సభ చిక్కడపల్లి కేంద్ర గ్రంథాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి హాజరై, సభకు అధ్యక్షత వహించారు. అనంతరం ఆయన తెలంగాణ పది జిల్లాల బడి పిల్లల కథల సంపుటాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బాలసాహిత్యాన్ని నిరంతరం పరిచయం చేసి, బాలలను సాహిత్యంవైపు మళ్లించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఎవరి అంతరంగాన్నైనా తెరిచి చూస్తే అందులో బాల్యమే ఉంటుందన్నారు. జ్ఞానం పెరుగుతున్న కొద్దీ మనిషి మంచి తనాన్ని కోల్పోతాడు అనడానికి చాలా ఉదాహరణలున్నట్లు చెప్పారు. అందరినీ ప్రేమించగలిగే వయసు బాలల సొంతం అన్నారు. ఎలాంటి అరమరికలు లేకుండా మెలిగే వయస్సు కేవలం బాలలకే ఉందన్నారు. చిన్నపిల్లలను చేరుకోవడం చాలా కష్టం అని, పెద్ద వాళ్లను మెప్పించడం చాలా సులువు అన్నారు. పిల్లలు అన్యాయం, దుర్మార్గాలను సహించరని, బాలవర్ధిరాజు, బాలనాగమ్మ కథలో తన తల్లిదండ్రులను బంధించిన మాయలఫకీర్ ప్రాణం ఏడేడు సముద్రాల ఆవల మరిచెట్టు తొర్రలో రామచిలుకలో ఉందని తెలిసి సాహసప్రాయణం చేసి చిలుకను చంపడం ద్వారా మాయలఫకీర్ ప్రాణం తీసి తల్లిదండ్రుల్ని విడిపించి వారి పట్ల ప్రేమను నిరూపించుకోవడమేకాక దుర్మార్గాన్ని ఎదిరించాడని చిన్నప్పటి నుండి ఆ కథ తనకు చాలా ఇష్టమని సిధారెడ్డి అన్నారు.

బాలచెలిమి ద్వారా 'పిల్లలను చేరుకోవడానికి ఎన్ని మార్గాలున్నాయో అన్ని మార్గాలను బాలచెలిమి వెతకడం శుభపరిణామం' అన్నారు. పిల్లలు రాసే కథలు ఎలా ఉండాలి, పెద్దలు రాసే కథలు ఎలా ఉండాలి అని చర్చించే వేదిక బాలచెలిమి అన్నారు. ఎవరు గొప్పవాళ్లు అంటే.. ఎవరితోవాళ్లు మాట్లాడుకొని, ఆనందంగా ఉండేవాళ్లు గొప్పవాళ్లన్నారు. అదే అత్యుత్తమమార్గం అన్నారు. శరీరం చెప్పదలచుకున్న విషయాలను వినాలని, అప్పుడే మనుషులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. బాలచెలిమి ముచ్చట్లు ఇప్పటి వరకు నిరంతరంగా 23 వరకు జరగడం శుభసూచకం అని, మరెన్నో ముచ్చట్లు వరకు కొనసాగాలని ఆకాంక్షించారు.

### గ్రంథాలయాలతో సమాజాభివృద్ధి :
### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ మణికొండ వేదకుమార్

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ తెలంగాణ సాహిత్య అకాడమి తెలుగు ప్రపంచ మహాసభల్లో బాల సాహిత్యానికి వేదిక కల్పించిన నందిని సిధారెడ్డికి కృతజ్ఞతలు తెలిపి, ఆ నెల నుండే బాలచెలిమి ముచ్చట్లు ప్రారంభం చేసామన్నారు. తెలంగాణలోని 33 జిల్లాల నుండి 882కిపైగా బడి పిల్లలు రాసిన బడి పిల్లల కథలను ఎంపిక చేసి తాము పుస్తక రూపంలో తీసుకురావడం చాలా సంతోషం అన్నారు. 33 జిల్లాల్లో బాలచెలిమి గ్రంథాలయాలు ఏర్పాటు చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, ఇప్పటికే భూదాన్ పోచంపల్లి – యాదాద్రి జిల్లా, జల్లిపల్లి – ఖమ్మం జిల్లా, తడపాకల – నిజామాబాద్ జిల్లాలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బాలచెలిమి ముచ్చట్లు ఒక్క హైదరాబాద్‌కే పరిమితం కాకుండా తెలంగాణలోని అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్నామని, ఇప్పటి వరకు 22 బాలచెలిమి ముచ్చట్లు జరిగాయని, వీటన్నింటినీ త్వరలో పుస్తకం రూపంలో తీసుకొస్తున్నట్లు చెప్పారు. పిల్లల వికాసం మరియు అభివృద్ధిలో భాగం పంచుకోవడమే తమ కర్తవ్యం అన్నారు. పుస్తకపఠనం పట్ల పిల్లలకు

ఆసక్తి తీసుకురావడమే ధ్యేయంగా ఇలాంటి విభిన్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు.

**సొంత కల్పనలతో బాలలు కథలు రాయడం శుభపరిణామం : రచయిత్రి డా.ముదిగంటి సుజాతారెడ్డి**

తమ చిన్నతనంలో అమ్మమ్మ లేదా నాన్నమ్మ ఆరణాలు ఇస్తే చందమామ పుస్తకాలు కొనుక్కొని చదువుకున్నట్లు రచయిత్రి డా.ముదిగంటి సుజాతరెడ్డి పేర్కొన్నారు. కొంతకాలం కింద తెలుగు విశ్వవిద్యాలయం బాలసాహిత్యంలో ఎవరికి అవార్డు ఇవ్వాలంటే చాలా ఆలోచించాల్సి వచ్చేదన్నారు. కానీ క్రమక్రమంగా బాలసాహిత్యానికి ఆదరణ లభిస్తుందన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి బాల సాహిత్యానికి ప్రత్యేక స్థానం కల్పించినట్లు తెలిపారు. నేడు బాలలు తమ సొంత కల్పనలతో మంచి కథలు రాయడం అమోఘం అన్నారు. వేదకుమార్ గారు పిల్లల కోసం బాలచెలిమి పుస్తకాలు, బడి పిల్లలు పుస్తకాలు అచ్చువేయడం అభినందించదగ్గ పరిణామం అన్నారు. పిల్లలు చదువుకునేందుకు పుస్తకాలు కొనాలని, పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. తద్వారా పిల్లలకు జ్ఞానం పెరగడంతోపాటు నీతి, నియమాలు పెరిగి సృజనాత్మక శక్తి పెరుగు తుందన్నారు. చిన్నప్పటి నుండే పిల్లల మనస్సు ఎదగాలంటే సాహిత్యంపై అవగాహన కలిగించాలన్నారు. జిల్లాల్లో చాలా మంది ఉపాధ్యాయులు కథలు, కవితలు, వ్యాసాలు రాయించడం ద్వారా బాలల అభివృద్ధికి బాటలు పరుస్తున్నట్లు చెప్పారు. ముందు ముందు పిల్లలు మంచి పుస్తకాలు చదవాలని, సృజనాత్మక రచనలు చేయాలని ఆకాంక్షించారు.



**పిల్లలు భిన్నంగా ఆలోచిస్తారు : కవి డా.అమ్మంగి వేణుగోపాల్**

పిల్లలకు దగ్గర అవ్వడం అంత సులువు కాదని, పిల్లల కోసం సాహిత్యం రాసేవాళ్లు పిల్లల వయస్సుకు వెళ్లి కథలు రాయాల్సి ఉంటుందని కవి డా.అమ్మంగి వేణుగోపాల్ అన్నారు. పిల్లలు చాలా స్వచ్ఛమైన హృదయం గలవారన్నారు. పిల్లలు రాసిన కొన్ని అద్భుతమైన కథలు గురించి వివరించారు. పిల్లలు తాము ఉంటున్న ప్రపంచం కంటే భిన్నంగా కలలు కంటున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తే మేటి రచయితలుగా రాణిస్తారన్నారు. ఇప్పుడు రాస్తున్న పిల్లలు ఇంకో ఇరవై, ముప్పై సంవత్సరాల తర్వాత గొప్ప రచయితలుగా ఎదుగుతారని, అప్పుడు వాళ్లకు వేదకుమార్ ఆదర్శ మూర్తిగా కనిపిస్తారన్నారు.

**పిల్లలు అద్భుత ప్రయోగాలు చేయగలరు : కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత చొక్కాపు వెంకటరమణ**

తనకు మూడేళ్లప్రాయంలోనే చందమామ కథలు వినే అదృష్టం కలిగిందని, తమ అక్క ద్వారా బాలల కథలు విని సాహిత్యంపై అవగాహన పెంచుకున్నట్లు కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత చొక్కాపు వెంకటరమణ అన్నారు. కొంచెం ఎదిగిన తర్వాత కథలు రాయడం, కథలు చెప్పడం మొదలుపెట్టినట్లు చెప్పారు. బాలసాహిత్యం తనను 1979లో ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ ప్రచురించే బాలచంద్రిక పత్రికకు ఎడిటర్‌ను చేసిందన్నారు. బాల రచయితలు రాస్తున్న కథలను ముద్రించి పాఠశాలలకు తీసుకెళ్లే అదృష్టం కలిగిందన్నారు. ఆ తర్వాత వేదకుమార్ బాలచెలిమి పత్రిక తీసేముందు తనకు గొప్ప అవకాశం ఇచ్చారని, అందులో సైన్స్ కథలు, వివిధ రకరకాల కార్టూన్ కథలు రాసేలా ప్రోత్సహించినట్లు చెప్పారు. పెద్దవాళ్లు కరెక్ట్‌గా చెబితే పిల్లలు అద్భుతంగా ప్రయోగాలు చేస్తారని వివరించారు. మొక్కలాంటి బడి పిల్లలకు వేదకుమార్ వేస్తున్న బీజాలు మరిచిపోలేనిదన్నారు. ఇరవై సంవత్సరాల క్రితం బాల సాహిత్యం రాసేవాళ్లు యాభై ఏళ్లపైబడి ఉన్నవాళ్లున్నారని తాను చాలా దిగులుపడ్డానని, ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా చాలా మంది బాలల కథల రచయితలు వెలుగులోకి రావడం సంతోషదాయకం అన్నారు. బడిపిల్లలు రాసే కథలకు చిత్రకారులు జిల్లాల వారీగా బొమ్మలు గీయడం చాలా సంతోష దాయకం అన్నారు.

**పిల్లలకు దయ్యాల కథలు నచ్చుతాయి : బాలల కథా రచయిత మాచిరాజు కామేశ్వరరావు**

పిల్లలకు దయ్యాల కథల పట్ల ఆసక్తి ఎక్కువ అని చందమామలో అనేక దయ్యాల కథలు రాసిన బాల కథా రచయిత మాచిరాజు కామేశ్వరరావు తెలిపారు. అందులో మంచి దయ్యాలు, చెడు దయ్యాలు అంటూ వైవిధ్యంగా కథలు రాసినట్లు తెలిపారు. చందమామ సంపాదకులు కొడవటిగంటి కుటుంబరావు దయ్యాలు కథలు ఎక్కువగా రాయమని చెప్పినట్లు తెలిపారు. తన మొదటి కథకు పది రూపాయలు పారితోషకం ఇచ్చినట్లు చెప్పారు. ఈ బడిపిల్లల కథల్లో మంచిగా రాసిన పిల్లలకు వెయ్యి రూపాయల పారితోషకం ఇవ్వనున్నట్లు తెలిపారు.

బాలచిత్రకారులతో బొమ్మలు గీయిస్తా : ఆర్టిస్టు కూరెళ్ల శ్రీనివాస్

బాలచిత్రకారులను తయారు చేసి వాళ్ల చేత బడి పిల్లల కథల పుస్తకాలకు చిత్రాలు గీయించేలా కృషి చేస్తానని బాలచెలిమి చిత్రకారుల కార్యశాల కన్వీనర్, ప్రముఖ చిత్రకారులు కూరెళ్ల శ్రీనివాస్ అన్నారు. తమ బాల్యమంతా చందమామ లాంటి పుస్తకాలతో గడిచిందన్నారు. బాల సాహిత్యం పుస్తకాలు చదివి ఉన్నతంగా ఎదిగినట్లు తెలిపారు. బాలసాహిత్యం ద్వారా పిల్లలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ పది పుస్తకాలకు వివిధ జిల్లాల నుంచి చిత్రకారులను పిలిపించి కార్యశాల నిర్వహించి బొమ్మలు గీయించటం తనకు, చిత్రకారులకు అద్భుతమైన అనుభవాన్ని,

ఆనందాన్ని ఇచ్చింది బాలచెలిమి మరియు చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీయే అన్నారు. ఇది మా తదనంతర చిత్రకళ అభినివేశానికి దోహదం చేస్తుందన్నారు.

**పిల్లల సాహిత్యానికి పాఠశాల నుండే పునాది : పైడిమర్రి గిరిజ**

పిల్లల సాహిత్యానికి పాఠశాలలోనే పునాది పడాలని పైడిమర్రి గిరిజ అన్నారు. తమ పిల్లలు రచయితలు కావాలని గాఢంగా నమ్మినట్లు తెలిపారు. నిజానికి బెస్ట్ టీచర్ అవార్డు వచ్చినదానికంటే తమ పిల్లలు కథలు రాసినప్పుడే ఆనందం కలుగుతుందన్నారు. పిల్లల కథల్లో మానవ విలువలు, ప్రకృతికి సంబంధించిన కథలు, పర్యావరణానికి సంబంధించిన కథలు, సమాజానికి సంబంధించిన కథలు ఇలా ఎన్నో ఉన్నట్లు చెప్పారు. పిల్లలు రాసే నీతి కథలను వెలుగులోకి తీసుకొస్తే భారతదేశం గర్వించే రచయితలు అవుతారని చెప్పారు.

జిల్లా కన్వీనర్లు తోకల రాజేశం, ఘణపురం దేవేందర్, సిరిసిల్ల గఫూర్ శిక్షక్, కూకట్ల తిరుపతి, డా.వాసరవేణి పరశురాం, దండ్రె రాజమౌళి, డా.అమ్మిన శ్రీనివాసరాజు, ఉండ్రాళ్ల రాజేశం, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, డా.భీంపల్లి శ్రీకాంత్, డా.తెలుగు తిరుమలేశ్, డా.బెల్లంకొండ సంపత్‌కుమార్, పైడిమర్రి గిరిజ, పైడిమర్రి రామకృష్ణ గార్లకు, చిత్రకారులు కూరెళ్ల శ్రీనివాస్, కైరంకొండ బాబు, మర్రిపల్లి రమేష్, టి.వి.రామకిషన్, హస్మతుల్లా, పర్కపల్లి యాదగిరి, సి.హెచ్.వెంకటరమణ, టి.భూపతి, వడ్డేపల్లి వెంకటేష్, ఎల్.నరేందర్, బీర శ్రీనివాస్, కె.రాఘవచారి, కేసగాని అజయ్ గార్లకు, ఇందులో కథలు రాసిన బాలరచయితలకు, ఈ పది పుస్తకాలు వెలువడటంలో వారి కృషిని, సహకారాన్ని అభినందిస్తూ పది పుస్తకాల కిట్‌ను జ్ఞాపికగా అందించి సత్కరించారు.

ఈ కార్యక్రమాన్నంతటినీ ఉండ్రాళ్ల రాజేశం సమన్వయపర్చగా, రాష్ట్ర కన్వీనర్ గరిపల్లి అశోక్ వందన సమర్పణ చేశారు.

ఈ కార్యక్రమంలో రచయితలు శాంతారావు, మాఢభూషి లలితాదేవి, సుతారపు వెంకటనారాయణ, ధనుంజయ, సి.హెచ్. మల్లేశం, ఉరిమళ్ల సునంద, జుగాష్‌విలి, జన విజ్ఞానవేదిక రాజా, తెలంగాణ సాహితి అనంతోజు మోహన్‌కృష్ణ, కట్టా ప్రభాకర్, ఖైజర్ బాషా, జమున, శైలజ తదితరులు పాల్గొన్నారు.

– కట్టా ప్రభాకర్
m : 8106721111
e: akumarkatta@gmail.com

# దేశానికో ప్రేమలేఖ



ఎప్పట్నించో రాద్దామనే ప్రయత్నం
సమీకరించుకుంటున్న ప్రేమతో
మొదలు తుదీ కోల్పోయాక
అక్షరాలన్నీ చెల్లాచెదరయ్యాయి.

తాతలిప్పుడే దిగొచ్చారు
ఒరే ఒరే ఏడాదికోసారన్నా
అలా... అలా కనబడి దణ్ణం పెడతారనుకుంటే
ఇదేంటీ???

మా సమాధుల్నించి మేమే బయటికి రావాలా?
నా వాళ్ళంతా పరాయివాళ్ళేనా?

ఏ మట్టి ముద్దనడిగినా
నా పాదాల గుర్తు చెబుతుందే
ఏ నీటి చుక్కనడిగినా
తడిబారిన గుండెను చూపుతుందే
ఏ అన్నం ముద్ద నడిగినా
పాలమారుతూ మమ్మల్నే చూపిస్తుందే
ఏమైందివాళ...

నాకు నేనే పరాయీకరణ చెందానెందుకు?
అన్ని పక్కటెముకల్నీ జతజేసి జతజేసి
అలిసి పోయాముర–

మా కష్టాల కొలిమిలోని
నిప్పురవ్వలు మీరంతా
ఇకనైనా మారండిరా
నోరూ, శరీరమూ, ప్రాణమూ
కోల్పోయిన మేము
ఆలోచన నుండి ఎలా తప్పుకోవాలి?

ఈ దేశపు ప్రేమ మట్టిలో
మేం జల్లిన విత్తనాల మొలకలు మీరంతా
మొక్కలు పెరుగుతున్న దశలో
కాపాడాల్సిన, పురుగుల మందు చల్లాల్సిన
నీటిచుక్కతో విత్తనం గొంతు తడపాల్సిందీ
మీరే

ఇది దేహానికి. లేఖ కాదురా
దేశానికే ప్రేమ లేఖ
మన ఉనికి. పోరాటం

–శిలాలోలిత
m : 9391338676

# పిల్లలను సాహిత్యంవైపు మళ్లించాలి

## తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి

## హిమాయత్‌నగర్ ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో బాలచెలిమి 23వ ముచ్చట్లు

బాల చెలిమి పిల్లల వికాస పత్రిక, చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ సంయుక్తాధ్వర్యంలో 'బాలచెలిమి' తెలంగాణా బడి పిల్లల కథలు తెలుగు రాష్ట్రాల బాల సాహితీవేత్తలు, చిత్రకారులు, బాలవికాస కార్యకర్తలు-అంతరంగాలు అనే అంశంపై 23వ బాలచెలిమి ముచ్చట్లు హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ పాఠశాలలో జనవరి 29న జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై.. ప్రసంగించారు. తాను బాలసాహిత్యం చదివి తయారైన రచయితను అన్నారు. తాను చదువుకున్న జిల్లా పరిషత్ పాఠశాల తనకు ఎన్నో అద్భుతమైన పాఠాలను నేర్పిందని, తను సాహిత్యకారుడు అయినందుకు చాలా సంతోషంగా ఉందని, పిల్లలను సాహిత్యంవైపు తీసుకొస్తే సమాజంలో చెడుపనులు జరగకుండా అడ్డుకోవచ్చన్నారు. మంచివాళ్లు ఎవరో, చెడువాళ్లు ఎవరో కూడా సాహిత్యం చెబుతుందని, బడి పిల్లల్లో మార్పు వస్తే సమాజంలో కూడా తప్పకుండా మార్పు వస్తుందన్నారు. పిల్లలు పాటలు పాడుతున్నా, కథలు రాస్తున్నా, బొమ్మలు వేస్తున్నా, క్రీడల పట్ల ఆసక్తి చూపినా వారికి ఆహ్వానం పలకాలన్నారు. సాంకేతిక పరికరాలు, మాదకద్రవ్యాలు ఇవాళ్టి తరాన్ని ఆవహించి ఉన్నాయని, ఆ ప్రభావం నుంచి పిల్లలను కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు. బాలచెలిమి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందించారు.



**బాలసాహిత్యమే భవితకు బాటలు పరుస్తుంది: చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ మణికొండ వేదకుమార్**

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ బాలసాహిత్యమే భవితకు బాటలు పరుస్తుందని, రెండు తెలుగు రాష్ట్రాల్లో బాల సాహిత్యాన్ని పెంపొందించేందుకు, పిల్లల వికాసాభివృద్ధికి బాలచెలిమి ముచ్చట్లు కార్యక్రమాలను నిర్విరామంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు బాలసాహిత్యం దోహదం చేస్తుందని, మంచి సమాజం ఆవిర్భవించాలంటే మంచి సాహిత్యం రావాల్సిన అవసరం ఉందన్నారు.

**రెండు తెలుగు రాష్ట్రాల్లో బడి పిల్లల కథలకు విశేషమైన గుర్తింపు: ప్రచురణల కన్వీనర్ గరిపల్లి అశోక్**

రెండు తెలుగు రాష్ట్రాల్లో బాలచెలిమి బడి పిల్లల కథలు ఒక సంచలనంగా మారాయని, వీటికి ఎంతో పేరు, ప్రతిష్టలు వచ్చాయని తెలుగు రాష్ట్రాల బడి పిల్లల కథల కన్వీనర్ గరిపల్లి అశోక్ అన్నారు. ఆ పిల్లలను ప్రోత్సహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు, జిల్లా కన్వీనర్లకు అభినందనలు తెలిపారు. జిల్లా కన్వీనర్లు కొంచెం చొరవచూపి బడి పిల్లల కథల పుస్తకాలకు విస్తృత ప్రచారం చేయాలన్నారు.

**మంచి టీమ్‌ను ఎంచుకొని చక్కని బొమ్మలు గీశాం: ప్రముఖ చిత్రకారులు కూరెళ్ల శ్రీనివాస్**

బాలచెలిమి కోసం దాదాపు డజన్‌మంది చిత్రకారులు పనిచేసినట్లు బాలచెలిమి చిత్రకారుల కార్యశాల కన్వీనర్, ప్రముఖ చిత్రకారులు కూరెళ్ల శ్రీనివాస్ అన్నారు. మంచి టీమ్‌ను ఏర్పాటు చేసుకొని మంచి ఆలోచనా విధానంతో కథలకు సరైన, చక్కని బొమ్మలు గీసినట్లు చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్రంలోని చిత్రకారులు టెస్ట్ బుక్స్ తయారు చేయడానికి రాత్రింబవళ్లు పనిచేసి వాటికి బొమ్మలు గీసినట్లు చెప్పారు. బాలసాహిత్యానికి బొమ్మలు గీయడం అనేది మామూలు విషయం కాదని, వంద ఉంటే వంద రకాలుగా ఆలోచించి బొమ్మలు గీయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంత మంది బడి పిల్లల కథలు చదవడం కూడా తమ అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ కథలకు బొమ్మలు వేసిన చిత్రకారులందరూ ఉపాధ్యాయులు కావడం చాలా సంతోషం అన్నారు.

**పిల్లలు భవిష్యత్‌లో గొప్పవాళ్లు కావాలి: ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి**

ప్రతి ఇంట్లో బాలలకు మంచి పుస్తకాలు కొనిచ్చి చదివించాలని, తెలుగు, హిందీ, ఇంగ్లీష్ డిక్షనరీలను కూడా పిల్లలచేత చదివించాలన్నారు. దీంతో పిల్లలు భవిష్యత్‌లో రచయితలు, మేధావులు, గొప్ప వ్యక్తులుగా ఎదిగే అవకాశం ఉందన్నారు. మనిషి జీవితంలో ఇష్టపడేది బాల్యం అన్నారు.

**బాలసాహిత్యానికి ఐకాన్ వేదకుమార్: భీంపల్లి శ్రీకాంత్**




తెలంగాణ నుండి నూతన సాహిత్యకారులను పరిచయం చేయడం గర్వకారణం అని, బాలసాహిత్యానికి ఐకాన్ వేదకుమార్ అని భీంపల్లి శ్రీకాంత్ అన్నారు. ప్రభుత్వం చేసే పనిని వేదకుమార్ తన భుజాలమీద వేసుకొని చేయడం అభినందనీయం అన్నారు.

**పిల్లల కథలకు బొమ్మలు గీయడం చాలా సంతోషంగా ఉంది: ఆర్టిస్టు బీర శ్రీనివాస్**

బాలచెలిమి పిల్లల కథలకు బొమ్మలు గీయడం చాలా సంతోషంగా ఉందని, పిల్లల్లో అద్భుతమైన శక్తులు దాగి ఉన్నాయని చిత్రకారులు బీర శ్రీనివాస్ అన్నారు. కొన్నిసార్లు పిల్లలు చేస్తున్న పనులను చూస్తే పెద్దవాళ్లు సైతం ఆశ్చర్యపోతారన్నారు. బాలసాహిత్యానికి, చిత్రాలకు విడదీయలేని సంబంధం ఉందన్నారు. పిల్లలు నేడు గొప్ప కథలు రాయడం, వాటిని పుస్తక రూపంలో తీసుకురావడం గర్వకారణం అన్నారు. తాను బాలచెలిమికి బొమ్మలు గీస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు.

**బాలచెలిమి ముచ్చట్లు ఒక యజ్ఞంలాంటి కార్యక్రమం: ఉపాధ్యాయులు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి**

బాలచెలిమి ముచ్చట్లు ఒక యజ్ఞంలాంటి కార్యక్రమం అని ఉపాధ్యాయులు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి అన్నారు. ఎవరైతే శ్రద్ధ పెట్టి కథలు రాస్తారో వాళ్లు గొప్పవాళ్లు అవుతారని చెప్పారు. పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు చాలా కథలు వచ్చి ఉండాలన్నారు. ఈ రోజుల్లో ఎంత బిజీగా ఉన్నా పిల్లల సాహిత్యం కోసం బాలచెలిమి చేస్తున్న కృషి అమోఘం అన్నారు.

**బాలచెలిమి కోసం పరితపిస్తారు: సుతారపు వెంకటనారాయణ**

బాలచెలిమి అంటే వెంటనే గుర్తొచ్చే పేరు వేదకుమార్ అని, బాలచెలిమి కోసం పరితపించి, ఎంతో ఖర్చును భరించి బాలచెలిమిని తీసుకురావడం చాలా సంతోషం అని సుతారపు వెంకటనారాయణ అన్నారు. భూదాన్‌పోచంపల్లిలో చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ, బాలచెలిమి ప్రారంభించిన తొలి బాలచెలిమి గ్రంథాలయం విజయవంతంగా నడుస్తుందని, పిల్లలు దీనికి బాగా వినియోగించుకుంటున్నారని అన్నారు.

**కమర్షియల్ ఆర్టిస్టు నుండి క్లాసికల్ ఆర్టిస్టుగా మార్చారు: ఆర్టిస్టు కె.రాఘవాచారి**

తాను ఇప్పటి వరకు కమర్షియల్ ఆర్టిస్టుగా పనిచేశానని, కూరెళ్ల శ్రీనివాస్ సహకారంతో సృజనాత్మక చిత్రకారునిగా మారినట్లు ఆర్టిస్టు కె.రాఘవాచారి తెలిపారు. బాలచెలిమిలో బొమ్మలు గీయడం అనేది తన జీవితంలో మరుపురాని అనుభూతి అన్నారు.

**కథకు సందర్భోచితంగా బొమ్మలు గీయాలి: ఆర్టిస్టు కైరంకొండ బాబు**

పిల్లలు రాసిన కథల పుస్తకంలో తాను బొమ్మలు గీయడం చాలా సంతోషంగా ఉందని ఆర్టిస్టు కైరంకొండ బాబు అన్నారు. బొమ్మలు వేయాలంటే పిల్లల్లాగ ఆలోచించి బొమ్మలు గీయాల్సిన అవసరం ఉందన్నారు. కథకు సందర్భోచితంగా ఊహించి బొమ్మలు గీసినప్పుడే దానికి సార్థకత లభిస్తుందన్నారు.

**సాహిత్యాన్ని వెలికితీసేందుకు కృషి : మాడభూషి లలితాదేవి**

బాలచెలిమి పెట్టడం వల్ల వేదకుమార్ చాలా మంచి పని చేశారని, ఆయన చేసిన గొప్ప కార్యక్రమాల్లో ఇది ఒకటిగా మిగిలిపోనుందని లలితాదేవి అన్నారు. దీనివల్ల ఎంతో మంది వెలుగులోకి వస్తున్నట్లు చెప్పారు. ఇది పిల్లలకే కాదు, పెద్దలకు కూడా చాలా ప్రోత్సాహకంగా ఉందన్నారు. మనలోనూ, పిల్లల్లోనూ దాగిన సృజనాత్మకతను వెలికితీయడానికి బాలచెలిమి చేస్తున్న కృషి అమోఘం అన్నారు.

**బాలల కథల ద్వారా తన బాల్యం గుర్తొచ్చింది : పర్శపల్లి యాదగిరి**

బాలలు రాసిన కథలు చదువుతుంటే తన బాల్యం గుర్తొచ్చిందని, బాలలు రాసిన కథలు చాలా బాగున్నాయని చిత్రకారులు పర్శపల్లి యాదగిరి అన్నారు. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చేస్తున్న కృషిలో అందరూ భాగస్వాములు కావడం గర్వకారణం అన్నారు. పిల్లలు ఆలోచింపజేసే బాలసాహిత్యం రావాలని ఆకాంక్షించారు.

**కథలు రాయడం వల్ల పిల్లల మానసికశక్తి పెరుగుతుంది: ఉపాధ్యాయురాలు పులి జమున**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర పాఠశాల నుండి 70 మంది పిల్లలు కథలు రాశారని ఉపాధ్యాయురాలు పులి జమున అన్నారు. తమ పిల్లలు రాసిన కథలు అత్యధికంగా సెలక్ట్ కావడం గర్వకారణం అన్నారు.పిల్లలు బాగా ఆలోచించి కథలు రాయడం వల్ల వారి మానసికశక్తి పెరుగుతుందన్నారు. ఆగస్టు 15న 70 మంది

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసినట్లు చెప్పారు. కథలు రాయడం వల్ల పిల్లలకు ఏదైనా సమస్య వచ్చినా వారే పరిష్కరించుకునే తెగువ వచ్చిందన్నారు.

**పిల్లల్లో ఎంతో జ్ఞానం ఉంది: చిత్రకారులు రామకృష్ణ**

పిల్లలను చిన్నపిల్లలు అని చూడాల్సిన పనిలేదని, పిల్లల్లో అనేక రకాల జ్ఞానం ఇమిడి ఉందని చిత్రకారులు రామకృష్ణ అన్నారు. పిల్లలకు ఆలోచనాశక్తి చాలా ఉందని, వారిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిత్యం ప్రోత్సహించాలన్నారు.

**బాలల ప్రపంచం సృష్టించబడుతుంది: డా.ఎస్.రఘు**

పిల్లలచేత కొత్త ప్రపంచం ఆవిష్కరించబడటం, మంచి సాహితీ వాతావరణాన్ని చిల్డ్రన్స్ ఎడ్యుకేషనన్ అకాడమీ తీసుకురావడం అభినందనీయమని డా.ఎస్.రఘు అన్నారు.పిల్లల పుస్తకాలకు ప్రధానమైన ఆకర్షణ బొమ్మలే అన్నారు. బాలల కథల పుస్తకాలకు చిత్రకారులు తొందరగా బొమ్మలు గీయడం సంతోషదాయకం అన్నారు. కొత్త కథాంశంతో నూతనంగా బాలలు కథలు రాయాలని ఆకాంక్షించారు. ఇవి గాలికి ఎగిరిపోయే ముచ్చట్లు కాదని, ఇవి శాశ్వతంగా నిలిచిపోయే ముచ్చట్లు అన్నారు.

**బాలలు సృష్టించే సాహిత్యం గొప్పది : శాంతారావు**

బాలలు సృష్టించే సాహిత్యం చాలా గొప్పదని, తెలియకుండానే సహజమైన చిత్రాలు గీయడం ద్వారానే పిల్లలు తమ శక్తిసామర్థ్యాలను వెల్లడిస్తారని శాంతారావు అన్నారు. ప్రతి పిల్లవాడి అంతర్ముఖంలోంచి వచ్చిన అద్భుతాలే చిత్రాలు లేదా సాహిత్యం అన్నారు. పిల్లలు రాసిన మంచి కథలను బయటి ప్రపంచానికి తెలియపరుస్తునందుకు బాలచెలిమికి ధన్యవాదాలన్నారు. పిల్లలు రాస్తున్న కథలు నలుగురికి చెబుతారని, తద్వారా వాళ్లు నూతన ప్రపంచంవైపు ఆనందంగా అడుగులు వేస్తారని చెప్పారు. సృజనశీలమైన కళ ద్వారా సాహిత్యానికి కొత్త ఒరవడి తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

**బాలచెలిమి కథలకు బొమ్మలు వేయడం సంతోషం: వడ్డేపల్లి వెంకటేష్**

పిల్లలు రాసిన కథలకు తాము బొమ్మలు గీసినందుకు చాలా సంతోషిస్తున్నట్లు వడ్డేపల్లి వెంకటేష్ అన్నారు. తాము నల్గొండలో కొన్ని సందర్భాల్లో వివిధ కథలకు బొమ్మలు గీశానని, ఎక్కువగా కార్టూన్స్ గీయడమంటేనే ఇష్టం అన్నారు. తాను ఇప్పటి వరకు జరిగిన 22 బాలచెలిమి ముచ్చట్లు మిస్ కావడం బాధాకరం అన్నారు. పిల్లల కోసం బాలచెలిమి చేస్తున్న కృషి మర్చిపోలేనిదన్నారు.

**మూడు తరాల నుండి మణికొండ ఫ్యామిలీతో అనుబంధం : రిటైర్డు హెచ్ఎం ధర్మపురి లక్ష్మణ్‌స్వామి**

మూడు తరాల నుండి మణికొండ ఫ్యామిలీతో తమకు అవినాభావ సంబంధం ఉందని రిటైర్డు హెచ్ఎం ధర్మపురి లక్ష్మణ్‌స్వామి పేర్కొన్నారు. బాలచెలిమి మొదటి సంచికను తాను 1990లో చూసినట్లు తెలిపారు. బాలసాహిత్యం పెంపొందించడంకు ఇతరులకు సాధ్యం కాని రీతిలో వేదకుమార్ వైవిధ్యంగా మంచి కార్యక్రమాలు చేయడం గర్వకారణం అన్నారు.

**చిన్నారులకు బొమ్మలు గీయడమంటే మహాసరదా : ఉండ్రాళ్ల రాజేశం**

23వ బాలచెలిమి ముచ్చట్లకి సమన్వయకర్తగా వ్యవహరించిన ఉండ్రాళ్ల రాజేశం మాట్లాడుతూ చిన్నారులకు బొమ్మలు గీయడమంటే మహాసరదా అని, ఎంతో అందంగా, మరెంతో వైవిధ్యంగా బొమ్మలు గీసి అద్భుతాలు సృష్టిస్తున్నట్లు చెప్పారు. పిల్లల ప్రపంచం ఎంతో గొప్పదని, ఆ ఊహా ప్రపంచం నుంచి కథలు రాస్తారని, బొమ్మలు గీస్తారని చెప్పారు.

**భావితరానికి మంచి మార్గదర్శకులుగా నేటి పిల్లలు: ఉపాధ్యాయురాలు ఉరిమెళ్ల సునంద**

పిల్లల కోసం ఇంత చక్కని కృషి చేస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు అని ఉపాధ్యాయురాలు, రచయిత్రి ఉరిమెళ్ల సునంద అన్నారు. పిల్లలను గుర్తించి వారిని ప్రోత్సహించడం అనేది చాలా గొప్ప విషయమని, తమ పాఠశాలలో పిల్లలచేత కథలే కాదు, కవితలు కూడా రాయిస్తున్నట్లు చెప్పారు. పఠనం అనేది చాలా అవసరమైనదని, మంచి మార్గదర్శకులుగా పిల్లలు తయారు కావాలంటే చిన్నప్పటి నుండే సాహిత్యంపై మక్కువ కలిగించాలన్నారు. ఖమ్మం జిల్లా కథల్లో తమ పాఠశాల నుండి నలుగురు ఎంపిక కావడం గర్వకారణం అన్నారు. తమ పాఠశాల విద్యార్థి రాసిన కథకు జాతీయస్థాయిలో కన్సలేషన్ బహుమతి సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

**తెలుగు ఉపాధ్యాయులు ప్రవీణ్ శర్మ**

తాను 2012లో బదిలీపై నిజామాబాద్‌లో ఒక పాఠశాలకు వెళ్లానని, అప్పటి నుంచి ఆ పిల్లల చేత ఎక్కువ పుస్తకాలను చదివించినట్లు తెలుగు ఉపాధ్యాయులు ప్రవీణ్ శర్మ తెలిపారు. తమ పాఠశాలలో పిల్లలచేత పుస్తకాలు చదివించి ఎంతో ప్రోత్సహించినట్లు తెలిపారు. తమ గ్రామం తడపాకలో ఎం.వేదకుమార్ 50 వేల రూపాయల విలువగల విలువగల పుస్తకాలతో బాలచెలిమి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషదాయకం అన్నారు.

**ఎంత మంచి కథలు రాస్తే సమాజం అంత అభివృద్ధి : గుళ్లపల్లి తిరుమల క్రాంతికృష్ణ**

సమాజంలో కవులు ఎంత మంది తయారైతే అంత మంచిదని, తద్వారా సమాజం ఎంతో పురోగమిస్తుందని గుళ్లపల్లి తిరుమల క్రాంతికృష్ణ అన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు పిల్లలపై ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. పిల్లలపై తల్లిదండ్రులు ఎక్కువగా శ్రద్ధ పెట్టినట్లయితే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. అప్పట్లో బాలసాహిత్యంపై పెద్దగా అవగాహన ఉండేది కాదని, ఇప్పుడు ఎంతో మంది బాలసాహిత్యంపై అవగాహన పెంచుకొని విభిన్నమైన సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకురావడం సంతోషదాయకం అన్నారు. బాలసాహిత్యంపై చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ చేస్తున్న కృషి అమోఘం అన్నారు.

ఉదయం జరిగిన పుస్తకావిష్కరణకి వచ్చిన ఆహుతులందరూ ఈ కార్యక్రమానికీ విచ్చేసి బాలచెలిమి ముచ్చట్లలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ఖైజర్ భాషా వందన సమర్పణ చేశారు.

– జుగాష్‌విలి, m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# జీదిమాజా ఒక ప్రపంచ కవి

**2018** అక్టోబర్‌లో చైనాలోని బీజింగ్ నార్మల్ యూనివర్సిటీ వారి ఆహ్వానం మేరకు నేను చైనా వెళ్ళాను. 22 సాయంత్రం స్వాగత విందు (welcome Banquet) లో మొదటిసారి చైనీస్ మహాకవి జీదిమాజా (Jidi Majia) ను చూశాను. మనిషి స్ఫురద్రూపి, అందగాడు. ఆయన సాన్నిధ్యం వల్ల కడుపుకే కాదు కంటికీ విందు చేకూరినట్లనిపించింది.

జీదిమాజా చైనాలోని 55 ఆదివాసీ తెగల్లో ఒకటైన 'యీ' తెగకు చెందినవాడు. ఆ తెగలో 90 లక్షల మంది జనాభా. ఆయన కవిత్వం 20 అంతర్జాతీయభాషల్లోకి అనువాదమైంది. వాటిలో స్పానిష్, ఫ్రెంచ్ ఉండక తప్పదు గదా! 30 దేశాల్లో ఆయన కవిత్వానికి విశేషఖ్యాతి లభించింది. ఆయనకు ప్రపంచస్థాయి అవార్డులెన్నో లభించాయి. ఒక్క నోబెల్‌ప్రైజ్ తప్ప. ప్రస్తుతం చైనారచయితల సంఘానికి ఉపాధ్యక్షుడిగా (Vice-Chairman), సెక్రటరీజనరల్‌గా ఉన్నాడు ఆయన అందరితో ఆప్యాయంగా మాట్లాడుతున్నాడు. ఆ విందులో ఆయనొక పాట పాడాడు. అది 'యీ' జానపదగీతం అయి వుంటుంది. ఆ పాటతో ఆ హాలులోని గాలికి ప్రాణం వచ్చినట్టు అనుభూతి. మన ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ గుర్తుకొచ్చాడు. నేను నాతో తీసికెళ్ళిన నా 'జీవనభాష' కవితా సంపుటి ఆంగ్లానువాదాన్ని (Life Speaks) ఆయనకు బహూకరించి ఫోటో దిగాను.




మరునాడు లూషన్ ఇనిస్టిట్యూట్ (Lu Xun Institute) లో కవితా పఠనం జరిగింది. కార్యక్రమం అనంతరం ఆవరణలో ఓ చెట్టు కింద నిల్చున్నప్పుడు 'గాబీ' అని కేక వినపడింది. (చైనీస్ ఉచ్చారణలో నా పేరు) చూస్తే జీదిమాజా. ఆయన తన అసిస్టెంట్లను పురమాయించి తన 3 అనువాద గ్రంథాలను ఓ అట్టపెట్టెలో పెట్టినవి నాకు బహూకరించాడు. 'నీకు విమానం లగేజీ బరువౌతుందేమో' అన్నాడు. ఆ గ్రంథాలు 7, 8 కిలోల బరువుంటాయి. మిగిలిన సామాను ఇక్కడ వదిలేసి అయినా వీటిని తీసుకపోతానన్నాను. ఆయన ఒక్క ప్రసన్నహాసం చాలు ఆ రాబోయే బరువును తేలికపర్చడానికి. నేను తప్పకుండా ఆయన కవితలను నా మాతృభాష తెలుగులోకి అనువాదం చేస్తానన్నాను. చైనా నుంచి నాకిదొక మంచి కానుక.

జీదిమాజా 2007 నుండి చైనాలో గొప్ప సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడు. 1) క్వింగాయ్ అంతర్జాతీయ కవిత్వోత్సవం 2) క్వింగాయ్ కవుల టెంట్ ఫోరం 3) జియాంగ్ క్వింగ్వాయ్ లేక్ కవుల వారోత్సవం వగయిరా.

60 యేళ్ళయినా నిండని ఈ మహాకవి (1961) ఎక్కడో నైరుతీ చైనాలోని మారుమూల లింగ్‌షాన్ పర్వత ప్రాంతాల్లో జన్మించాడు. దీనిని ఆనుకునే మనోహరమైన క్వింగాయ్ సరస్సు. ఇక్కడ ఆదివాసీలు మాట్లాడేదే 'యీ' భాష. ఇది బర్మీస్, టిబెటన్ భాషలకు దగ్గరగా వుంటుంది. లింగ్‌షాన్ ప్రాంతం కొండలతో, పీఠభూములతో, లోయలతో, నదులతో, సరోవరాలతో ప్రకృతి రామణీయకానికి పెట్టింది పేరు. జీదిమాజా కవిత్వానికి భిత్తికను సమకూర్చింది ఈ నేపథ్యమే. ఒక రకంగా ప్రాకృతిక ప్రాంతాలే ఆయన కవిత్వంలోని పాత్రలు. 'యీ' తెగలోని పూర్వులు వాటికి ప్రాణం పోసిన ఆకాంక్షలు, విశ్వాసాలు, జ్ఞాన నిధులు. ఒక్కమాటలో చెప్పాలంటే గొప్ప మానవీయ ప్రతీకలు. అక్కడి చావుపుట్టుకలు, కష్టసుఖాలు, రుతువులు, పక్షులు, చెట్లు, పువ్వులు వీటన్నింటిలో జీదిమాజా ఒక బృహత్ జీవనాటకాన్నే దర్శించాడు. అదే ఆయన కవిత్వానికి జీవధాతువు. పట్టణ కవిత్వమే ఆధునికం అనుకునే కాలంలో ఈ మహాకవి ప్రాక్తన జీవన విధానంలోని తేజస్సును ఆధునికంగా మార్చి అలరించాడు.

జీదిమాజా రచనలు రాశిలోనూ రాసిలోనూ ప్రశస్తమైనవి. కవితా సంపుటాలు, దీర్ఘకవితలూ వగయిరా. 'స్నోలియోపార్డ్, రివర్' లాంటి కావ్యాలు ఎంతో ప్రసిద్ధి పొందాయి. వీటిని విఖ్యాత అమెరికన్ కవి దేనిస్ మేయర్ ఆంగ్లంలోకి అనువాదం చేశాడు. ప్రస్తుత "The Enduring One" కూడా ఆయన చేసిందే. మేయర్ అనువాదం ఆధారంగానే నేనీ పుస్తకాన్ని తెలుగులోకి అనువదించాను.

ఇక్కడో విషయం చెప్పాలి. ప్రపంచంలో ఒక్కో దేశానికి ఒక్కో ప్రధాన భాష వుంటుంది. ఆ దేశం పేరు చెప్పగానే ఆ భాషే గుర్తుకొస్తుంది. చైనాలో చైనీస్ భాషను 90% ప్రజలు మాట్లాడతారు. దాని గుర్తింపు అదే. జర్మన్, ఫ్రెంచి, డేనిష్, రష్యన్ మొదలైన భాషల సంగతీ అంతే. ఇండియా దగ్గరికొచ్చేసరికి ఇది అనేక భాషల సమాహారం. వందలాది చిన్నచిన్న భాషలు కాకుండా సాహిత్య అకాడమీ గుర్తించినవే 24కు పైగా వున్నాయి. ఆ రకంగా ఇండియా అనగానే ఒకే భాష గుర్తుకురాదు. బయట హిందీ గురించి కొంత విని ఉన్నారు. తెలుగు గురించి తెలియదు.

తెలుగు దక్షిణ భారతదేశానికి చెందిన నాగరిక భాష అనీ, దీనికి వెయ్యేండ్లకు పైగా సాహిత్య చరిత్ర వుందనీ, తెలుగు మాట్లాడే రాష్ట్రాలు రెండున్నాయనీ, 10కోట్లమంది తెలుగువారున్నారనీ అమెరికా, దక్షిణాఫ్రికా, మారిషస్, మలేషియా, ఫిజీ మొదలైన దేశాల్లో స్థిరపడినవారిని కలిపితే 12 కోట్లు అవుతారనీ బయటి ప్రపంచానికి తెలియదు. నేనీ పుస్తకాన్ని అనువదించడానికి కారణాల్లో తెలుగు గురించి ఇతరులకు తెలియాలనే ఉద్దేశం కూడా ఒకటి.

ఈ సంపుటిలో 103 చిన్న పద్యాలున్నాయి. ముక్తకాలివి. పరిమాణంలో చిన్న పద్యాలే కాని సాంద్రత, గాఢత వల్ల జీవితమంత పెద్దవి. పైన నేను చెప్పిన చైనీయ ఆదివాసీల ప్రాక్తన కాల పౌరాణిక వృత్తాంతాలు, మానవీయ స్పందనలు, ప్రకృతిలోని మార్మిక రహస్యాలు, వెరసి అద్భుతమైన కవితాశక్తి వీటిలో కనిపిస్తాయి. వీటిని నేను వివరించనక్కరలేదు. వేటికవే స్వయంసుబోధకాలు, రమణీయార్థ ప్రతిపాదక శోభితాలు. జీదీమాజా రచనలు మరిన్ని తెలుగులోకి అనువదించడానికి ఈ పుస్తకం నాకెంతో ప్రేరణ కలిగిస్తున్నది. ఈ అనువాదం విషయంలో నన్ను ఉత్సాహపరిచిన నా పరమమిత్రుడు, గుజరాతీ, ఆంగ్ల కవీంద్రుడు దిలీప్ ఝువేరి (ముంబయి) గారికి కృతజ్ఞతలు చెప్పకుండా ఉండలేను. ఆయన జీదీమాజా కవిత్వాన్ని గుజరాతీలోకి తీసికెళ్ళారు. ఆయనకన్నా ముందు జీదీమాజా సారస్వతాన్ని పశ్చిమ దేశాల్లోకి తీసికెళ్ళిన జామీ ప్రాక్టర్‌రూను కూడా నేనీ సందర్భంగా స్మరించక తప్పదు. నా చైనా యాత్రను రూపకల్పన చెయ్యటంలో ఆమె పోషించిన భూమిక విలువైనది. ఆమె ఉభయ భాషా ప్రవీణ (ఇంగ్లీషు, చైనీస్), ఇరు దేశాల్లో పౌరసత్వం గల అరుదైన వనితామణి. అలాగే నా అనువాదం చిత్తుప్రతిని చదివి చక్కని సూచనలు చేసిన అగ్రశ్రేణి కవీ, రచయితా నాకెంతో ఆత్మీయులు విహారిగారికి నా ధన్యవాదాలు.

–డా॥ ఎన్.గోపి ద

## మహబూబ్ నగర్ జిల్లా బాలచెలిమి బడిపిల్లల కథలు ఆవిష్కరణ




ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని బాలచెలిమి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాసిన "మహబూబ్ నగర్ జిల్లా బడిపిల్లల కథలు" కథల సంకలనాన్ని ఫిబ్రవరి 7న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సమగ్ర శిక్షా అభియాన్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఉషారాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కథలు రాయడం అభినందించదగ్గ విషయమని భవిష్యత్తులో ఇలాంటి సందేశాత్మక కథలు రాసి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని అన్నారు. బాలల కథలను ప్రచురించిన చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ, హైదరాబాద్ వారిని, విద్యార్థులను ప్రోత్సాహించిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలచెలిమి బాలల కథల ఉమ్మడి జిల్లా కన్వీనర్ డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, ఎం.ఎన్.విజయకుమార్, పులి జమున, టి.అంబుజ, శోభారాణి, బాల కథా రచయితలు పాల్గొన్నారు.













చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో బాలచెలిమి ప్రచురించిన 'గాడిద తెలివి', 'అంతరిక్ష దొంగలు' (2018 నవంబర్), 'గుల్లేరు బాలుడు', 'టంగ్ యంగ్' (2018 డిసెంబర్) అనే నాలుగు కథల పుస్తకాలు వెలువడినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నాము. ప్రతులు కావల్సిన వారు ఈ క్రింది చిరునామా నుండి పొందవచ్చును.

విడి ప్రతి వెల: రూ.30/-

'Bhoopathi Sadan' 3-6-716, Street No.12, Himayathnagar, Hyderabad-500029, Telangana. Mob: 9030626288

మరియు

- Nava Telangana Manchi Pustakam
- Nava Chetana • Navodaya Book House

బాల చెలిమి పిల్లల మాసపత్రిక 52 పేజీలు రంగులతో మార్చి మాసం నుండి మీ చేతుల్లోకి.

# సంస్కృత సాహిత్యంలో డా. పెన్నా మధుసూదన్ సృజనాత్మక, పరిశోధనా వైదుష్యం

**2019** సంవత్సరం వెళ్తూ వెళ్తూ తెలుగువారి విద్వత్తును ప్రశంసిస్తూ సంస్కృత భాషలో 'ప్రజ్ఞాచాక్షుషం' కావ్యాన్ని రచించిన ఆచార్య పెన్నా మధుసూదన్‌కు కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారాన్ని అందించింది. తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి ప్రాంతవాసి మధుసూదన్ విద్యాయానం, సాహిత్య వ్యాసంగం అనేక మలుపులు తిరుగుతూ సాగింది. గ్రామీణ ప్రాంతంలో ప్రాథమిక విద్యను పూర్తి చేసిన మధుసూదన్‌ది పురోహిత కుటుంబం. పెన్నా నర్సింహాశర్మ, పెన్నా భారతీ దేవి దంపతులకు ఐదవ బిడ్డగా జన్మించిన వీరు బాల్యంనుండే భాషా, సాహిత్యాలపట్ల ఆసక్తిని పెంచుకున్నారు. ప్రాథమిక విద్యార్థి దశలోనే అక్కెనపల్లి గ్రామానికి చెందిన పండితులు అక్కెనేపల్లి అయోధ్యా రామయ్యగారి వద్ద వేద విద్యను నేర్చుకున్నారు. ఆ తరువాత పదవ తరగతి మహబూబ్ నగర్ జిల్లా బాదేపల్లిలో చదువుకోవాల్సి వచ్చింది. ఇంట్లోని ముగ్గురు అన్నయ్యలు, ఒక సోదరి సైన్స్ విభాగంలోకి వెళ్ళిపోయారు. 'సంస్కృతం నేర్చుకుంటావా' అని తండ్రి అడగగానే నేర్చుకుంటానని మధుసూదన్ అనడం వల్ల నేడు ఈ ఉన్నత స్థాయికి చేరుకోగలిగారు. ఉపాధ్యాయుడు కూడా అయిన తండ్రి తన కొడుకు ఏ రంగంలో రాణిస్తాడనేది ఆనాడే పసిగట్టగలిగారు. తండ్రి అంచనాలకు మించి ఎదిగిన సంస్కృత జ్ఞానశీలిగా డా. పెన్నా మధుసూదన్ ఈనాడు నిలబడ్డారు.




డా. పెన్నా మధుసూదన్ సంస్కృత విద్యాధ్యయనం సికిందరాబాద్‌లోని బోయిన్‌పల్లి శ్రీ వెంకటేశ్వర వేదాంతవర్ధినీ సంస్కృత కళాశాలలో పి.డి.సి మరియు బి. ఏ. న్యాయశాస్త్ర అధ్యయనంతో వేగం పుంజుకుంది. ఆ విద్యాకాలం వారి జీవితాన్ని స్వర్ణయుగంగా మార్చుకోవడానికి దారి చూపింది. బ్రహ్మశ్రీ మరిగంటి శ్రీ రంగాచార్య, బ్రహ్మశ్రీ కందాడై రామానుజాచార్య స్వామి వారిని ఆదర్శంగా తీసుకొని, ఆ గురువుల అద్భుత బోధనలతో సంస్కృత శాస్త్రాలను అధ్యయనం చేసారు. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడై స్వర్ణ పతకాన్ని అందుకున్నారు. అదే స్ఫూర్తితో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సంస్కృత శాఖలో ఎం.ఏ, ఎం. ఫిల్ పూర్తి చేసి రెండు గోల్డ్ మెడల్స్ అందుకోవడం విశేషం. ఎం. ఫిల్ పరిశోధనలో భాగంగా అభినవగుప్తుల గీతాభాష్య గ్రంథాన్ని విస్తృతంగా అధ్యయనం చేశారు.

ఎం.ఫిల్ పూర్తికాగానే సంస్కృత భాషా ప్రచారానికి పూనుకున్నారు. మహర్షి మహేశ్ యోగి గారి వేదిక్ యూనివర్సిటీ నెదర్లాండ్స్‌లో పనిచేయడానికి అవకాశం వచ్చింది. అక్కడ పనిచేస్తున్నప్పుడే కొత్త మార్గంలో వెళ్ళడానికి కావలసిన అధ్యాత్మిక ఆలోచనలకు బీజం పడింది. భావాతీత ధ్యానం నేర్చుకొని యోగ మార్గంలోకి ప్రవేశించారు. తనదైన అధ్యాత్మిక ప్రపంచాన్ని రూపొందించుకోవడానికి అవసరమైన జ్ఞానం దొరికిన శిక్షణాకాలంగా భావించారు. నిరంతరం తత్త్వచింతన చేసే ఒక స్వభావం సంతరించుకున్న మనిషిగా రూపుదిద్దుకున్నారు. నెదర్లాండ్స్ నుండి భారతదేశానికి వచ్చిన తరువాత సంస్కృతంలో పి.హెచ్ డి చేయడానికి యోగశాస్త్రాన్ని ప్రధాన పరిశోధనాంశంగా తీసుకున్నారు. పతంజలి యోగసూత్రాలపై, వ్యాసభాష్యం, నారాయణ తీర్థుల యోగ వ్యాఖ్యానం ప్రధానంగా స్వీకరించి లోతైన పరిశీలనల చేసి వ్యాఖ్యా నించారు. 1996లో పి.హెచ్ డి పట్టాను అందుకున్నారు. సిఫెల్ నుండి జర్మన్ భాషలో డిప్లమాను కూడా సాధించారు. హైద్రాబాద్ అరోరా డిగ్రీ కాలేజ్‌లో సంస్కృత అధ్యాపకుడిగా పనిచేస్తూ సాయం కాలాల్లో రామకృష్ణ మఠంలో సంస్కృతాన్ని బోధించేవారు.

డా. పెన్నా మధుసూదన్ ప్రైవేట్ అధ్యాపకుడిగా బాధ్యతలు నిర్వహిస్తూనే రచనావ్యాసంగాన్ని కొనసాగించారు. అవధాన కార్యక్రమాల్లో పాల్గొన్న అనుభవ ప్రేరణతో శ్లోకరచన వేగాన్ని పెంచారు. 'మద్గల చరిత' మనే రూపకాన్ని రచించారు. ఇదివారి తొలి సంస్కృత కృతిగా చెప్పవచ్చు. బ్రహ్మశ్రీ పుల్లెల వారి ఆదేశంతో స్కంధ పురాణం మొదటి భాగం అనువాదాన్ని, వారితో కలిసి ఆధ్యాత్మ రామాయణం అనువాదాన్ని పూర్తిచేశారు. అదే కాలంలో బ్రహ్మశ్రీ పాతూరి సీతారామంజనేయులుగారి చెంత శాస్త్ర సంప్రదాయాన్ని గ్రహించారు. బ్రహ్మశ్రీ జ్ఞాన సరస్వతి కందాడై రామానుజాచార్యుల వద్ద ఋషి హృదయాన్ని గ్రహించే మెలకువలను నేర్చుకున్నారు. 2000 సంవత్సరంలో మహారాష్ట్రలోని రామ్‌టెక్‌లో కాళిదాస సంస్కృత విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం వచ్చింది. అక్కడ ఉద్యోగిగా, సాహితీవేత్తగా మరింత ఉన్నతంగా ఎదగడానికి గొప్ప వేదికగా నిలిచింది. ఆ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్ లర్‌గా, రిజిస్ట్రార్ గాను బాధ్యతలను నిర్వహించిన స్థాయికి

చేరారు. ప్రస్తుతం అక్కడే భారతీయ దర్శన విభాగం డీన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

**సాహిత్య పురస్కార గ్రంథం 'ప్రజ్ఞాచాక్షుషం' :**

మహారాష్ట్ర విదర్భ ప్రాంతంలోని అమరావతి జిల్లాలోని ఒక కుగ్రామంలో 1881లో జన్మించిన 'గులాబ్ రావు మొహెూడ్' అనే జన్మత: అంధుడి జీవిత ఇతివృత్తమే 'ప్రజ్ఞాచాక్షుషం' కావ్యం. ఒక రైతు కుటుంబంలో ఏ మాత్రం అక్షర గంధంలేని ఇంట్లో నుండి వచ్చిన గులాబ్ రావు మొహెూడ్ తొమ్మిదవ నెలలో ఒక వ్యాధి బారినపడి చూపు కోల్పోయారు. చిన్నతనం నుండే దైవచింతనలో మునిగిపోయారు. వేద వేదాంతశాస్త్రాలను కేవలం వినడం ద్వారానే నేర్చుకున్నారు. అంతః ప్రజ్ఞతో అన్ని శాస్త్రాలసారాన్ని గ్రహించారు. ఆ తత్వశాస్త్ర వెలుగులో నూటా ముప్పైనాలుగు గ్రంథాలను వివిధ భాషలలో రచించారు. ముప్పైనాలుగో ఏట తుదిశ్వాస విడిచారు. అతి తక్కువ వయసులో విలువైన గ్రంథాలను అందించడంతో పాటు భక్తి సంప్రదాయాలకు, మానవీయ విలువలకు చైతన్యాన్ని, స్ఫూర్తిని ఇచ్చిన గులాబ్ రావు మహారాజ్ జీవితాన్ని అందరికీ తెలియజెప్పాలనే ఆశయంతో ఈ ప్రజ్ఞాచాక్షుషం కావ్యరచనకు పూనుకున్నారు. ఎనిమిది వందల యాభై శ్లోకాలతో, పద్దెనిమిది సర్గలు (అధ్యాయాలు)తో కవితాత్మక రీతిలో చెప్పిన ఈ కావ్యం ఈ పురస్కారానికంటే ముందే ఎందరో సహృదయులను ఆకర్షించింది. కావ్యమనేది స్వాత్మానందానికీ అన్నది నిజమైనా, సమాజం కోసం దాని విలువ చాలా ఉంది. తాను ఆనందిస్తూనే, సమాజంలో ఇతరులకు ఏ జీవనవిలువలను చూపగలిగే కావ్యాన్ని రచించగలిగినా దాని ప్రయోజనం నెరవేరుతుంది. ఈ ఆశయంతోనే డా. పెన్నా 'ప్రజ్ఞాచాక్షుషం' కావ్యాన్ని మొదలుపెట్టారు. ఇది సంస్కృత సాహిత్యంలో ప్రసాదగుణభరితంగా వైదర్భీరీతిలో సాగిన రచనగా పండితుల మన్ననలు పొందింది. గులాబ్ రావ్ మహాత్ముని తత్త్వజ్ఞానం అందరికి సరళంగా సుబోధకమయింది. అటువంటి విశిష్టమైన గ్రంథానికి అకాడెమీ పురస్కారం లభించడం ప్రశంసనీయం.



'ప్రజ్ఞాచాక్షుషం' కంటే ముందే తెలుగు ప్రాంతానికి చెందిన గణపతిముని గారి జీవితం ఆధారంగా 'కావ్యకంఠ చరిత' మనే 21 సర్గల మహాకావ్యాన్ని పెన్నా మధుసూదన్ రచించారు. 2012లో చిన్మయ ఇంటర్ నేషనల్ కేరళ వారి ద్వారా ప్రచురితమైన ఈ కావ్యం కూడా పాఠకాదరణను పొందింది. 'రాహుల్ సాంకృత్యాయన్' జీవితంపై రాసిన లఘుకావ్యం విమర్శకుల ప్రశంసలను అందుకుంది.

డా. పెన్నా మధుసూదన్ మొత్తం 37 గ్రంథాలను రచించారు. వీటిలో తొమ్మిది లఘు కావ్యాలున్నాయి. సంస్కృతం నుండి తెలుగులోకి, సంస్కృతం నుండి ఆంగ్లంలోకి, మరాఠీ నుండి సంస్కృతానికి అనేక గ్రంథాలను అనువదించారు. జాతీయ అంతర్జాతీయ సదస్సులలో అరవైకి పైగా ప్రామాణిక పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఎన్నో విలువైన గ్రంథాలకు సంపాదకత్వ బాధ్యతను తీసుకున్నారు. రీసెర్చ్‌జర్నల్స్‌కు ఎడిటర్ గాను పనిచేస్తున్నారు.

డా. మధుసూదన్ పై బాణభట్టు, భవభూతి, కాళిదాసు, శేవడే వంటి మహాకవుల కావ్యాల ప్రభావం ఉంది. సంస్కృతం, హిందీ, మరాఠీ, జర్మన్ భాషలలో ప్రావీణ్యం సంపాదించారు. వీరి పర్యవేక్షణలో 5 గురు పి.హెచ్ డి, 30 మంది ఎం.ఫిల్ పట్టాలను అందుకున్నారు. ప్రస్తుతం ఎనిమిదిమంది పరిశోధక విద్యార్థులు పి.హెచ్ డి, అయిదుగురు ఎం.ఫిల్ పరిశోధన చేస్తున్నారు. డా. మధుసూదన్ గారు ఈ అకాడెమీ పురస్కారం కంటే ముందు అనేక అవార్డులను అందుకున్నారు. మహారాష్ట్ర సాహిత్య అకాడెమీ వారి ప్రతిష్ఠాత్మకమైన సాత్వలేకర్ అవార్డ్, పండిట్ లత్కర్ శాస్త్రి మెమోరియల్ అవార్డ్, పండిత్ ఘూటాటే మెమోరియల్ అవార్డ్, శ్రీ వంగీపురం రామానుజాచార్య స్మారక పురస్కారం. గుజరాత్‌లోని సోమనాథ్ ట్రస్ట్ స్వర్ణ పతకాన్ని అందుకున్నారు. రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం తిరుపతి వారు 'యువ విపశ్చిత్' బిరుదు, శ్రీ గోళ్వాళ్కర్ గురుంజీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సంస్కృత భారతి వారి 'సంస్కృత పండిత్' పురస్కారాన్ని పొందారు. 2018లో కెనడాలో జరిగిన 'విశ్వ సంస్కృతి సదస్సు'లో భారతదేశ ప్రతినిధిగా పాల్గొన్నారు. మధుసూదన్ కృషివెనక భార్య రాజేశ్వరి గారి ప్రోత్సాహం మరవలేనిది. కూతుర్లు శ్రీవరేణ్య, హాసికలు కూడా ఉత్తమ విద్యార్జన మార్గంలో పయనిస్తున్నారు. నిరంతర సాహిత్య అధ్యయనం రచనా వ్యాసంగాలతో పాటు ఉత్తమ బోధకుడిగా, పరిపాలనా దక్షకుడిగా రాణిస్తున్న ఆచార్య పెన్నా మధుసూదన్ నేటి తరానికి ఆదర్శనీయ వ్యక్తిగా భావించవచ్చు.

–డా. ఎస్. రఘు
m : 9848208533
e : raghusr17@gmail.com

ద

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com



## నీవు వచ్చేవనీ...

ప్రేమగురించీ
అందం గురించీ
ఇన్నిన్ని పుస్తకాలు చదివావు కదా !
ఆమె కళ్ళరహస్యం తెలుసుకొన్నావా!?

ఈ కంప్యూటర్ యుగంలో
చంద్రలోకందాకావెళ్ళావుకదా!
ఆమె చిరునామాని వెదుక్కోగలిగావా !?

ఇది షెమ్మా ఆరిపోగూడని మహిఫిల్ నిద్రనుఆపుకొని
'పర్వానాల' కాపలాకాయగలవా?

నీళ్ళ గ్లాసులో 'బరఫ్ గడ్డ' కరిగిపోతున్నట్టు
ఆకాశంలో చందమామ చెదిరిపోతోంది
కిటికీ తెరిచి పిడికిట్లోమృదువుగా తెలుపునువొలకకుండా
దాచుకోగలవా?

ఈరోజునుండి ఆమెపేరుమీద యుద్ధంమొదలయింది
ఒక్క అద్దంకూడా పగిలిపోకుండా
నీవు చూస్తున్న స్వప్నాన్ని కాపాడుకోగలవా?

చిన్నప్పటినుండి ఎన్నోకథలువినివుంటావు
ఒక్కపాత్రసొగసులోనైనా ఆమె పొగరును గుర్తుపట్టే
సన్నివేశంఎదురుపడిందా?
ఆమె వస్తుందని
అగరుపొగల్లోంచి నీవటువైపుచూస్తుంటే కనిపించని పరిమళంలా
ఇటువైపునుండి తిరిగిపోయివుంటుంది.

–ఆశారాజు

m : 9392302245
e : asharaju.poet@gmail.com

**FORM IV** (See Rule 8)

Statement about ownership and other particulars of periodical Deccan Land as required to be published in the first issue every year after the last day of February.

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | Hyderabad |
| 2. Periodicity of its publication | : | Monthly |
| 3. Printer's Name | : | M.Veda Kumar |
| Nationality | : | Indian |
| Address | : | "CHANDRAM" 3-6-712/2, Street No.11, Himayatnagar, Hyderabad-500029. |
| 4. Publisher's Name | : | M. Veda Kumar |
| Nationality | : | Indian |
| Address | : | "CHANDRAM" 3-6-712/2, Street No.11, Himayatnagar, Hyderabad-500029. |
| 5. Editor's Name | : | M. Veda Kumar |
| Nationality | : | Indian |
| Address | : | "CHANDRAM" 3-6-712/2, Street No.11, Himayatnagar, Hyderabad-500029. |
| 6. Names and addresses of individuals who own the periodical and partners or shareholders holding More than one per cent of the total capital. | : | M. Veda Kumar |

I, M. Veda Kumar, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
(M. Veda Kumar)

Date : 1st March, 2020 Signature of Publisher







## జర్నల్ ఆఫ్ తెలంగాణ స్టడీస్-త్రైమాసిక

TELANGANA RESOURCE CENTRE

# TRC
# Journal of Telangana Studies

తెలంగాణ రిసోర్స్ సెంటర్ (TRC) ఆధ్వర్యంలో 'టీఆర్‌సీ జర్నల్ ఆఫ్ తెలంగాణ స్టడీస్' త్రైమాసిక జర్నల్ (జూలై–అక్టోబర్ రెండవ సంచిక) వెలువడింది. దీనికి ఓయూ మాజీ ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ ఎడిటర్‌గా, తెలంగాణ రిసోర్స్ సెంటర్ చైర్మన్ మణికొండ వేదకుమార్ పబ్లిషర్‌గా ఉన్నారు. ఈ జర్నల్ ఇంగ్లీష్, తెలుగు భాషల్లో ప్రచురితమవుతుంది. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సాహిత్యంపై ప్రముఖంగా వచ్చిన వ్యాసాలను ఈ జర్నల్‌లో ప్రచురిస్తారు. టీఆర్‌సీ జర్నల్ ఆఫ్ తెలంగాణ స్టడీస్ (TRC Journal of Telangana Studies)లో వివిధ రాష్ట్రాల నుండి ఎమినెంట్ స్కాలర్స్ రాసిన పరిశోధన పత్రాలను ప్రచురిస్తారు. మేధావులైన ఎడిటోరియల్ బోర్డు పర్యవేక్షణలో ఈ త్రైమాసిక జర్నల్ అక్షర రూపంగా వెలువడుతుంది. తెలంగాణ రాష్ట్ర చరిత్ర, ఆర్కియాలజీ, ఆర్ట్స్ అండ్ లిటరేచర్, హెరిటేజ్ మొదలైన సామాజిక అంశాలపై విస్తృతంగా, పరిశోధనాత్మకంగా వ్యాసాలను క్రోడీకరించి వాటిని ప్రపంచంలోని పలు యూనివర్సిటీలకు అందించేందుకు కృతనిశ్చయంతో ఉంది.

**Books for reviews may be sent to the postal address:**
**"BHOOPATHI SADAN"** 3-6-716, Street :12, Himayathnagar,
Hyderabad-500029, Telangana.
Mob: +91 8686 66 4949 email: trcjts@gmail.com

**Subscription:**

- Individual (India) : Rs. 250/issue; • Annual Subscription Rs. 800/-
- Institution (India) : Rs. 400/issue; • Annual Subscription Rs. 1,500/-
- Foreign Individual : US$ 65/issue; ▪ Annual Subscription US$ 260
- Foreign Institution : US$ 70/issue; ▪ Annual Subscription US$ 280

**ACCOUNT DETAILS:**

*A/C Name :*
Telangana Resource Centre
*Bank Name :*
Telangana Grameena Bank
*A/c. No. :* 79009067970
*IFSC No. :* SBIN0RRDCGB;
*Branch Code :* 229

# మదర్స్ డే - అమ్మల దినం

గిరి గాడొక్కడే చెత్త కుండీ నానుకొని గుడ్డె పొడుచుకొని కూలబడిండు. వానికెడమ వైపున రెండు గున్న పందులు తోక లూపుకుంటు ఆహారం కోసం అటు ఇటు తిరుగుతున్నై. కుడి వైపున ఒక బక్క కుక్క ముందలి కాళ్ళు చాపి ఒక దానిపై ఒకటి వేసుకొని గదుమ నానించి ఈ ప్రపంచ చింత తనకేమి పట్టనట్లు చూస్తూ పండింది.

ఇంతలో ఒకవ్వ అక్కడికి చెత్త బకిటు తీసుకొని వచ్చి కుండీలో కుమ్మరించింది. దాన్నట్లా కుమ్మరించగానే పంది గున్నలు రెండు నేనంటే నేనని ముందుకు వచ్చి ఆ కుండీలోనికెగరటానికి చుట్టూ తిరగసాగినై.

అవ్వ గిరిగాన్ని చూసి ఏందిరా యియ్యాళ ఒక్కడవే కూకున్నావు? మీ వాళ్ళంతా ఎక్కడ పోయిన్రు.

"అవ్వా ఇయ్యాల అమ్మల దినం అల్లంతా తమ అమ్మల దగ్గెర కోయిన్రు".

"మరి నువ్వు పోలేదేం?"

"నాకమ్మ లేదు"

"ఏమయింది?"

"చచ్చిపోయింది"

"మరి అయ్య లేడా!"

''అయ్య అమ్మ కంటే ముందే పోయిండు. ఇయ్యాల మీ వారంతా అమ్మల దగ్గరకు పోయి ఏం చేస్త్రారా!"

"అమ్మలంతా ఇయ్యాల స్నానం చేస్తరు. పిల్లల క్యాడ చేపిస్తరు. కొంచెం మంచి బట్టలేసుకుంటరు. అయినంక బిచ్చల పైల కెళ్ళి మిఠాయిలు కొనుక్కొని తింటరు."



గిరిగాని దిగులు సూసి అవ్వకేలాగో అని పిచ్చింది. అవ్వంటే ఆమె పూర్తిగా అవ్వగా లేదు. దంతాలు మాత్రం అన్ని రాలిపోయినై. నడుం కొంచెం వంగింది కానీ, నడికట్టు కట్టుకొని తన పని అంతా తానే జేసుకుంటది. తానె వాకిలూడ్సుకుంటది. లంకంత ఇంటిలో ఒక్కతే ఉంటది.

బాగున్న కాలంలో గంపెడు బలగంతో సాగిన సంసారం. ఇవ్వాళ సదువులకని కొందరు ఉద్యోగాలకని కొందరు కొడుకుల పెండ్లిండ్లు కాగానే పెండ్లాల నెంటేసుకుని పట్న మెక్కిండ్రు. అందువల్ల ఇంటిలో అవ్వ ఒక్కతే అయింది.

గిరిగాన్ని చూసి ఆమె అట్లయితే నేను నీకు స్తానం పోస్తాను వస్తావురా అన్నది.

వాడు " నాకు నువ్వమ్మవా " ! అన్నాడు.

"అమ్మే స్తానం పోయాల్నా ! ఇంకొకరు పోయగూడదా! నేను నీకు కాకపోయినా ఒక అమ్మనేరా!" అంది. "అయితే యియ్యాల నువ్ నాకు స్తానం బొస్తవా! మరి బువ్వ" అమాయకంగా అడిగిండు వాడు.

"బువ్వ కూడ పెడ్తా ! నువ్వొస్తే."

"అయితే వస్త! నా చిప్పముంత తెచ్చుకుంట" అని లేచిండు. "ఇయ్యాల కే ముద్దులే! మా యింట్ల ఉన్నవిస్త! ఇంగ నా వెంటరా!" గిరిగాడు తనను తాను దులుపుకొని అవ్వ వెనుక నడిచిండు. ఆమె వాన్ని ఇంటి లోపలికి పిలుచుకొని మొదట చక్కగా స్నానం గదికి తీసుకెళ్ళి జాలెట్లో కూంచో బెట్టి శరీరంపై నీళ్ళు చల్లి ఇక నెత్తి పులుమ నారంభించింది.

ఒత్తుగా పెరిగిన వాని నెత్తిని బాగా తడిపింది. మొదటి సారి సబ్బు పెట్టగా వాని నెత్తి నుండి రైలు బొగ్గు వంటి చిక్కటి మసి వెళ్ళింది. రెండవ సారికి జిడ్డుతో కూడిన మురికి వెళ్ళి మూడోసారి తల శు భ్రమయ్యింది. ఆ తర్వాత శరీరం ఇంకా బాగా రుద్ది చేపను రాకినట్లు బాగా రాచి కడగగా వాడు ఆమె అనుకున్నంత నల్లగా లేడు. ఎరుపు మిశ్రమంగా ఉన్నాడు కాని వానికినెత్తి కెవరు పోస్తారు. పై రుద్ది ఎవరు కడుగుతారు? వాడైన తనను కడుక్కుని ఎన్ని దినాలయిందో!

అరగంట సేపు స్నానం చేయించి తడిఒత్తి ఇంట్లోకి తోలుకపోయి పై ఇంకా బాగా తుడిచింది. అప్పుడు వాడచ్చం తని చిన్న మనుమని వోలె ఆమెకు కనిపించిండు.

లోపలికి తీసుకవచ్చి తడుస్తదని పైకి చెక్కుతున్న సింగులన్ని కిందికి లాగి దులుపుకొని గదిలోనికెళ్ళి తన మనుమని బట్టలు "బొగుస" తెచ్చి దాన్ని విప్పి అందులో నుంచి ఒక్కొక్క మడతనే తీస్తూ గిరిగానికి సరిపోయిన ఒక నిక్కరు ఒక ఆఫారం తీసి యిచ్చి ఇవ్వాళ ఇవి వేసుకోరా! అంది. వాడా దుస్తుల నాశ్చర్యంతో తిప్పి తిప్పి తిరుగుమళ్ళ నుంచి మళ్ళ చూసి నిక్కరు తొడుక్కొని ఆఫారం వేసుకున్నాడు. అవి వేసుకునే వరకు వాని ముఖంలో "జమిందారీ" పిల్లవాని కళ వచ్చింది.

అవ్వ "రేపటి నుండి నీకింకా మంచి దుస్తులు కుట్టిస్తానని" చెప్పి దగ్గరకు పిలుచుకొని తల దువ్వి "ఇంక నూవ్వీ ఇంట్లోనే ఆడుకో! నేను పొయ్యి కాడికి పోతా!" నని వంట గదిలోనికి వెళ్ళింది.

రేపటి నుంచి అనే మాట వినేవరకు గిరిగాడు "అవ్వ ఇంట్లో నేనియ్యాలనే ఉంటాననుకున్నాడు గాని రేపటి నుండి అంటే నేనింక నా జత వాళ్ళను విడిచి ఇక్కడనే ఉండిపోవలెనా! లేక వెళ్ళిపోవలెనా" అని మనసు కొంతసేపు ఉయ్యాలలూగింది.

అవ్వ ఆడుకొమ్మన్నది గాని ఒంటరిగా ఆడే ఆటలేవి వానికి రావు. వాడా గదిలోనే ఒంటరిగా కొంతసేపు కూచోని అటు ఇటూ చూసిండు గాని కుండి దగ్గర ఒక కుక్కలాగా తనకేం పట్టకుండా ఉండలేకపోయిండు. వానికి ఎటూ తోచలేదు. చౌరస్తాలో నిలిచి పైసల కోసం పంది గున్నల్లాగా ఇటు అటూ తిరిగిన ప్రాణం. వారిని వీరిని

ఆడుకున్న ప్రాణం వట్టిగా ఒక చోట ఎట్లా కూచోగలడు. లేచి అవ్వ దగ్గరకు పొయ్యింట్లో కెల్లిండు.

అవ్వ పొయ్యి మీద ఎదో ఎసరు పెట్టె బీరకాయను తరుగుతున్నది. వాన్ని చూసి 'ఏందిరా వచ్చి నవ్' అన్నది. వాడు 'అవ్వా నన్నాడుకొమ్మన్నవు గాని ఒంటరిగా ఆడే ఆటలు నాకేవి రావు' అన్నాడు. నీకేం ఆటలు రావురా! ఎందుకు రావు. కోతి కొమ్మచ్చి, హరిపురి, చిరుత గిల్లి ఇంకా వస్తయి గాని వానికి మా గుంపంత ఉండాలె. కాని మా వాళ్ళెవరు మమ్ముల్ని ఆడుకొనియ్యరు. బిచ్చం ఎత్తేది పోతదని దానికే తరుము తుంటరు. ఇక్కడ నేమో నేనొక్కడినే గదా! ఎట్లా ఆడుకుంటా!

"అయితే మరేం జేస్తావు.

"చౌరస్తా కెళ్ళి ఆయన్ని ఈయన్నియిన్ని పైసలాడుక్కోతున్నా. రాత్రికి బువ్వకైతవి". "బిడ్డా మన కట్లా అడుక్కోవలసిన అవసరం లేదు. బువ్వకేం లోటు లేదు." ఈ మాట వినేవరకు గిరిగానికేంతోచలేదు. అవ్వ నన్ను కట్టేసే గదా! అని పించింది. "ఇయ్యాల కెట్లాగో ఉండి తెల్లరగానే మల్లా నా కుండీ కాడికెళ్ళాలె" అనుకున్నాడు.

పగలెట్లాగో గడిచింది. సందేళ్ళ పడగానే అవ్వ సందగాసు తీసి దీపం వెలిగించి లైట్లు వేసింది. వాడది చూచి "అవ్వా లైట్లుండగా దీపమెందుకు ముట్టిచ్చినవే" అన్నాడు. ఆమె "బిడ్డా! దీపమంటే లక్ష్మీ దేవి కనుక దీపం వెలిగించి దండం పెట్టిన మీదనే లైటేసుకోవాలె" అన్నది.



చీకటి పడేవరకు అవ్వ మళ్ళీ బువ్వ వండింది. కూర పొద్దటిదే ఉన్నది. కొంచెం సేపైన తర్వాత ఇద్దరు బువ్వతిన్నరు. అవ్వ వానికి కడుపు నిండా పెట్టింది. అంతవరకు గిరిగాడెప్పుడు సగం కడుపుకే గాని ఇట్లా ఒకేసారి కడుపునిండా ఎన్నడు తినలేదు. ఇవ్వాళ వానికి ఎంతో ఇదిగా ఉన్నది కాని రెండో వైపు తెల్లారితే ఏంచేయాలన్న ఆలోచన.

బువ్వ తినంగానే అవ్వ విశాలంగా పక్క పరిచింది. అనంతరం వాన్ని "గిరీ" అని పిలిచి ఇదిగో నీవు ఇక్కడ పండుకో నెత్తి అక్కడ చెయ్యి అని చేతులతో చూపి అట్లా నీవు నాడొక్కలో పండుకుంటే నీకు నాకు ఇద్దరికి ఎచ్చగా ఉంటుంది" అన్నది.

అవ్వ అట్లా చెప్పి పక్క మీద కూలబడిందో లేదో గిరిగాడప్పుడే తన అలవాటు ప్రకారం అవ్వ చూపిన చోట ముడుచుకొని ముడిగిండు. వాన్ని చూచి అవ్వ "అట్లా కాదురా! కాళ్ళు చాపి విశాలంగా పడుకో" అన్నది.

అంతవరకు వాడు కాళ్ళు చాపుకొని విశాలంగా ఎన్నడు పండలేదు. ఈ వేళ అమ్మల దినం కాబట్టి అందరూ వాళ్ళ వాళ్ళ అమ్మల దగ్గర కెళ్ళినారు గాని దినదినం వాళ్ళ గుంపంత సుబ్బడు, ఎంకడు, రంగడు మొదలైన వాళ్ళంతా ఒకనాడు బస్టాండ్ లో, ఒకనాడు రైలు స్టేషనులో, ఒకనాడు ఫుట్ పాత్ మీద పైసలడగటం ఎక్కడ ఎక్కువసేపు గడిస్తే ఆనాడక్కనే ఎదో ఒక చోటు చూసుకొని ముడిగేవారు.

ఆ రాత్రి అవ్వకి గిరిగానికి యిద్దరికి నిశ్చింతగా మంచి నిద్ర పట్టింది. తెల్లవారిన పిమ్మట ఎవరు అనుభవాలు వారు చెప్పుకున్నారు.

అవ్వ కొంచెం చీకటిగానే లేచి బర్రెను పిండింది. బాగా తెల్లవారిన పిమ్మట అవ్వ వానిని పెరట్లోనికి పిలుచుకెళ్ళి చేతిలో ఇంత పండ్లపొడి పోసి దీనితో పండ్లు బాగా తోమి కడుక్కో" నేను చాయ చేస్తాను అని వంట గదిలోనికి వెళ్ళింది.

గిరిగాడు పండ్లు రుద్దుకొని కాళ్ళు చేతులు కడుక్కొని లోపలికి వచ్చినాడు. అవ్వ టీ తయారు చేసింది. రెండు గ్లాసుల్లో తేగా ఇద్దరు ఎదురెదురుగానే కూర్చుని టీ తాగిన్రు.

గిరిగాడెప్పుడు హోటల్ టీయే గాని ఇంటి చాయ్ ఎరుగడు.. దాన్ని తాగి ఇది ఇంత బాగుంటదా! అనుకున్నాడు. పిమ్మట ఆమె కెదురుగా ఆమెనె చూస్తూ కూచుని పది నిముషాలైన తర్వాత అవ్వా యింక నేను నాతావుకు పోతానని" లేచాడు. "నీతావు అంటే ఎందిరా? ఆ కుండియేనా!" అవును.

"ఈ ఇల్లు దాని కంటే బాగా లేదా!"

"ఇక్కడ నాకెవరు జతగాళ్ళు లేరు నేనొక్కన్నే ఎట్లా ఉండాలె? ఇక్కడ నాకేం పని గూడ లేదు" అన్నాడు.

పిల్లతనం మనిషిని ఊరుకోనీయదు. వానికి ఆటనో లేదంటే ఎదైనా పనో ఉండాలె. అది మంచిదో చెడ్డదో!

"అట్లా అడుగు నేను చెప్తాను గాని నన్నొక్కదాన్నే యిడిసి పోతావురా!"

"అవ్వా నీకేవరు లేదా!"

"లేకెందుకు బిడ్డా! ఇద్దరు కొడుకులు ఒక బిడ్డ ఉన్నరు".

మరి వారేరి?

"పెండ్లైనా తర్వాత పెండ్లాల నెంటేసుకొని మగ పిల్లలు వారి ఉజ్జోగాలకు ఎల్లిన్రు.. పెద్దోడు పూనా అంట అక్కడికిపోతే సిన్నోడు ఇక్కడ 'అమరికల'న్నీ సరిగా ఉండవని 'అమెరికా' యెల్లిండు.. బిడ్డ మగడు పట్నంలో ఇల్లు గొన్నదని అక్కడి కెళ్ళి పోయింది."

"అల్లకు కొడుకులు బిడ్డలు లేరా!"

"లేకేం! అందరికి ఒక కొడుకు ఒక బిడ్డ ఉన్నారు. కాని వాళ్ళకు పెద్ద సదువులు కావలె. పిల్లల్ని ఈ ముసలి దాని దగ్గరుంచుతారా! నాకేమో చిన్నప్పటి నుండి పిల్లల్ని పెంచిన అలవాటు. ఇంటిలో ఎవరో ఒక పిల్లగాడు పిల్లనో లేకుంటే తోచదు. పొద్దువోదు."

"నాకు అంతే అవ్వా! ఒక్కన్నే ఉంటే పొద్దువోదు". "అట్లా అడుగు పొద్దు వొకపోతే సాళ్లకెల్లిరా ఇంతసేపు అంటే బడికి పోయిరా!

"నన్ను సదువు కొమ్మంటావా! అది నానుంచి గాదు". "సదువంటే ఎమనుకున్నావురా! అచ్చురాలతో ఆడుకోవడమే! ఒక్కనాడు బడికెళ్లిరా! అది నీకే తెలుస్తుంది అక్కడ నీకు బోలెడు మంది జతైతరు" అని చెప్పి అవ్వ వీధి కెళ్ళి ఓ పలకా బలపం కొని తెచ్చింది.

అది తీసుకొని వాన్ని రెక్క పట్టుకొని తోలుకపోతూ "మొదట నిన్ను వీధి బళ్లో వేస్తా! అక్కడ ఓనమాలు కాకుదుతం నేర్చుకొని బాల శిక్ష చదివిన తరువాత తీసుకెళ్లి సర్కారు బడిలో వేస్త" అని చెప్త ఆమె వాన్ని బడిదగ్గరకు తెచ్చింది. అదొక చిన్న హనుమదాలయంలో ఉన్నది.

అవ్వ వాన్ని పంతులు గారి కప్పగిస్తు "ఇగో పంతులు వీడు నాకింకో మనవడు. వీనికి సదువు బాగా సెప్పాలె. పైసలెన్నైనా ఇస్తా" అని వాన్నక్కడ కూచో బెట్టి పలకా బలపం యిచ్చి వెళ్ళిపోయింది.

పంతులు వాని పేరడిగి పట్టికలో రాసుకొని వానిని "ఒరేయ్ గిరీ నీ పలకిటుతేరా!" అని యిప్పించుకొని దానిపై అఆలు పెట్టిచ్చి ఇక్కడ కూచోని వానిని చదువుకుంట దిద్దు అని ఒక విద్యార్థి పక్కన కూచో బెట్టిండు. వాడు వానిని "అఆ" అంటూ దిద్దసాగిండు.

కొంత సేపటికి బువ్వ వేళయింది పంతులు బడి విడిచి అందర్నీ అన్నం తిని రమ్మన్నాడు. పిల్లలందరు లేచి ఇండ్లకు వెళ్ళి పోయిన్రు.

గిరిగాని అక్షరాలు దిద్దుతుంటే అదో తమాషా అనిపించింది. వాడు బువ్వ తిని పలక తీసుకొని మళ్ళీ వచ్చి ఇగో పంతులు నాకివి వచ్చినవి "అఆ" అంటే ఏమిటి కడుపులో అడ్డగీతలుండే రెండు సందమామలే గదా!" అని వానిని పలక వెనుక రాసి సూపిండు.

పంతులు వాని తెలివి కాశ్చర్యపడి అందుకే "చదువుకు ముదురు సాముకు లేత" అన్నారు కాని యిప్పటి వారేమో తమ పిల్లల్ని ముడేండ్ల నుంచే చదువులో ముర్గ బెడుతున్నారనుకొని వాని పలక తీసుకొని "ఇఈ" లు పెట్టిచ్చినాడు.

గిరిగానికి నాలుగు దినాలకే అచ్చులన్ని వచ్చేసినై అవ్వ ఒకనాడు వాని వెంట వచ్చి "పంతులు మా పిల్లవాని తెలివెట్లా ఉంది" అంది. "ఆ మన పిల్లవానికేమమ్మా 'చాకు'లాగున్నాడు. బడి ఈడు దాటింది కాబట్టి నా దగ్గర మూడు నెలలు చదివించు. వీన్ని నేను మొదటి తరగతిలో చేర్పిస్తానన్నాడు." అవ్వ అదివిని తృప్తిగా వెళ్ళింది.



పంతులు గిరిగాని పిలుచుకొని పలుక మీద "కఖ" పెట్టిచ్చి దాన్ని చేతికిచ్చి వానితో "ఒరేయ్ ఏవైనా తొందరగా వస్తే మళ్ళీ తొందరగా నెమరపోనై కాబట్టి వచ్చినవన్ని దినం ఒకసారి రాసి చూపించాలెనని చెప్పిండు.

గిరిగానికి అన్నిటిలాగే "కఖా"లు గూడ ఒక పూటకే వచ్చేసినై. పంతులు పెట్టిచ్చిన వానిని బాగా దిద్దిండు గీత వెడల్పై కకారం తలకట్టు చక్కగా అయింది. కాబట్టి వాడు దాన్ని అట్లాగే రాసి చూపిండు. అది చూసి పంతులు వాన్ని దగ్గరగా పిలుచుకొని "ఒరేయ్ నూవ్వీశ్వరుని బొమ్మ ఎప్పుడైనా చూసినావా" అన్నడు. "ఈస్వరుడు అంటే శివుడా!" అని వాడడిగిండు. పంతులు అవునన్నాడు. అది విని వాడు "చూసిన చూసిన ఆయనెత్తి మీద సందమాముంటడు. ఆయన బొమ్మ కుష్టుడి బొమ్మ, లచ్చిం బొమ్మ ఊదు బత్తి పోట్లాల మీద, మైనపు వత్తుల పూడాల మీద మస్తుగుండై" అన్నడు.

అది విని పంతులు "శివుని నెత్తి మీద సందమావుంటడు గదా! అట్లాగే మన అక్షరాల నెత్తి మీద గూడ సందమామనే ఉంటడురా! దాన్నే మనవారు "తలకట్టు" అంటరు. ఆదిట్లా సక్కటి గిరలాగుండదు మన అక్షరాలన్నీ చంద్ర కళలతోనే ఉంటై అన్నడు.

"అయితే తలకట్టండే కడుపున గీతలేని సిన్న సందమామన్న మాట మరి అది రెండో 'కా'కు లేదేం" అన్నడు. పంతులు వీడు గడుగ్గాయే అనుకొని తలకట్టు కొన్నిటికి మాత్రముండదురా" అన్నడు. అచ్చుల వలెనే హల్లులు గూడ వాడు పూటకు రెండు చొప్పున నేరుస్తూ పోయి గుణింతంలోనికి వచ్చిండు. గుణింతలో పంతులు గుడి గుడి దీర్ఘం పెట్టించిండు.

గిరి గాదది దిద్దుకుంటు "ఒయి పంతులు కొమ్ములు దేనికైనా నెత్తి మీదుండాలె. ఈ అచ్చరాలకేమ్ నీవు తప్పు పెట్టిచ్చివే" అన్నాడు. పంతులది విని వీడు నాకే చదువు నేర్పే అట్లున్నాడని అనుకోని "కొమ్ములు నెత్తి మీదుంటే అవి పసులైతవిరా! అందుకే అక్షరాలకు పక్కగా ఉంటై అని చెప్పిండు.

గిరిగాడు తన తావు విడిచి రెండు వారాలయింది. అవ్వా వాన్ని కుండి చాయలకు పోనీయలేదు. తమ ఇంటి చుట్టే తిప్పింది కానీ " గుడ్ల పెట్ట" లాగవాన్ని ఇంట్లో ఎంత కాలం ఉంచుతుంది.

బైట చెత్తకుండి దగ్గర వాని జత పిల్లలు గిరిగాడు ఈ బజారిడిసి అవతలి బజారుకు పోయిండో లేకుంటే అమ్మల దినం నాడు "పిన్ని" వచ్చి తోలుక పోయిందేమొర! అనుకున్నారు.

ఈ రెండు వారాలలో గిరిగాడు కొంత కళదేరిండు. వానికి కొంచెం సంస్కారం గూడ అచ్చింది. తెల్లారి లేవగానే ముఖం కడుక్కోవటం, స్నానం చేయటం, పద్మాసనం పై కూర్చోవటం, సొంతంగా తినటం అలవాటయింది. అప్పుడు అవ్వ ఒకనాడు వాన్ని సంచి పైసలు ఇచ్చి టమాటలు, వంకాయలు, మెంతి కూర తెమ్మని మార్కెటుకు పంపింది. వాడవి తీసుకొని మార్కెటు గేటు దాటినాడు.

సుబ్బడు వానిని చూచి ఎవరో పెద్ద ఇంటి బాబని పైసలాడుక్కోవటానికతని ఎదురుగా వచ్చి మొకం చూసి క్షణం పాటు తెల్ల బోయిండు.

గిరిగాడు రెండు వారాలలో కొంత నేవళీకల తేరిండు.

తరువాత తేరుకొని "ఒరే అప్పుడు, కొండడు గంగన్న ఎక్కడున్నార్రా! మన పేరీగాడీడనే ఉన్నాడు. రండిరా! రండి!" అని కేకేసెవరకు వారంతా ఎక్కడున్నారో బిలబిలమని ఉరికొచ్చి వాణ్ణి చూచి డిల్ల పోయిన్రు.

ఈ రెండు వారాలకే వానికి వారిని తాకితే ఎట్లాగో అనిపిస్తుంది.

వాళ్ళు మళ్ళీ కొంచెం సేపటికి తేరుకోని "ఏమిరా గిరి ఎక్కడున్న ఈ ఏసమేమిటి మేం నిన్ను పిన్ని దగ్గరికి పోయిండు" అనుకున్నం.

అది విని వాడు "ఒరేయ్ మనం కుండి దగ్గరున్నప్పుడు ఒకవ్వ చెత్త బకెటు తెచ్చేది ఎర్కేనా".

వారది విని ఎర్కే! ఏర్కే అన్నారు.

అమ్మాల దినం నాడు మీరందరూ అమ్మల దగ్గరికి పోయిన్రు గదా! నేనొక్కడినే ఆడకూకొని ఉండగా అవ్వ కుల్లు చల్లటానికి వచ్చి నన్ను చూసి తోలుక పోయి నెత్తికి పోసి స్నానం చేపించి ఈ దిరస్తు యిచ్చిందిరా" అనగా

రంగడు ''నూవ్విపుడాడేం చేస్తున్నావు అడిగిండు''. 'సదువుకుంటున్న బడికి పోతున్నావా.'

"అవున్రా ఇప్పుడా సదువుకెప్పుడైతే ఎందిరా బడికి పోతే బలేగా ఉంటుందిరా" నేను సదువుకుంటానన్న! కాని మాయమ్మ బడికి పోనీయలేదు. పైసలేవ్వరుడుకొస్తరని కొట్టింది.

'అయితే నువ్వింక మాలోనికి రావన్న మాట అన్నడు'.

అప్పుడు 'వాడు బువ్వకు మరిగిండురా! యింగ మన దగ్గరికెందు కొస్తడు' అన్నాడు కొండడు.

'బువ్వ దేముందిరా! ఇప్పుడు మనం తినటం లేదు అయితే ఇది ఎంగిలి కూడు. కానీ ఏ మారాజైన మాత్రం పెడితే మంచి బువ్వనే దొరుకుతది గదా!'

'బువ్వ గాదిహె! వాడు పైసలకాశ పడ్డడు' పుల్లన్న అన్నడు.

'పైసలిప్పుడు మన దగ్గర మాత్రం లేవుర మనకు బువ్వ రొట్టె రెండూకెనే దోరికె ఇంక పైసలెందుకు' అన్నడు రంగడు.

'పైసలెందుకేమిట్రా! పైసలోనే పరమాత్మ ఉంది'.

'ఇయ్యాల మన దగ్గర పైసల్లేవని కాదు. ఒక్కొక్కరి బొంత యిచ్చుతేనా సామి రంగా! ఎన్ని నోట్లు బైటపడుతవో గుర్తేనా!' అన్నాడు ఎంకడు.

గిరిగాడు వాళ్ళ మాటలన్ని నిశ్శబ్దంగా విని ఇట్లన్నడు. "ఒరేయి అన్నలు నాకు బువ్వ గాని పైసలు గాని అక్కరలేదు అవి మనమడుక్కుంటే ఎక్కడైనా దొరుకుతై. మనిషికి తన బలమంతా తన కండ్ల ముందుండాలె ఉంటే ఏది లేకున్నా అన్నీ ఉన్నట్లే, అట్లా లేనపుడు అన్నీ ఉన్నా ఏదీ లేనట్లే."

అవ్వ కందరున్నారుగాని ఉజ్జోగాలలో తలా ఒకదిక్కు పోయిన్రు. ఇపుడు మనకు అమ్మ అవసరం లేదు గాని ముసలి తనంలో ఆమెకు మనమవసరం. అందుకే నేనిపుడు అవ్వ దగ్గరికి పోతుండ" అని అరిచాడు. కూరగాయల సంచి తీసుకొని నడిచిండు.

అమ్మల దినం అంటే మనకు అమ్మ కావలిసిన దినం కాదు. అమ్మకు మనం కావలలిసిన దినం అనిపించింది వానికి.

–డా. కపిలవాయి లింగమూర్తి
m : 87907 27772

## చందాదారులుగా చేరండి... చేర్పించండి...

***పాఠకులకు, రచయితలకు, పరిశోధకులకు... నమస్సులు.***

తెలంగాణ ఉద్యమ సందర్భంలో పుట్టిన తెలుగు మాసపత్రిక దక్కన్‌లాండ్ ఏడేళ్ళు పూర్తి చేసుకొని ఎనిమిదవ సంవత్సరంలోనికి అడుగు పెడుతున్నది. తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో ఉద్యమానికి దిశా నిర్దేశం చేసేలా ఎందరో ప్రముఖుల వ్యాసాలను అందించింది. టిఆర్‌సి 'చర్చ' సారాంశాలను ప్రజల్లోకి తీసుకెళ్ళింది. తెలంగాణ భావజాలాన్ని బలోపేతం చేసింది.

స్వరాష్ట్ర ఆవిర్భావం తర్వాత దక్కన్‌లాండ్ తెలంగాణ పునర్ నిర్మాణంతో తనదైన పాత్రను పోషిస్తున్నది. తెలంగాణ తనదైన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి, మరింత పరిపుష్టం చేసుకునేదానికి దోహదం చేస్తున్నది.

ఈ నేపథ్యంలో సామాజిక అంశాలతోపాటు, చరిత్ర, సాహిత్యం, వివిధ చేతివృత్తుల కళారూపాలు, నైపుణ్యాలు, వారసత్వం, పర్యావరణం, పర్యాటకం లాంటి అంశాలపై కథనాలను వెలువరి స్తున్నది కథ, కవితలు, పుస్తక పరిచయాలు, సమీక్షలు విశ్లేషణలతో మీ ముందుంచుచున్నాము. ప్రజా సంక్షేమం కోసం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళు తుంది. 2012 సెప్టెంబర్‌లో ప్రారంభమైన పత్రిక ఇప్పటి వరకూ మీ అందరి సహకారాలతో కొనసాగుతూ వస్తుంది. ఇప్పటికే ఎంతో మంది మిత్రులు, శ్రేయోభిలాషులు, తమ చందాలతో పాటు, చందాదారులను చేర్పించడంలో తమ సహకారాన్ని అందిస్తున్నారు. వారికి ధన్యవాదాలు.

అయినప్పటికీ పత్రిక నిర్వహణ కష్టసాధ్యంగా ఉంది. దక్కన్‌లాండ్ మనందరిది. పదికాలాల పాటు పత్రిక సజావుగా వెలువడే బాధ్యత మన అందరిదీ.

చందా పూర్తయిన వారు తమ చందాలను రెన్యూవల్ చేసుకుని కాంప్లిమెంటరీ కాపీలు అందుతున్న వారు కూడా చందాదారులుగా చేరి, మిత్రులను చేర్పించి సహకరిస్తారని ఆశిస్తూ...

ధన్యవాదాలతో... మీ
***– మణికొండ వేదకుమార్***
సంపాదకులు

**చందా వివరాలు:**

| | | |
|---|---|---|
| వార్షిక చందా | : | రూ. 300 |
| 2 సం॥లకు | : | రూ. 600 |

*'దక్కన్ ల్యాండ్' పేరిట ఎంఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**చిరునామా :**

**DECCAN LAND :**
**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com ww.deccanland.com

**దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరములు:**

| | |
|---|---|
| Name | : DECCAN LAND |
| Bank | : KOTAK MAHINDRA BANK |
| A/c No | : 7111218829 |
| IFSC Code | : KKBK0007463 |
| Branch Code | : 007463 |

# ప్రాణం వాసన.. సమాజపు చైతన్య సువాసన..

నేడు మనిషి అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో సాగుతున్నాడు, కానీ నేటి సమాజంలో మానవీయ విలువలు, ఆత్మీయత కనుమరుగవు తోంది అనడంలో ఎటువంటి సందేహం లేదు, కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమై బంధాలు, అనుబంధాలు పూర్తిగా దెబ్బతిని కుటుంబ. వ్యవస్థ నేడు అట్టడుగు స్థాయికి చేరింది. ఈ విపత్కర పరిస్థితిని మార్చగ లిగేది మనుషుల్లో చైతన్యం తెచ్చేది సాహిత్యం మాత్రమే అని చెప్పవచ్చు.

సమాజంలో మార్పు కోసం తపించే రచయిత అక్షరాలు అవినీతిని అంతం చేసే బాణాలుగా ఉండాలి.. శిథిలావస్థకు చేరిన మానవ విలువలకు సజీవనిలా ఉండాలి, అరాచకాన్ని అన్యాయాన్ని నిగ్గదీసి ప్రశ్నించేవిగా ఉండాలి, చివరకు ఆ రచన ముఖ్య ఉద్దేశ్యం ఏదో ఒక రూపంలో సమాజంలో చైతన్యం తీసుకువచ్చి అంతరించిపోతున్న అను బంధాలను ఆత్మీయ పరిమళాల వాసనను రేపటి తరాల వారికి అందించేదిగా ఉండాలి. ఇలా సమాజంలో మార్పు కోసం శ్రీమతి రమాదేవి బాలబోయిన గారు రచించిన లి"ప్రాణం వాసనలి "అనే పుస్తకం ఎంతగానో సహక రిస్తుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు.




ప్రాణం వాసన అనే కవితా సంపుటిలో 69 కవితలు ఉన్నాయి, ఇందులో ప్రతి కవిత దేనికదే ప్రత్యేకం, ప్రతి కవితలోనూ మానవీయ కోణం సమాజహితం దాగి ఉన్నాయి మన బాధ్యతను గుర్తు చేస్తూ వ్యక్తిత్వ వికాసాన్ని మానవీయ విలువలు పంచాయి రమాదేవి గారి కవితలు.

తెలంగాణ మాండలికంలో కవితలు రాయడం అదీ సరళంగా అందరికీ అర్థమయ్యే విధంగా భావవ్యక్తీకరణ జరగడంతో శ్రీమతి రమాదేవి గారి కవిత్వం చరిత్రలో మహాకవుల సరసన నిలుస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు.

రమాదేవి గారు ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ విధి నిర్వహణలో ఎంతో మంది పిల్లలను ఆదర్శంగా తీర్చిదిద్దుతూ.. ప్రవృత్తిగా రచనలు చేయడంతో వారు సమాజాన్ని కవితలతో చైతన్యవంతం చేస్తూ తద్వారా సమాజ సేవ చేస్తున్నారు.

ప్రాణం వాసన లోని కొన్ని కవితలు పరిశీలించి చూస్తే వాటి గొప్పతనం మనకు అర్థము అవుతుంది, కవితా శీర్షికలు కూడా చాలా వైవిధ్యంగా ఉన్నాయి.

ఉదాహరణకు... మనుగడ కోసం పోరాటం,
ప్రాణం వాసన,
యాదికున్నదా బిడ్డా..!,
ఆమె ఉలిక్కిపడింది,నే "బాల" నోయి, బతుకు రంగోలి
ముట్టుకోకు, అన్వేషిత,
మనసు లేని లోకం చెవులకు కళ్ళున్నాయా..!

మొదలైన ఎన్నో కవితల శీర్షికలు అద్భుతంగా వైవిధ్యభరితంగా ఉన్నాయి.

ప్రతి కవిత దేనికదే ప్రత్యేకంగా అందమైన కవితల పూలగుత్తి లాగా కనిపిస్తోంది రమాదేవి గారి లిప్రాణం వాసనలి కవితా సంపుటి.

అందులో లిప్రాణం వాసనలి అనే కవితలో

"గీ దునియాల
మానవత్వం మర్శినోల్ల కాడ
పీనుగ కంపు తప్ప
ప్రాణం వాసన గొడ్తాలేదు..!!

ఈ కవితలో అర్థం హృదయాన్ని తాకుతుంది..స్వార్థం నిండిన మనిషి మనసుకి ఈ కవిత కర్తవ్యబోధన చేస్తుంది... నేటి మనిషి మనస్తత్వానికి అద్దం పడుతుంది ఈ కవిత,

మానవత్వం లేని వారికి శవం వాసనే కనిపిస్తుంది కానీ వారికి ప్రాణం వాసన అర్థం తెలియదు అనడం ఎంతో బాగుంది ఇందులోని తెలంగాణ మాండలికం లోని భాష, కవితా వస్తువు, భావవ్యక్తీకరణ, శిల్పం ఎత్తుగడ, ముగింపు ఎంతో ఆదర్శంగా ఉంది.

మరో కవిత

"అమ్మా నొప్పి.." ఇందులో అమాయకపు అత్యాచార బాధితురాలి హృదయ వేదనను వర్ణించిన తీరు ఎంతో ఆదర్శవంతంగా ఉంది.

మరో చక్కని కవిత లికవిత్వపు పుట్టుకలి ఇందులో కవిత్వం ఎలా ఆవిష్కరణ జరుగుతుందో తెలిపారు కవితలో ఈ క్రింది వరుసలు పరిశీలిస్తే రచయిత్రి యొక్క ప్రతిభ చెప్పకనే తెలుస్తుంది

"కడుపు మండితే
కడుపు ఎండితే
కడుపు నిండితే
కవిత్వం పుడుతుంది"

ఈ కవిత చదివితే శ్రీ శ్రీ.. తిలక్ గారి కవితలు చదివిన భావన కలుగుతుంది.

ఎన్నో కవితలు చాలా బాగున్నాయి ముఖ్యంగా... చితి నెక్కిన బాల్యం... జ్వలిత దేహం, స్నానం పూర్తి అయ్యింది...

మొదలైన కవితలు బాగున్నాయి.

మట్టి వాసనలి అనే కవితలో జన్మభూమి పై మమకారాన్ని ఆత్మీయతను మట్టి వాసన జ్ఞాపకాలతో చిన్నప్పటి సంగతులను

ముడిపెట్టి చక్కని వర్ణనలతో వివరించిన తీరు బాగుంది.

ఈ కవితలో...

"ఎన్ని జ్ఞాపకాలు ఉంటే ఏం లాభం..
ఈ నగరాన బతుకు బందీ అయ్యిందిలే
ఈ కాంక్రీటు జంగల్ల ప్రేమ కరువైంది."

అంటారు.. కవయిత్రి దీనిలో నేటి నగరీకరణ సంస్కృతి వల్ల మన పల్లెసీమ యొక్క మాధుర్యాన్ని ఏవిధంగా కోల్పోతున్నామో వివరిస్తూ పట్నంలో యాంత్రిక జీవనంలో ప్రేమ కరువైంది అంటూ ఆవేదనతో కవిత మలిచారు,

మరొక ఉత్తమ కవిత 'అన్వేషిత'

ఇందులో థర్డ్ జెండర్ వారి గురించి వారి మనసులోని భావాలు సంఘర్షణ వివరిస్తూ గొప్పగా కవిత్వీకరించారు.

రమాదేవి గారి "ప్రాణం వాసన"లో

మనల్ని సన్మార్గంలో పెట్టే మంచి కవితలు, మహిళల చైతన్యం. పిల్లల బాధ్యత.. సామాజిక స్పృహ, యువతకు ప్రేరణ కలిగించేవి. ఎన్నో మంచి కవితలు ఉన్నాయి. మొత్తానికి ప్రాణం వాసన అనే పుస్తకం ప్రతీ ఒక్కరూ చదవదగిన ఉత్తమ పుస్తకం అనడంలో ఎటువంటి సందేహం లేదు, ప్రతి కవిత దేనికదే ప్రత్యేకం ప్రతి కవితలోనూ కవితా వస్తువు ఆవిష్కరణ, ఎత్తుగడ, ప్రారంభం, ముగింపు, పదబంధాల అల్లిక, భావవ్యక్తీకరణ మొదలైన అంశాలన్నింటికీ రచయిత్రి చక్కగా న్యాయం చేశారు నా అభిప్రాయం ప్రకారం ప్రాణం వాసన అనే పుస్తకం సమాజంలో చైతన్యపు సువాసన తీసుకు రాగలదు. ఈ పుస్తకం చరిత్రలో నిలిచిపోతుంది.

**ప్రాణం వాసన (కవిత్వం) రచన :** రమాదేవి బాలబోయిన, **ప్రచురణ :** మృదువిరి పబ్లికేషన్స్, **వెల :** 100, **పేజీలు :** 120, **ప్రతులకు :** ఇ.నెం. 3-34/1/సి, బృందావన కాలనీ-1, గోపాలపురం, హన్మకొండ, వరంగల్, ఫోన్ : 7893261262

-వినాయకం ప్రకాష్,
m : 8142512219
e : vinayakamprakash@gmail.com

## పద్యం

### 'కవి బ్రహ్మ' తిక్కన

ఉగ్గు పాలతోటి ఉభయ కవిత బట్టి
కావ్య మధువు గురిపె కవుల బ్రహ్మ
నవరసాలు ఒలికె నాటకీయత యందు
తిక్కనార్యు సాటి ఒక్కరేరి?

చక్కదనపు సొంపు చిక్కదనపు పెంపు
వాక్కులోని పదును వాక్య రీతి
తేట తెలుగు పదము తేనె లొల్కు పథము
తీర్చ లేని ఋణము తిక్కనార్య!

### శ్రీనాథుడు

చిరుత పరువ మందె చిందించె కావ్యాలు
సీస పద్య మనగ ఆస మెండు
ప్రౌఢ వాక్య రీతి పదునైన భావాలు
కవుల సార్వభౌము కవన జడిమ

గౌడ డిండి భట్టు గర్వంబు యడగించి
కనక ధార లందు కీర్తి నొంద
సిరుల నొసగె రాజు సిరినాథ కవినాథ
తెలుగు కవిత కీవు వెలుగు వయ్య!

- ధూళిపాళ అరుణ
m :8712342323

## పత్రికలు - పరిచయం:

గమనిక: ఈ శీర్షిక ప్రచురించేందుకు ఆయా పత్రికలు, ప్రత్యేక సంచికల వివరాలను మాకు తెలియ జేయగలరు.

**చినుకు**
**సంపాదకులు :**
**నండూరి రాజగోపాల్**




**ఫోన్: 95050 66455**

**అమ్మనుడి**
**సంపాదకులు :**
**డా॥ సామల రమేష్‌బాబు**




**ఫోన్: 98480 16136**

**పాలపిట్ట**
**సంపాదకులు :**
**గుడిపాటి**




**ఫోన్: 040 - 27678430**

**పునాస**
**సంపాదకులు :**
**డా॥ నందిని సిధారెడ్డి**




**ఫోన్: 040 - 29703142**




ప్రేమ, త్యాగం, పోరాటం మూడు తెలంగాణ రక్తంలో మొదటి నుంచి మిళితమై ఉన్నాయి. హైదరాబాద్ నగరమే ప్రేమకు చిహ్నంగా వెలిసింది. ఇందులోని కథలు కూడా అటు ప్రేమకు, ఇటు పోరాటానికి, దాని పర్యవసానాలకు అద్దం పట్టాయి. ఇందులోని కథలు ఎక్కువ శాతం తంగెడుపూవు చుట్టూ గనుగుపూవు అల్లుకున్నట్టుగా ప్రేమ చుట్టూ తిరుగుతున్నట్టుగా కనిపిస్తాయి. కాని పూల చాటున దాగిన ముళ్లలాగా హృదయానికి మెత్తగా గుచ్చుకుంటాయి. ప్రేమతో పాటు జీవితంలోని వెలుగు నీడలు కూడా ఆయా కథల్లో ప్రతిబింబిస్తాయి. ఇప్పటి సమాజ ముఖచిత్రాన్ని వినూత్న కోణంలో మనముందు నిలబెడుతాయి. శిల్ప పరంగా తెలంగాణ కథా ఔన్నత్యాన్ని పట్టిచూపే కథలివి.

**రివాజు (తెలంగాణ కథ - 2018) సంపాదకులు :** సంగిశెట్టి శ్రీనివాస్ – డా. వెల్దండి శ్రీధర్, **ప్రచురణ:** సింగిడి – తెలంగాణ రచయితల సంఘం, **వెల :** రూ. 70, **ప్రతులకు :** ప్రముఖ పొయ్యిల దుకాండ్లు, నవోదయ బుక్ హౌజ్, కాచిగూడ, హైదరాబాద్. సంగిశెట్టి శ్రీనివాస్, నందనవనం అపార్ట్‌మెంట్, ఫ్లాట్ నెం. 212, అత్తాపూర్, మెహదీపట్నం, హైదరాబాద్. ఫోన్: 9849220321.

---

ఈ పుస్తకంలోని కథల్ని పునరాలోచించినప్పుడు దగ్గుమాటి పద్మాకర్ ఒక కర్తవ్యదీక్షతోనే కథకుడిగా మారాడనీ, జీవితాన్ని అతడు సీరియస్‌గా తీసుకున్నాడనీ, తన చుట్టూ జరుగుతున్న వివిధ సంఘటనల గురించి లోతుగా ఆలోచిస్తున్నాడనీ, తన చుట్టూ జరుగుతున్న వివిధ సంఘటనల గురించి లోతుగా ఆలోచిస్తున్నాడనీ, అట్లాంటి సంఘటనలే మనకి కూడా తటస్థించినప్పుడు, మనం వాటినెట్లా అర్థం చేసుకోవాలో, వాటిపట్ల మనమెట్లా ప్రతిస్పందించాలో మనకొక దారి చూపిస్తున్నాడనీ ఈ కథల ద్వారా అర్థమవుతున్నది.

కొందరు కథకులు వర్తమానంలో వుంటూనే, భవిష్యత్తుని ఒడిసి పట్టుకుని దాన్ని వెనక్కి తెచ్చి దానికి గతాన్ని చూపించి వర్తమానం కోసం భవిష్యత్తు యేమిచేయాలో కర్తవ్య బోధ చేస్తారు.

**ఈస్తటిక్ స్పేస్ (కథలు) రచన :** దగ్గుమాటి పద్మాకర్, **ప్రచురణ :** సిక్కోలు బుక్ ట్రస్ట్, **వెల :** 200, **ప్రతులకు :** సిక్కోలు బుక్ ట్రస్ట్, శ్రీకాకుళం–532001, ఫోన్ : 9989265444.




---




పలికే సప్తస్వరాలలో తంత్రిని నేను / నర్తించే పాదాల మువ్వలు నేను / జాలువారిన అక్షరాల ఘంటం నేను / బ్రతుకును రంగుల్లో చిత్రించే కుంచెను నేను / నేను రైతు నాగలినే కాదు / సాలీల మగ్గాన్ని – కుమ్మరి సారెను / గౌడుల కత్తిని – మాదిగల ఆరెను / మంగలి కత్తెరను – జాలరి పడవను / సమస్త వృత్తుల పనిముట్టును నేను...

కవి నిధి అసలు పేరు మారేడు కొండ బ్రహ్మచారి. వీరి కవితలు చక్కని శైలితో సామాజిక స్పృహతో ఉంటాయి. ఇంతకుముందు రెండు కవితా సంపుటాలు స్పందన, పదును, దీర్ఘకవిత హైద్రాబాద్ సిర్ఫ్‌హమారా ప్రచురించారు. అభ్యుదయ రచయితల సంఘంలో క్రియాశీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

**మతలబ్ (కవిత్వం) రచన:** నిధి, **ప్రచురణ :** అరసం – వరంగల్, **వెల :** రూ. 70, **ప్రతులకు :** నవచేతన, విశాలాంధ్ర, నవతెలంగాణ, ప్రజాశక్తి, నవోదయ, నవయుగ, తెలుగు బుక్ హౌస్‌లలో లభించును.

---

జయరాజు జగమెరిగిన "ప్రజాకవి" వాగ్గేయకారుడు, ప్రజల హృదయాలను దోచిన మనసు కవి, ప్రకృతి రమణీయ దృశ్యాలను తన కలంలో నింపుకుని సాహిత్య విరజాజుల్ని పూయిస్తున్న "పుడమి కవి" సమాజానికి పట్టిన కులం, మతం, ఆకల, దరిద్రంపై ఫిరంగులు కురిపిస్తున్న "విప్లవ కవి" మమత, సమతానురాగాల తల్లి పేగై తట్టిలేపుతున్న ప్రేమ కవి. జీవితం, సాహిత్యం వేరు కాదని నిప్పుల కొలిమి నుండే సుఖాల చెలిమెలు తోడుతున్న "శ్రామిక కవి"... చిన్న చిన్న పదాలతో మహాద్భుతాలు సృష్టించే "సహజ కవి".... బుద్ధం శరణం అన్న వేదాంతి.... భారత్‌కు మార్క్స్ అంబేద్కర్ అన్న సిద్ధాంతి.

**అవని రచన :** జయరాజు, **వెల :** రూ. 499, **ప్రతులకు :** ప్రజాశక్తి బుక్ హౌస్, నవచేతన బుక్ హౌస్, భూమి బుక్ ట్రస్ట్, విశాలాంధ్ర బుక్‌హౌస్ మరియు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.




**సూచన: ఈ శీర్షికలో ప్రచురణ కోసం : రెండు పుస్తకాలను పంపించాలి.**




## పిల్లల పెంపకంలో మెళకువలు

అనువాదం : నిడమర్తి ఉమారాజేశ్వరరావు
ప్రచురణ : నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్
వెల : రూ. 250
ప్రతులకు : ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం.21/1, అజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్. ఫోన్: 040-27673787



## నేనెక్కడో తప్పిపోయిన (జ్ఞాపకాల చిత్తడి)

రచన : తుమ్మూరి రాంమోహన్‌రావు
ప్రచురణ : తెలుగు సాహితీ సదస్సు-సిర్పూర్
వెల : రూ. 100
ప్రతులకు : 11-5-/173, రాయంచ అవెన్యూ, పీర్జాదిగూడ, ఉప్పల్, హైదరాబాద్.
ఫోన్ : 97015 2224. ప్రముఖ పుస్తక కేంద్రాలలో.




## కడలి కన్నీరు (నవల)

రచయిత : ఎన్నవెళ్లి రాజమౌళి
ప్రచురణ : జాతీయ సాహిత్య పరిషత్, సిద్ధిపేట
వెల : రూ. 80
ప్రతులకు : ఎ. రాజమౌళి, తడ్కపల్లి సిద్ధిపేట.
ఫోన్ : 9848592331. నవచేతన పబ్లిషింగ్ హౌస్. హైదరాబాద్




## స్వీయ కవితానుజీవనమ్

లేఖకులు : శిరశినహళ్ కృష్ణమాచార్య శతావధాని
ప్రచురణ : తెలంగాణ సాహిత్య అకాడమి
వెల : రూ. 45
ప్రతులకు : తెలంగాణ సాహిత్య అకాడమి కార్యాలయం, కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్. ఫోన్ : 040-29703142




## వ్యూపా (కవిత్వం)

రచన : సుజనా రాజు
ప్రచురణ : తెలుగు రైటర్స్ అసోసియేషన్, మహారాష్ట్ర
వెల : రూ. 100
ప్రతులకు : ప్రముఖ పుస్తక కేంద్రాలలో.
ఫోన్ : 98881496122




## రూపాంతరం (జ్వలిత కథలు)

రచన : జ్వలిత
ప్రచురణ : సాహితీవనం ప్రచురణలు
వెల : రూ. 200
ప్రతులకు : ఇం.నెం.15-21-130/2, బాలాజీనగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్.




## పద్యపేటిక (డా॥ కపిలవాయి లింగమూర్తి)

సంపాదకులు : కపిలవాయి అశోక్‌బాబు,
డా. కసప నరేందర్
ప్రచురణ : వాణి ప్రచురణలు - నాగర్ కర్నూలు
వెల : రూ. 200
ప్రతులకు : ఇ.నెం. 1-9-312/2/ఎ, ఫ్లాట్ నెం.404, సి.బ్లాక్, వైదేహి నివాస్ గోల్డెన్ పామ్స్, విద్యానగర్, హైదరాబాద్. ఫోన్ : 8790727772




## నిజామాబాదు జిల్లా కవిత్వం

రచన : డా॥ వి. శంకర్
ప్రచురణ : తెలంగాణ రచయితల సంఘం
వెల : రూ. 150
ప్రతులకు : ఇం.నెం.4-15, దేవీవిహార్ కాలనీ, దేవునిపల్లి, కామారెడ్డి, నిజామాబాద్.
ఫోన్ : 9440798954




## సదాశివ కావ్యసుధ

సంపాదకుడు : కే. నారాయణ గౌడు
ప్రచురణ : తెలుగు సాహితీ సదస్సు-సిర్పూర్
వెల : రూ. 150
ప్రతులకు : నవదోయ, విశాలాంధ్ర,
ప్రజాశక్తి పుస్తక కేంద్రాలలో




## గజల్ సుమాలు (తెలుగు గజల్ సంకలనం)

ఎడిటర్ : వాహెద్
ప్రచురణ : జ్యోతిర్మయి తెలుగు గజల అకాడమీ బుక్స్
వెల : రూ. 200
ప్రతులకు : జ్యోతిర్మయి తెలుగు గజల్ అకాడమీ, విశాఖపట్నం, ఫోన్ : 99599 12541




## నా జీవితయాత్ర (ఆత్మకథ)

రచన : చలిమెడ ఆనందరావు
తెలుగు అనువాదం : డా॥ గండ్ర లక్ష్మణరావు
ప్రచురణ : చలిమెడ జానకీదేవి మెమోరియల్ ట్రస్ట్
ప్రతులకు : 1-2-56/38, దోమల్‌గూడా, హైదరాబాద్. ఫోన్ : 98496 45599




## గాన -స్వర మాంత్రికులు (తెలుగు సినీ సరాగాలు)

రచన : నిట్టల గోపాలకృష్ణ (లక్ష్మణరేఖ)
వెల : రూ. 200
ప్రతులకు : 202, శివసాయిసదన్, శ్రీనివాసపురం, 3వ వీధి, రామంతపూర్, హైదరాబాద్.
ఫోన్: 040-27037088






I go to **Oxford (ogs)**
**to learn life!**

ogs
JUNIORS
- grow naturally -

KNOWLEDGE IS POWER

# Oxford Grammar School

13TH STREET, HIMAYATNAGAR, HYD.

39 Years of meritorious performance

CBSE & SSC

RECONNECTING CHILDREN WITH NATURE

Phone: 040-27636214, Mobile: 9959612345,
email: ogshyd@gmail.com
website: www.oxfordgrammarschool.com

DECCAN LAND, Telugu Monthly Magazine 1st - March - 2020, ISSN 2581-3188
Postal Dates: 2nd & 3rd Every Month

RNI Regn. No. APTEL/2012/46784
Postal Permission, RNP/HD/1167/2018-2020








# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమి

హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు- ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం.

పిల్లలలో నైతికను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాల సాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. ***'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ'*** తెలంగాణాలోని ఉమ్మడి 10 జిల్లాల ***"బడి పిల్లల కథలు"*** సంకలనాలుగా అందమైన బొమ్మలతో వెలువరించింది.

























10 పుస్తకాల సెట్ ధర రూ. 330
తగ్గింపు ధర రూ. 300

ప్రతులకు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.
మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
*email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com*


Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, St.No.11, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar